www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 247 | మంగళవారం 27-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

మూడేళ్లలో

13 వేల స్కాంలు



- కేవలం ఏడాదిలో రూ.17 వేల కోట్లకు టోపీ
- పార్లమెంటుకు తెలిపిన ప్రభుత్వ లెక్కలివి..

దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో మోసాలు, కుంభకోణాలు ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. ఈ వ్యవస్థలో ఆర్థిక లావాదేవీలకు సామాన్య ప్రజలు ఇక్కట్లు పడుతుండగా, కార్పొరేట్‌లు, పారిశ్రామిక వేత్తలకు మాత్రం అద్భుత వరంగా మారింది. రుణాల మాయాజాలం యథేచ్ఛగా నడుస్తోంది. వరుస కుంభకోణాలు, మోసాలతో ఇప్పటికే పలు బ్యాంకులు అస్తవ్యస్థమయ్యాయి. బ్యాంకుల ఉన్నతాధికారులు, బడా బాబులు కుమ్మక్కై కోట్లు కొల్లగొట్టి దేశం దాటించేస్తున్నారు. ఈ విషయంలో అవినీతిరహిత పాలన అంటూ చెప్పకొస్తున్న మోడీ ప్రభుత్వ పాలనపై అనుమానాలు బలపడుతున్నాయి.

11 లో

చెక్కుడుగాళ్ల ఆస్తులకు చెక్

త్వరలో కొత్త చట్టం : కేంద్రం యోచన

న్యూఢిల్లీ :
కోట్లకు కోట్లు బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టి లేదా బ్యాంకులను మోసం చేసి విదేశాలకు చెక్కేస్తున్న రుణ ఎగవేతదారులకు ప్రభుత్వం షాకివ్వబోతుంది. ఆర్థిక నేరగాళ్లకు వ్యతిరేకంగా ప్రభుత్వం కఠిన చట్టం తీసుకొస్తోంది. ''ది ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ బిల్లు" పేరుతో దీన్ని త్వరలోనే ప్రవేశపెట్టబోతుంది. ఈ చట్టం ద్వారా నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లాంటి వారు బ్యాంకులకు భారీగా కన్నం వేసి విదేశాలకు పారిపోతే, వారి ఆస్తులను అమ్మే చట్టం. స్పెషల్ కోర్టు ద్వారా అన్ని బకాయిలను వెంటనే రికవరీ చేసుకునేలా ఈ బిల్లు సహకరించనుంది. విదేశాలకు పారిపోయినప్పటికీ, వారు ఏం దాచలేరని కచ్చితంగా ఇక్కడ అన్ని ఆస్తులను విక్రయించే అధికారం దక్కించుకునేలా ఈ బిల్లు తోడ్పడనుంది. గత సెప్టెంబర్‌లోనే కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ - మిగతా 2 లో

శ్రీదేవి మృతిపై అనుమానాలు

ఎన్నెన్నో..?







- తొలుత గుండెపోటుగా వార్తలు
- బాత్‌టబ్‌లో పడి మరణించిందని ఫోరెన్సిక్ నివేదిక ధ్రువీకరణ
- అభ్యంతరం తెలిపిన పబ్లిక్ ప్రాసిక్యూషన్
- మరింత విచారణ అవసరమని స్పష్టీకరణ
- బోనీకపూర్ పాస్‌పోర్ట్ స్వాధీనం
- హోటల్ సిబ్బందిపై ప్రశ్నల వర్షం
- మృతదేహం తరలించడంలో తీవ్ర జాప్యం

ముంబై / దుబాయి :
ప్రముఖ నటి శ్రీదేవి మృతిపై అనుమానాలు చోటుచేసుకున్నాయి. తొలుత ఆమె గుండెపోటుతో మరణించినట్లుగా భావించినా, దుబాయ్ పోలీసులు సోమవారం విడుదల చేసిన పోస్టుమార్టమ్ నివేదికలో మాత్రం ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో పడి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆమె శరీరంలో ఆల్కహాల్ ఆనవాళ్లను గుర్తించామని, ప్రమాదవశాత్తూ నీటిలో పడి మరణించినట్లు వైద్యులు ఫోరెన్సిక్ నివేదికలో పేర్కొన్నారు. 54 ఏళ్ల శ్రీదేవి శనివారం రాత్రి దుబాయ్‌లో తాను ఉన్న హోటల్ బాత్‌రూమ్‌లో మరణించారు. ఆమె భర్త బోనీకపూర్ విందుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆమె కోసం బాత్‌రూమ్ తలుపు కొట్టగా స్పందన లేకపోవడంతో శ్రీదేవి కదలిక లేకుండా పడి ఉన్నట్లు గుర్తించారు. ఆమె కార్డియాక్ అరెస్ట్‌తో మరణించినట్లు భావించారు. ఆస్పత్రి వెలుపలే శ్రీదేవి చనిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే అటుతర్వాత అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. శ్రీదేవి మృతిపై అనుమానాలు వచ్చాయి. బాత్ రూమ్ టబ్‌లో పడిపోయి మరణించిందని ఎలా నిర్ధారిస్తారని ప్రాసిక్యూషన్ అభ్యంతరం తెలుపుతూ ఈ కేసులో మరింత విచారణ అవసరమని ప్రాసిక్యూటర్ స్పష్టం చేసింది. దీంతో కేసు విచారణను దుబాయ్ పోలీసులు పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేశారు. భారత కాన్సులేట్ నుంచి - మిగతా 2 లో

ఆన్‌లైన్‌లోనే...

దరఖాస్తులు, ఫీజు చెల్లింపు

- ఎంసెట్ నోటిఫికేషన్ విడుదల
- 28 నుంచి మొదలు, ఆఖరు తేదీ మార్చి 29



విశాలాంధ్ర- కాకినాడ :
ఏపీ ఎంసెట్-2018 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు సోమవారం జేఎన్‌టీయూకె ఆర్‌అండ్‌డీ డైరెక్టర్, ఏపీ ఎంసెట్-2018 కన్వీనర్ ప్రొ.సిహెచ్.సాయిబాబు నోటిఫికేషన్ వివరాలు వెల్లడించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఏపీ ఎంసెట్-2018 పరీక్ష నిర్వహణను జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, కాకినాడ వరుసగా నాల్గవ సారి, రెండవసారి కంప్యూటర్ అధారిత (ఆన్‌లైన్) పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి బీటెక్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్/బి.ఎఫ్.ఎస్‌సి, బి.ఫార్మసీ, ఫార్మా డి కోర్సుల ప్రవేశ పరీక్షలకు నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 28వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో ఎంసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.
ఏపీ ఆన్‌లైన్/ టిఎస్ ఆన్‌లైన్/ క్రెడిట్/ డెబిట్/ నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.500 (ప్రాసెసింగ్ ఫీజుతో కలిపి) రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి ప్రవేశ పరీక్ష ఫీజు రూ.500, అగ్రికల్చరల్ విభాగానికి రూ.500 రెండు విభాగాలకు కలిపి రూ.1000 (ప్రాసెసింగ్ ఫీజుతో కలిపి) చెల్లించాలని, దరఖాస్తు చేసుకొనుటకు మార్చి 29 చివరి తేదీ అని తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 6వ తేదీ వరకు, రూ.1000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 11వ తేదీ వరకు, - మిగతా 2 లో

కదంతొక్కిన ఎర్రదండు

- మంగళగిరిలో వేలాదిమంది కార్యకర్తల ర్యాలీ
- ప్రారంభమైన సీపీఐ గుంటూరు జిల్లా 24వ మహాసభలు
- ధనరాజకీయాలకు స్వస్థిపలకాలి : రామకృష్ణ



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు :
గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. వేలాదిమందితో భారీగా ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌డీ బంగ్లా నుంచి పాతబస్టాండ్ వద్ద ఉన్న హీరా ఇస్లామిక్ పాఠశాల మైదానంలోని బహిరంగసభ వేదిక వరకు ర్యాలీ సాగింది. అక్కడ సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జిల్లా 24వ మహాసభలు ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. బహిరంగ సభకు హాజరైన వారితో మైదానం కిటకిటలాడింది. బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ధనరాజకీయాలకు స్వస్తిపలికి కమ్యూనిస్టులకు పట్టం కట్టాలని అప్పుడే సామాన్యులకు న్యాయం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కమ్యూనిస్టులే క్రియాశీలక పాత్ర పోషిస్తారన్నారు. సీపీఐ, సీపీఎంలు ఒక కీలకమైన భూమిక పోషించే రోజులు వస్తున్నాయన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కహామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత పెట్రోలు, డీజిల్ ధరలు గణనీయంగా పెరిగాయన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తామని ఆర్భాటంగా చెప్పిన కేంద్రం ఏమి సాధించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతకాని తనం వలనే మోడీ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కింది నుంచి పైస్థాయి వరకు ఉన్న అధికారుల్లో అవినీతి పెరిగిపోయిందన్నారు. జన్మభూమి కమిటీల సభ్యులు సైతం చనిపోయిన వారి పింఛన్లు తినే దుస్థితినెలకొందన్నారు. 23మంది ఎమ్మెల్యేలను సంతలో పశువుల తరహాలో కొనుగోలు చేసిందని విమర్శించారు. రాజకీయాల్లో మార్పులు రావాలంటే ప్రజల్లో మార్పురావాలన్నారు. పేదలకు భూమికోసం భుక్తికోసం - మిగతా 2 లో

ప్రాణాలు బలిగొన్న టెట్

అర్హత సాధించలేదని విద్యార్థిని ఆత్మహత్య



విశాలాంధ్ర కర్నూలు లీగల్ :
టెట్ క్వాలీఫై కాలేదన్న మనస్థాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని బస్తిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. బస్తిపాడు గ్రామానికి చెందిన సులోచన (25) శుక్రవారం నెల్లూరులో టెట్ పరీక్ష రాసింది. అర్హత సాధించకపోవడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగింది. పరిస్థితి గమనించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మృతురాలి కుటుంబసభ్యులు తెలిపారు.

పంజాబ్ సీఎం అల్లుడిపై సీబీఐ కేసు

9 లో

ఇదీ లోకం!



ఈ ప్రవాహం అంతా రెండురోజులే రేపటినుంచి మళ్లీ మామ్మూలేరా!

దుల్హన్‌లో దోపిడీ

- పెండింగ్‌లో దరఖాస్తులు
- సక్రమంగా అమలుకాని సంక్షేమ పథకాలు



విశాలాంధ్ర - అమరావతి :
దుల్హన్ పథకం ఇచ్చేది రూ.50వేలు... దరఖాస్తు నుంచి సంబంధిత పత్రాలు దాఖలు చేసేందుకు కార్యాలయాలు, నేతల చుట్టూ తిరగటానికి అయ్యే ఖర్చు లబ్దిదారులకు తడిసి మోపెడు అవుతోంది. 10 నుంచి 15వేలు ఖర్చు పెట్టుకొని ప్రభుత్వం ఇచ్చేదాని కోసం తిరుగుతున్నా సకాలంలో నిధులు మంజూరు కావటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ పేదలు వివాహం చేసుకుంటే వివాహ ఖర్చుల నిమిత్తం పెళ్ళి కుమార్తెకు ఆర్థిక సహాయం అందేలా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. పేద కుటుంబంలో యువతి వివాహం నిశ్చితార్థం కాగానే పెళ్ళి కుమార్తె పేరిటఆధారపత్రాలతో ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో సంబంధిత ఆధారపత్రాలతో దరఖాస్తు చేయాల్సి ఉంది. ఆ తర్వాత సదరు దరఖాస్తు సంబంధిత తహశీల్దార్‌కు అందించాలి. ఇక దరఖాస్తుదారుడు ఆ కార్యాలయం చుట్టూ తిరగటం, అడిగిన వారికి సమర్పించుకోవటం జరుగుతోంది. రెవెన్యూ కార్యాలయాల్లో అడిగే మామూళ్ళు సామాన్యులు - మిగతా 2 లో

పెట్టుబడులకు పూర్తి భరోసా

- గవర్నర్ హామీ
- కేంద్ర ఆవిష్కరణల హబ్ ఏపీ : సీఎం



విశాలాంధ్ర- విశాఖ :
ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టినవారికి అన్ని విధాల భద్రత కల్పిస్తామని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ తెలిపారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టినవారికి అన్ని విధాల సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. పెట్టుబడులు పెట్టాలన్న, పరిశ్రమలు నెలకొల్పాలంటే తగిన మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం ముఖ్యమని ఆయన అన్నారు. విశాఖలో సోమవారం జరిగిన పెట్టుబడుల ముగింపు సదస్సులో రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఏపీలో వ్యాపార అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, ప్రకృతి వనరులు అనేకం అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం కృతిమ మేథస్సు గురించి చర్చ జరుగుతుందని, భారతదేశం పూర్వకాలం నుంచి సహజసిద్దమైన తెలివితేటలు, విజ్ఞానంలో మొదటివరసలో ఉందన్నారు. వీటన్నింటికంటే ప్రజల్లో సంతృప్తి, సంతోషమే ముఖ్యమన్నారు. పేదరిక నిర్మూలన ద్వారానే ఇది సాధ్యపడుతుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కార్యదక్షతను ఆయన ప్రశంసించారు. మిషన్, విజన్, ఎగ్జిక్యూషన్ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడని కొనియాడారు. సీఎం చంద్రబాబుతో తనకు మూడు దశాబ్ధాలుగా బంధం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబ నాలుగు దశాబ్ధాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆహుతులు కూడా తమ కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ భవిష్యత్ - మిగతా 2 లో

సిరియాకు బెదిరింపులు ఆపాలి : రష్యా



మాస్కో : సిరియా ప్రభుత్వానికి అమెరికా బెదిరింపులను నిలిపివేయాలని రష్యా డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సిరియాలో కాల్పుల విరమణ తీర్మానాన్ని ఆమోదించిన తరువాత రష్యా రాయబారి వశ్లీనెబంజియ మాట్లాడుతూ అమెరికా అధికారులు స్వతంత్రదేశమైన సిరియాపై దాడిచేస్తామని బహిరంగ ప్రకట నలు చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతామండలిలో కొత్తగా ఆమోదించిన తీర్మానాన్ని ఏకపక్షంగా తమ ఇష్టానుసారం అన్వయించడాన్ని తాము ఎంతమాత్రం అనుమతించబోమని నేరుగా హెచ్చరిస్తున్నాము. బాధ్యతారహితంగా మాట్లాడటాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాము. భద్రతామండలి చేసిన తీర్మానం 2254 ఆధారంగా సిరియాలో సంఘర్షణ సమస్యను పరిష్కరించే ఉమ్మడి కృషిలో అమెరికా తక్షణం పాల్గొనాలని కోరుతున్నామని నెబంజియ అన్నారు. సిరియాలో గత 30 రోజులుగా నెలకొనివున్న సంఘర్షణ వాతావర ణాన్ని తక్షణం నిలిపివేయవలసిందిగా 2401 తీర్మానం ద్వారా భద్రతామండలి విజ్ఞప్తి చేసింది. ఈ తీర్మానాన్ని రష్యా సమర్థించింది. గతంలో చేసిన తీర్మానాలను, చేసిన నిర్ణయాలను అమలు చేయవలసిందిగా రష్యా కోరింది. సిరియాలో టెర్రరిస్టు సంస్థలకు వ్యతిరేకంగా జరిగే దాడులకు కాల్పుల విరమణ వర్తించదని టెర్రరిజంపై పోరాటం కొనసాగుతుందని రష్యా తెలిపింది. కువైట్, స్వీడన్‌లు తీర్మానం ముసాయిదాను రూపొందించాయి.

లండన్‌లో పేలుడు : నలుగురి మృతి

లండన్ : బ్రిటన్‌లోని లీసెస్టర్ నగరంలో శక్తివంతమైన పేలుడు కారణంగా అత్యంత భారీ భవనం ధ్వంసమయ్యింది. ఈ పేలుడులో నలుగురు మృతిచెందారని పోలీసులు తెలిపారు. లండన్‌కు 143 కి.మీ. దూరంలోగల లీసెస్టర్ నగరంలో హింక్లీరోడ్ ఏరియాలో నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు ఉన్నచోట ఈ భవనం కూలిపోయిందని పోలీసులు తెలిపారు. భవనం ధ్వంసమయినప్పుడు చెలరేగిన మంటల్లో ఒక షాపు, ఒక ఫ్లాటు కాలిపోయాయని పోలీసులు తెలిపారు. గాయపడిన ఆరుగురి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పేలుడుకు కారణాలపైన దర్యాప్తు చేస్తున్నారు. ఈ పేలుడుకు టెర్రరిస్టులు కారణమా? అన్న దిశలో దర్యాప్తు సాగుతున్నదని పోలీసులు చెప్పారు. అయితే ఇంతవరకు ఇందుకు సంబంధించిన సూచనలేమీ లభించలేదని అన్నారు.

విశాలాంధ్ర ప్రపంచం

కమ్యూనిస్టు ప్రణాళికతోనే

పాశ్చాత్య సమాజంలో మార్పు



లండన్ : పాశ్చాత్య సమాజంలో మార్పు సంభవించి అత్యధిక ప్రజలు ప్రయోజనాలను పరిరక్షించేందుకు కమ్యూనిస్టు ప్రణాళికలో మాత్రమే సంపూర్ణమైన విశ్లేషణ, పూర్తి అవగాహన, లక్ష్యం ఉన్నాయని బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి రాబర్ట్ గ్రిఫిత్స్ తెలిపారు. కమ్యూనిస్టు సిద్ధాంత రూకర్తకారల్ మార్క్స్ కాలంనుండి నుండి పశ్చిమ దేశాల పెట్టుబడిదారి సమాజం వర్గవిభజన సమాజంగానే కొనసాగుతున్నది అని జిన్హువా వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురించి 170 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆయన ఈ ఇంటర్వ్యూ ఇచ్చారు. "అత్యధిక ప్రజలు నేటికీ తమ జీవనం కోసం ఆర్థిక వ్యవస్థలో అత్యధిక భాగం నియంత్రణ మార్గదర్శకత్వంలోనే పనిచేయడానికి చాలా తక్కువ అవకాశం లేదా అసలు అవకాశంలేమి కొనసాగుతున్నది. అంతేకాదు వీరి నియంత్రణలోనే సమాజం మొత్తం వారు చెప్పిన దిశలో పయనిస్తున్నది" అని గ్రిఫిత్స్ అన్నారు. మార్క్స్ ఆయన స్నేహితుడు ఫ్రెడరిక్ ఏంగిల్స్ 1848 ఫిబ్రవరిలో లండన్‌లో కమ్యూనిస్టు ప్రణాళికను ప్రచురించారు. అందులో గతించిన చరిత్ర అంతా సమాజంలో వర్గపోరాటాల చరిత్రే అని విశ్లేషించారు. కార్మికవర్గ పోరాటాల విజయం ద్వారా వర్గ సమాజాన్ని శాశ్వతంగా రూపుమాపవచ్చు అని పేర్కొన్నారు. బ్రిటన్, ప్రపంచ దేశాలన్నిటిలోను అనేక బిలియన్ల ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలో పెట్టుబడిదారి సమాజం విఫలమవుతూనే ఉన్నది. సోషలిస్టు, మార్క్సిస్టు భావజాలంపట్ల పాశ్చాత్య సమాజం తన ఆసక్తిని కొనసాగిస్తున్నది. కార్పొరేట్ శక్తుల అత్యాశనుంచి పుట్టిందే ఆర్థికమాంద్యం, ప్రపంచ ద్రవ్య సంక్షోభం అని గ్రిఫిత్స్ అన్నారు. ప్రజల ఆందోళనలకు పాశ్చాత్య సమాజం సరైన పరిష్కారం చూపగలదన్న ఆశను నయా ఉదారవాద ప్రయోగం కల్పించింది.

ప్రయోగం ఉత్తమమైందికాదని అనేకమంది ప్రజలు సరిగ్గానే విశ్వసిస్తున్నారు. అత్యధిక ప్రజల ప్రయోజనాలను నెరవేర్చగల సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను రూపొందించవలసిన అవసరం ఉంది. కొద్దిమంది సంపన్నుల, ఉన్నతస్థాయి వర్గం, శక్తివంతమైన కొద్దిమంది ప్రజల ప్రయోజనాలను నెరవేర్చడానికి మాత్రం ఈ సమాజాన్ని నిర్మించరాదు అని ఆయన అన్నారు. పేదరిక నిర్మూలనలో చైనా సాధించిన విజయం మానవ చరిత్రలో సాటిలేనిది అని గ్రిఫిత్స్ ప్రశంసించారు.

ఇటలీలో ఫాసిస్టు వ్యతిరేక ర్యాలీలు



రోమ్ : ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ఇటలీలోని పలు నగరాలలో ర్యాలీలు జరుగుతున్నాయి. ఆదివారం టురిన్ పట్టణంలో భారీ ర్యాలీ జరిగింది. రోమ్ నగరంలో భారీ ర్యాలీ నరిపేందుకు నిర్ణయించారు. ఫాసిజాన్ని అనుమతించరాదని ర్యాలీలో పాల్గొన్నవారు నినాదాలు చేశారు. మార్చి 4వ తేదీన జరగనున్న ఎన్నికల సందర్భంగా ఫాసిస్టులు అనేక దౌర్జన్యాలకు పూనుకుంటున్నారు. ఈ దాడులను ప్రతిఘటించేందుకు ప్రజాసమీకరణ చేయవలసినదిగా వివిధ ట్రేడ్ యూనియన్లు, ఇతర గ్రూపులు విజ్ఞప్తి చేస్తున్నాయి. దేశంలోని అతి పెద్ద యూనియన్ సిజిఐఎల్, చేతివృత్తుల కార్మికుల యూనియన్ అన్పి, కమ్యూనిస్టు రీఫౌండేషన్ పార్టీ పిలుపునిచ్చాయి. ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుసానకముస్సో మాట్లాడుతూ అసమానతలు గణనీయంగా తగ్గిపోయిన ప్రాంతాలలో సైతం ఫాసిస్టు శక్తులు అసమానతలను పెంచుతూ పెట్టుబడిదారీ ప్రపంచీకరణను ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. కమ్యూనిస్టు రీ ఫౌండేషన్ పార్టీ ప్రధాన కార్యదర్శి మౌరిజియోవ్అశిర్బొ మాట్లాడుతూ పాలక డెమోక్రటిక్ పార్టీ ఫాసిస్టులను నిలువరించేందుకు కనీస ప్రయత్నం చేయడంలేదని విమర్శించారు. యూరోపియన్ యూనియన్ ఒప్పందాల ద్వారా మధ్యేవాద, మితవాద ప్రభుత్వాలు రుద్దిన నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష శక్తులు ఉద్యమాలను నిర్మించాలని ఆయన కోరారు. టురిన్‌లో జరిగిన ర్యాలీలో 500 మందిపైగా పాల్గొన్నారు. ఫాసిస్టులు సమావేశమైన హోటల్ వద్ద పోలీసులు భద్రతాచ ఏర్పాట్లు చేయడాన్ని నిరసించారు.

సిరియాపై రష్యాతో కలిసి పనిచేస్తాం

ఫ్రాన్స్, జర్మనీ నేతల స్పష్టీకరణ



పారిస్ : సిరియాలో శత్రుత్వాలను రూపుమాపేందుకు రష్యాతో కలిసి పనిచేస్తామని ఫ్రాన్స్, జర్మనీలు ఆదివారం ప్రకటించాయి. జెనీవా ఒప్పందం పరిధిలో విశ్వసనీయమైన రాజకీయ పరిష్కారం కోసం అంతర్జాతీయ సమాజంతో కలిసి కృషి చేయవలసివుంటుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్, జర్మనీ ఛాన్సలర్ ఏంజిలా మర్కెల్ సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. వీరిరువురు రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌తో మాట్లాడిన అనంతరం ఈ ప్రకటన విడుదల చేశారు. ఇందుకోసం ఫ్రాన్స్ యూరోపియన్ వ్యవహారాల మంత్రి జీన్‌ఎవస్‌లీడ్రియన్ ప్రస్తుతం మాస్కోలో పర్యటిస్తున్నారు. సమస్య పరిష్కార క్రమంలో సిరియా ప్రభుత్వం తక్షణం సైనిక చర్యను నిలిపివేయవలసిందిగా గరిష్టంగా ఒత్తిడి తీసుకురావాలని మాక్రాన్ మర్కెల్ రష్యాను కోరారు. కాల్పుల విరమణను కోరుతూ ఐక్యరాజ్యసమితి భద్రతామండలి చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని వారు కోరారు. ఈ తీర్మానం అమలుకు ఆస్థానంలో సమావేశమై నిర్ణయాలు చేసిన రష్యా, ఇరాన్, టర్కీలు తమ పలుకుబడిని వినియోగించాలని వారు కోరారు.

అమెరికాలో యూనియన్లకు విరాళాలపై వేటు?

వాషింగ్టన్ : అమెరికాలో ట్రేడ్ యూనియన్లకు విరాళాలను నిరోధించేందుకు కోచ్ బ్రదర్స్‌తో సహా పలువురు దాతలు ప్రయత్నిస్తున్నారు. ట్రేడ్ యూనియన్లను నిర్వీర్యంచేసి సమ్మెలను నివారించేందుకు, ప్రగతిశీల ఉద్యమాలను నిలువరించేందుకు సుదీర్ఘకాలంగా బిలియనీర్లయిన దాతలు ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నారు. అంతిమంగా వీరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తులు ఈ పిటిషన్‌ను విచారించనున్నారు. యూనియన్లకు ప్రధాన ఆర్థిక వనరులు విరాళాలే. ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేసే యూనియన్ల విరాళాలపై సుప్రీంకోర్టు వేటు వేస్తుందా? అన్న సందేహం బలంగావుంది. కోర్టు యూనియన్లకు వ్యతిరేకంగా తీర్పునిచ్చినట్లయితే దాని ప్రభావం 7.2 మిలియన్లమంది కార్మికులపైన, పరోక్షంగా సమాజం మొత్తంపైన ఉంటుంది. కార్పొరేట్ సంపన్నులను మితవాద కార్యకర్తలు, మేధావులు సమర్థిస్తున్నారు. కోచ్ బ్రదర్సుతో పాటు బ్రాడ్లీ ఫౌండేషన్ కూడా విరాళాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నది.

ఈజిప్టులో విస్తృత ఎన్నికల ప్రచారం




కైరో : ఈజిప్టులో అధ్యక్ష పదవి కోసం జరగనున్న ఎన్నికల ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు అబ్దల్‌ఫతాహ్‌అల్‌సిసి తేలికగానే గెలిచే అవకాశాలు న్నాయని తెలుస్తోంది. మార్చి 26-28 తేదీలలో అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల కమిషన్ గతంలోనే ప్రకటించింది. ఏప్రిల్ 2న ఫలితాలను ప్రకటిస్తారు. ప్రచారం ప్రారంభమైన నాటినుంచి ప్రధాన రహదారుల్లోను ఆయా పార్టీల చిహ్నాలను, బ్యానర్లను, పోస్టర్లను ప్లకార్డులను అలంకరించి ప్రచారం చేస్తున్నారు. సిసిపైన మౌసాముస్తఫామౌసా పోటీ చేస్తున్నారు. లిబరల్ ఘాద్ పార్టీ ఛైర్మన్ మాత్రమే పోటీలో సిసితో పాటు రంగంలోవున్నారు. ఇద్దరు బలమైన అభ్యర్థులు పోటీనుంచి విరమించుకున్నారు. కైరో డౌన్‌టౌన్‌లో సిసికి అనుకూలంగా వాల్‌పోస్టర్లు, బ్యానర్లు అలంకరించి ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. మౌసా అనుకూల బ్యానర్లు, పోస్టర్లు కనిపించడంలేదు. ప్రచారం కూడా అంతంత మాత్రంగానే ఉంది.

దుల్హన్‌లో దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ ఇచ్చుకున్నా కూడా రెవెన్యూ కార్యాలయాల నుంచి దరఖాస్తులు ఓ పట్టాన కదలవు. ఎంతోకొంత ఇచ్చి దరఖాస్తులను మైనార్టీశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తే ఆ కార్యాలయాల్లో సిబ్బంది 'మాకేంటి' అంటూ దరఖాస్తులను నొక్కిపెట్టి ఉంచుతారు. తిరిగి అక్కడకు చేరుకొని మామూళ్ళు ముట్టచెప్పిన తర్వాత సదరు దరఖాస్తులను జిల్లా మైనార్టీశాఖ అధికారిమంజూరు చేసి మైనార్టీ కమిషనర్ కార్యాలయానికి పంపుతారు. ఆ తర్వాత ఆర్థిక సహాయం పెళ్ళికుమార్తె అకౌంట్‌కు మంజూరు చేస్తారు. అయితే ఇదంతా జరిగేటప్పటికీ పుణ్యకాలం పూర్తవుతుంది. దరఖాస్తు చేసుకున్న పెళ్ళికుమార్తె వివాహం జరిగిపోతుంది. సమయానికి మాత్రం ఆర్థిక సహాయం అందదు. రాష్ట్రంలోని 13 జిల్లాలలో జిల్లాకు వేయి నుండి 1500లు దరఖాస్తులు ఇప్పటికి మంజూరు చేసి ఉంటారని సమాచారం. అయితే చాలా జిల్లాల్లో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పథకానికి సంబంధించి నిధులను ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి విడుదల చేస్తుంది. విడుదల చేసిన నిధులు సరిపోకపోతే నెలల తరబడి ఆ దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటాయి. ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి గతేడాది రూ.800కోట్లు కేటాయించింది. మైనార్టీ కార్పొరేషన్ మైనార్టీలకు అందాల్సిన సంక్షేమ పథకాలను సరిగా అమలు చేయటం లేదని శాసనమండలి సభ్యుడు షరీఫ్ గడిచిన మండలి సమావేశాల్లో ప్రశ్నించారు. అందులో దుల్హన్ పథకం అమలు కూడా సరిగా జరగటం లేదన్నారు. మైనార్టీశాఖలో నిధులు ఉన్నా కూడా దుల్హన్ లబ్దిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందటం లేదని మైనార్టీ పేదలు చెప్తున్నారు. అలాగే మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సబ్సిడీపై ఇచ్చే రుణాలు, వాహనాలకు రుణ మంజూరులో కూడా తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు దరఖాస్తుదారులు చెప్పుకొస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు మైనార్టీలను ఆదుకొనే సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని మైనార్టీ లబ్దిదారులు కోరుతున్నారు.

ఎన్నెన్నో..? (మొదటిపేజీ తరువాయి)



మరిన్ని పత్రాలను దుబాయ్ ప్రాసిక్యూషన్ అధికారులు కోరారు. దుబాయ్ పోలీసులు బోనీకపూర్ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని ఆయన్ను, హోటల్ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. శ్రీదేవి, బోనీకపూర్‌ల కాల్ డేటాను పరిశీలిస్తున్నారు. కేసు విచారణ పూర్తయ్యే వరకు బోనీకపూర్ దుబాయ్‌లోనే ఉండాలని కోరారు.

దీంతో ఇంకా అనేక ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉన్నందున మరింత జాప్యమయ్యే అవకాశముంది. ఇప్పటికీ శ్రీదేవి భౌతికకాయం దుబాయ్ పోలీస్ ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ వద్దే ఉంది. ఈ నేపథ్యంలో శ్రీదేవి మృతదేహాన్ని ఈరోజు అప్పగించలేమని దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. ఈ సందేహాలన్నీ ఎలా ఉన్నా, యూఏఈ ఆరోగ్య శాఖ శ్రీదేవి మృతి వెనుక ఎలాంటి కుట్రలేదని స్పష్టం చేయడం గమనార్హం. ఇదిలాఉండగా, శ్రీదేవి భౌతికకాయాన్ని భారత్‌కు తీసుకువచ్చేందుకు వ్యాపారవేత్త అనిల్ అంబానీ చార్టర్డ్ విమానాన్ని ఏర్పాటు చేశారు.

బోనీపైనే అనుమానాలా?

శ్రీదేవి గుండెపోటువల్లే చనిపోయినట్లు ఆమె మరిది సంజయ్ కపూర్ మీడియాకు వివరించిన సంగతి తెలిసిందే. అయితే ఫోరెన్సిక్ రిపోర్టు ఇవ్వడానికి కొన్ని గంటల ముందు నుంచి బోనీకపూర్‌ను దాదాపు 3 గంటలపాటు దుబాయ్ పోలీసులు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. శుక్రవారం సాయంత్రం 5:30 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఏం జరిగింది. పెళ్ళి జరిగిన తర్వాత కూడా అక్కడే ఎందుకున్నారు. ముందుగా శ్రీదేవి భౌతికకాయాన్ని ఎవరు చూశారు. ఆమెను బయటకు తీసుకురావడానికి ఎవరు సాయపడ్డారు. శ్రీదేవిని టబ్‌లో అపస్మారక స్థితిలో చూసిన తర్వాత ఆమెను ఆస్పత్రికి ఎవరెవరు తరలించారు. తదితర ప్రశ్నలతో పాటు అక్కడి పరిస్థితులపై ఆరా తీసినట్లు సమాచారం. బోనీ ఇచ్చిన వివరాల ఆధారంగా ఆయనతో ఆస్పత్రికి వచ్చినట్లు చెబుతున్న ముగ్గురు వ్యక్తులను కూడా పోలీసులు ప్రశ్నించారు. ఈ ఫోరెన్సిక్ రిపోర్టు నేపథ్యంలో బోనీకపూర్‌ను దాదాపు మూడున్నర గంటల పాటు ప్రశ్నించి ఆ సమాచారాన్ని రికార్డ్ చేశారు. మొత్తం నలుగురు ఉన్నతాధికారులు ఆయనను విచారించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆస్పత్రిలో శ్రీదేవి భౌతికకాయాన్ని పరిశీలించిన డాక్టర్ల వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేసినట్లుగా తెలుస్తోంది. వారితో పాటు రషీద్ ఆస్పత్రిలోని ఇద్దరు డాక్టర్లు, ఐదుగురు అటెండర్లను కూడా విచారించినట్లు తెలుస్తోంది.

సినీ ప్రముఖులు, అభిమానుల ఎదురుచూపు

శ్రీదేవి మృతదేహం భారత్‌కు చేరే కచ్చితమైన సమయంపై సందిగ్ధత నెలకొంది. శ్రీదేవి ఇకలేరన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్న సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు తుది వీడ్కోలు పలికేందుకు బాధాతప్త హృదయాలతో వేచి చూస్తున్నారు. సోమవారం మధ్యాహ్నమే వివిధ భాషలకు చెందిన సినీ ప్రముఖులు ముంబయి చేరుకున్నారు. శ్రీదేవి శవపరీక్ష, ఫోరెన్సిక్ నివేదికలను దుబాయ్ పోలీసులు బయటపెట్టారు. ఆమె భౌతిక కాయాన్ని ఇంకా కుటుంబ సభ్యులకు అప్పగించలేదు. ఆమె పార్థివదేహం ఇంకా దుబాయ్‌లోని అల్‌హుస్సేనీ పోలీసు శవాగారంలో ఉండగా, భారత దౌత్య అధికారులతో కలిసి ఆమె కుటుంబ సభ్యుల్ని దుబాయ్ ప్రభుత్వ వర్గాలు లోపలికి అనుమతించాయి. తుది నివేదిక రూపొందించడం సహా ఇతర న్యాయ పరమైన ప్రక్రియల్ని పోలీసులు ఇంకా పూర్తిచేయాల్సి ఉంది. ఈ తతంగమంతా ముగిశాక ఆమె పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ఆ తర్వాత ఇమ్మిగ్రేషన్ సహా ఇతర లాంఛనాలు పూర్తిచేసేందుకు మరికొంత సమయం పడుతుందని భారత రాయభార కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీదేవి భౌతికకాయం ఈ అర్ధరాత్రి లేదా ఆ తర్వాతే ముంబయి చేరుకొనే అవకాశాలు కనబడుతున్నాయి.



అనిల్‌కపూర్ నివాసానికి వెళుతున్న కమల్‌హాసన్

తొలుత ఇంటికి.. ఆ తర్వాత మహబూబ్ స్టూడియోకు..

శ్రీదేవి పార్థివదేహాన్ని తొలుత ముంబయిలోని లోఖండ్‌వాల్‌లోని ఆమె నివాసానికి తరలిస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి మహబూబ్ స్టూడియోకి తరలిస్తారు. సినీ ప్రముఖులు, అభిమానుల నివాళుల అనంతరం అంతిమయాత్ర ప్రారంభం కానుంది. పవన్‌హన్స్ స్మశాన వాటికలో అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. తమ అభిమాన నటికి నివాళులర్పించేందుకు ఇప్పటికే వేర్వేరు రాష్ట్రాలకు చెందిన సినీ ప్రముఖులు ముంబయి చేరుకున్నారు. టబు, పరాఖాన్, మాధురీ దీక్షిత్, వెంకటేశ్, సహా సినీ పరిశ్రమకు చెందిన పలువురు అనిల్‌కపూర్ నివాసానికి వెళ్లి శ్రీదేవి మృతిపట్ల తమ సంతాపాన్ని తెలియజేశారు.

ఆస్తులకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించిన ఈ ముసాయిదను ఆమోదించింది. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ఈ బిల్లును అమలులోకి తేవాలని మోడీ ప్రభుత్వం ఆలోచిస్తున్నది. మార్చి 6 నుంచి జరుగబోతున్న తదుపరి బడ్జెట్ సెషన్లలో దీన్ని ఆమోదించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఒక్కసారి ఈ బిల్లు ఆమోదిస్తే, దర్యాప్తు సంస్థ విదేశాలకు పారిపోయిన రుణ ఎగవేతదారులు, బ్యాంకులకు మోసాలకు పాల్పడిన ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను ఎలాంటి దాడులు చేయకుండానే స్వాధీనం చేసుకోవచ్చు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ కూడా ఈ చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తులు, ఫీజు చెల్లింపు

(మొదటిపేజీ తరువాయి)

రూ.5000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 16వ తేదీ వరకు, రూ.10000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మొదటిగా విద్యార్థులు నిర్దేశించిన వెబ్‌సైట్‌లో పరీక్షకు సంబంధించిన ఫీజును ఆన్‌లైన్ విధానంలో ఏపీ ఆన్‌లైన్/టీఎస్ ఆన్‌లైన్/క్రెడిట్/డెబిట్/నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే కట్టాల్సి ఉందన్నారు. పరీక్ష ఫీజు చెల్లింపు, సిలబస్ ఇతర పూర్తి వివరాలను నిర్దేశించిన వెబ్‌సైట్ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించుకోవడంతో పాటు దరఖాస్తు పూరించే విధానాన్ని యూజర్ గైడ్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో విద్యార్థి మూడు రీజనల్ సెంటర్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని, విద్యార్థి యొక్క ప్రాధాన్యతను బట్టి ఈ మూడింటిలో ఒక రీజనల్ సెంటర్‌లో మాత్రమే పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు. హాల్ టికెట్‌లను ఏప్రిల్ 18వ తేదీ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, ఇంజనీరింగ్ పరీక్షను ఏప్రిల్ 22, 23, 24, 25 తేదీలలోను, అగ్రికల్చర్ పరీక్షను ఏప్రిల్ 25, 26 తేదీలలో ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

ఉర్దూ అనువాదం కావాలనుకునే వారికి కర్నూలులో మాత్రమే పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు. పరీక్ష తేదీనిగానీ, సమయాన్నిగానీ విద్యార్థి ఎంపిక చేసుకోవడానికి అవకాశం లేదని, పరీక్షా కేంద్రాన్ని, పరీక్ష తేదీ, సమయాన్ని విద్యార్థులకు హాల్‌టికెట్‌లో తెలియజేయటం జరుగుతుందని, విద్యార్థికి హాల్‌టికెట్‌లో ఏ తేదీన ఏ స్లాట్ కేటాయించారో ఆ రోజునే పరీక్షకు హాజరు కావాలని, కేటాయించిన రోజున కేటాయించిన సమయంలో పరీక్షకు హాజరు కాకుంటే ఆ విద్యార్థిని పరీక్షకు గైర్హాజరైనట్లుగా పరిగణిస్తామన్నారు. ఈ ప్రవేశ పరీక్ష శ్రీకాకుళం, రాజాం, టెక్కలి, విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం సిటీ, ఆనందపురం, గాజువాక, అనకాపల్లి, కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, విజయవాడ, మైలవరం, కంచికచర్ల, గుడ్లవల్లేరు, గుంటూరు, నరసారావుపేట, బాపట్ల, ఒంగోలు, మార్కాపురం, చీరాల, నెల్లూరు, కావలి, గూడూరు, చిత్తూరు, పుత్తూరు, తిరుపతి, మదనపల్లి, కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, అనంతపురం, గుత్తి, హిందూపూర్, కర్నూలు, నంద్యాల అలాగే హైదరాబాద్‌లో ఎల్బీ నగర్, నాచారం, సికింద్రాబాద్‌లలో ఎంపిక చేసిన కేంద్రాలలో జరుగుతుందన్నారు. ఏపీ ఎంసెట్-2018కు సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 0884-2340535, 0884-2356255 ఫోన్ నెంబర్ల ద్వారా గాని, ఈమెయిల్ ఐడి apeamcet18@gmail.com ద్వారాగానీ సంప్రదించాలని కన్వీనర్ సూచించారు.

పూర్తి భరోసా

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతికత పరిజ్ఞానాలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంటుందన్నారు. సాంకేతికను అందిపుచ్చుకోవడంలో, మార్పును ఆహ్వానించడంలో రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో ఏపీ దేశంలోనే ముందంజలో ఉందన్నారు. ఇక్కడ ఏర్పాటుచేస్తున్న ఇన్నోవేషన్ వ్యాలీ, సిల్కాన్ వ్యాలీలో ఇతర రాష్ట్రాలను మించిపోతుందన్నారు. ప్రపంచమంతా ఇక్కడ జరుగుతున్న ఆవిష్కరణల గురించి చర్చించే పరిస్థితి వస్తుందని ఎంతో విశ్వాసంతో ఉన్నామన్నారు. అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంలో ఒకటిగా రూపొందుతుందన్నారు. మూడురోజుల పాటు జరిగిన భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని పేర్కొన్నారు. ఈ సదస్సులో మొత్తం 739 ఒప్పందాలు, రూ. 4.39లక్షల కోట్లు పెట్టుబడులు ద్వారా 11.02లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. ఒప్పందాలన్నీ పూర్తి పారదర్శకంగా అమలుచేస్తున్నామన్నారు. ఒక రోజులోనే 369 ఒప్పందాలు, రూ.2.20లక్షల కోట్ల పెట్టుబడులు, 7.17 ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. గతంలో చేసుకున్న ఒప్పందాలు 58.7శాతం కార్యరూపం దాల్చాయన్నారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి ఎస్ ఈశ్వరమ్ మాట్లాడుతూ అమరావతి నిర్మాణంలో ఏపీ, సింగపూర్ ప్రభుత్వాలు కలసి పనిచేస్తాయన్నారు. సింగపూర్ బిజినెస్ కౌన్సిలింగ్, ఏపీ ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందాల వల్ల రెండు ప్రభుత్వాల మధ్య బంధం మరింత బలపడుతుందన్నారు. కేంద్ర పరిశ్రమల శాఖామంతి సురేష్ ప్రభు మాట్లాడుతూ భవిష్యత్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందుతుందన్నారు. ఇక్కడ పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఉన్న కారణంగా పారిశ్రామిక వేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆశక్తి చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మారిషస్ ఉపాధ్యక్షులు వి పరమశివం పిళ్లై, కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు, సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న రామకృష్ణ, వేదికపై ఓబులేసు, ముప్పాళ్ళ, జంగాల తదితరులు

కదంతొక్కిన ఎర్రదండు

(మొదటిపేజీ తరువాయి)

పోరాటాలు చేసింది ఒక్క భారత కమ్యూనిస్టు పార్టీనే నన్నారు. గరగపర్రు, పెదగొట్టిపాడులలో దళితులకు అండగా, అగ్రిగోల్డ్‌బాధితులకు అండగా సీపీఐ పోరాటాలు చేసిందన్నారు. 2018వ సంవత్సరాన్ని సీపీఐ పోరాటాల సంవత్సరంగా పేర్కొందని రామకృష్ణ తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పెట్టుబడిదారీ పార్టీల పాలనకు అంతం పలకాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు అవినీతికి పాల్పడుతున్న కారణంగానే దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడుతున్నదన్నారు. చట్టసభలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా ఉండాల న్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ సీపీఐ నిరంతరం పేదలకు అండగా అనేక పోరాటాలు చేస్తున్నదన్నారు. రాజకీయాల్లో మార్పులు రావాలంటే వామపక్ష, లౌకిక శక్తులకు ప్రజలు పట్టం కట్టాలన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవగేయాలు ఉత్తేజాన్ని నింపాయి. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీఆర్ మోహన్‌రావు, మారుతీవరప్రసాద్, కోట మాల్యాద్రి, షేక్‌హుస్సేన్, కాసా రాంబాబు, పులి సాంబశివరావు, బాలాజీ, మునునూరి రమేష్‌బాబు, ఖైరాపట్నం రామకృష్ణ, సాంబశివరావు, కంచర్ల కాశి, శింగరామయ్య, వేణుగోపాల్‌రావు, విజయ్‌కుమార్, కోటేశ్వరరావు, రమారెడ్డి, వెంకయ్య, ఉప్పలపాటి రంగయ్య, బాలస్వామిరెడ్డి, జేపీ శ్రీధర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు గని, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మార్కెట్ కమిటీ చైర్మన్లకు వేతనాల పెంపు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల జీతాలు భారీగా పెరిగాయి. చైర్మన్‌ల జీతాలు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సెలెక్షన్ గ్రేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ నెల జీతం రూ.2,000 నుంచి 25,000లకు, స్పెషల్ గ్రేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ 1,500 నుంచి రూ.20,000 లకు, గ్రేడ్ 1 మార్కెట్ కమిటీ చైర్మన్ జీతం 1,000 నుంచి రూ.15,000లకు, గ్రేడ్ 2, 3 మార్కెట్ల కమిటీ చైర్మన్‌లకు 500 నుంచి రూ.15,000లకు జీతాలను పెంచింది.

కరవు మండలాల్లో 150 రోజుల పని దినాలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ప్రభుత్వం ఇటీవల ఐదు జిల్లాల్లో ప్రకటించిన 80 కరవు మండలాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కార్మికులకు 150 రోజుల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పిస్తుండగా, కరవు మండలాల్లో దానిని 150 రోజులకు పెంచారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం, నెల్లూరు, కడప, అనంతపురం, విజయనగరం జిల్లాల్లోని కరవు మండలాల్లో మాత్రమే ఉపాధి కార్మికులకు 150 రోజుల పనిదినాలు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. కరవు నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు కార్మికుల వలసను నిరోధించేందుకు పనిదినాలు పెంచామని తెలిపారు.

లీగల్ సర్వీసెస్ సమన్వయానికి నోడల్ అధికారులుగా జాయింట్ కలెక్టర్లు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : జిల్లాల్లో లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ), జిల్లా పరిపాలనా విభాగాల మధ్య సమన్వయం కోసం జిల్లాల జాయింట్ కలెక్టర్లకు ప్రభుత్వం నోడల్ అధికారులుగా నియమించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి రంజన్ గోయల్ సూచన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు న్యాయ, లెజిస్లేటివ్ ఎఫైర్స్ కార్యదర్శి దుప్పల వెంకట రమణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు న్యాయ సేవలు అందించటంతోపాటు అవగాహన సదస్సుల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపైనా అవగాహన కల్పించాలని ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్ణయించింది. అలాగే లోక్ అదాలత్‌ల నిర్వహణకు లీగల్ సర్వీసెస్ అథారిటీలు, జిల్లాల్లోని అధికారులతో కలిసి పని చేయాలనే ఉద్దేశంతోనే నోడల్ అధికారులను ప్రభుత్వం నియమించింది.

బదిలీల కోసం ఐఏఎస్‌ల ఎదురుచూపులు

కీలక పోస్టింగ్‌ల కోసం కీలకనేతల చుట్టూ కొందరు ప్రదక్షిణాలు

నాలుగు జిల్లా కలెక్టర్లకు బదిలీలు ఖాయం

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్ర ప్రభుత్వంలోని పలువురు ఐఏఎస్ అధికారులు పోస్టింగ్‌ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఐఏఎస్ అధికారుల బదిలీలు జరుగుతాయని గత 20 రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు బదిలీలు జరగలేదు. మరోవారంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ దశలో బదిలీలు జరుగుతాయా లేదా అన్న అంశంపై స్పష్టత లేదు. ఇదిలా ఉండగా పోస్టింగ్ లేకుండా జీఏడీలో కొందరు అధికారులు ఉన్నారు. కొద్ది రోజుల క్రితం ఆరుగురు గ్రూప్ -1 అధికారులు ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందారు. వీరు కాకుండా కొందరు సీనియర్ అధికారులు తమకు అప్రాధాన్యతా శాఖలు కేటాయించారని అసంతృప్తితో ఉన్నారు. ఇక పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు తాము నిర్వహిస్తున్న రెగ్యులర్ శాఖతో పాటు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నవారు ఉన్నారు. ఇదిలా ఉండగా కొన్ని శాఖల్లో కమిషనర్లుగా ఉన్న వారికి పదవీకాల సమయం ముగిసింది. ఆ పోస్టులకు కూడా కొత్తవారిని నియమించాల్సి ఉంది. ప్రధానంగా ఎక్సైజ్‌శాఖను ప్రక్షాళన చేసి ఆ శాఖలో అవినీతిని రూపుమాపేందుకు ప్రయత్నించి అధికారులను హడలెత్తించిన లక్ష్మీనరసింహంకు ఈసారి బదిలీ తప్పదని అంటున్నారు. అలాగే సివిల్ సప్లయీస్ కార్పొరేషన్, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్‌లుగా ఉన్నవారిని కూడా బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. పై పోస్టుల్లో పనిచేస్తున్న అధికారులు ఆ పదవుల్లోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటింది. ఎక్సైజ్ కమిషనర్, సివిల్ సప్లయీస్ కమిషనర్ ఎండీ పోస్టులకు బాగా డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పోస్టుల కోసం కొందరు ఐఏఎస్‌లు ప్రభుత్వంలోని కీలక నేతలను, ముఖ్య అధికారులను ప్రసన్నం చేసుకొనే పనిలో ఉన్నట్టు సమాచారం. ఎక్సైజ్ కమిషనర్ పోస్టు కోసం గతంలో గుంటూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం కార్పొరేషన్ ఎండీగా ఉన్న ఓ ఐఏఎస్ అధికారి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి తోడు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల కలెక్టర్ల బదిలీలు కూడా జరుగుతాయని తెలుస్తోంది. రాజధాని సమీపంలో ఉన్న ఓ జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేయాలంటూ ఆ జిల్లాలోని ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రాయలసీమ నుండి గతేదాది బదిలీపై వచ్చిన సదరు కలెక్టర్ ఆ జిల్లాలోని ప్రజా ప్రతినిధుల పట్ల సరిగా వ్యవహరించటం లేదన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఇదిలా ఉండగా రాయలసీమ పక్కనే ఉన్న జిల్లా కలెక్టర్‌కు కూడా బదిలీ తప్పదంటున్నారు. గోదావరి జిల్లాలో ఒకరు, ఉత్తరాంధ్రలో ఓ కలెక్టర్ మార్పు ఖాయమంటున్నారు. ఇలా రాష్ట్రంలో పలు కారణాలతో ఐఏఎస్‌ల బదిలీలు జరగాల్సి ఉండగా ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదు. శుక్రవారంలోపు జరిగితే జరిగినట్లు లేకుంటే అసెంబ్లీ సమావేశాల తర్వాతనే ఐఏఎస్‌ల బదిలీలు ఉంటాయని సచివాలయ వర్గాల ద్వారా తెలిసింది.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు దిగిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతును ప్రకటించింది. రాష్ట్రంలో దాదాపు 24వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పీస్‌రేట్ పద్ధతిపై అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వీరంతా అతి తక్కువ వేతనాలకు పనిచేస్తూ, మధ్య దళారుల ద్వారా చెల్లింపుల వల్ల నష్టపోతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న వీరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించడం లేదు. మహిళలకు మెటర్నిటీ లీవులు అమలు కావడం లేదు.

న్యాయమైన ఈ డిమాండ్ల సాధన కోసం వారు 20వ తేదీ నుండి నిరవధిక ఆందోళనా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణా తరహాలో వీరిని విద్యుత్ సంస్థ కార్మికులుగా విలీనం చేసి, ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని కమిటీ కోరింది.

కేంద్రంవల్లే కష్టాలు

సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-విశాఖసిటీ : నవ్యాంధ్ర ప్రదేశ్‌కు భౌతిక సంపద చేకూర్చడమే కాక సంతోషాల నిలయంగా తీర్చిదిద్దడానికి గత నాలుగేళ్లుగా అవిరళ కృషి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ సదస్సులో భాగంగా సోమవారం ఏడవ స్పెషల్ ప్లీనరీ విత్ సోషల్ ఐకాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం విభజన అనంతరం ఈ ప్రాంతానికి అన్యాయం జరిగిందన్నారు. కేంద్రం ఇచ్చిన హామీలు నిలబెట్టు కోకపోవడంతో ఇబ్బందులు వచ్చాయన్నారు. విశాఖను హుదూద్ తరువాత సాధారణ పరిస్థితులు నెలకొల్పడమే కాకుండా గణనీయంగా అభివృద్ధి చేశామన్నారు. వ్యక్తిగత జీవితంతోపాటు వ్యాపారాలలోనూ నైతిక విలువలు పాటిస్తే ప్రశాంతత ఉంటుందన్నారు. సాంకేతికతను పరిధులమేర వినియోగించుకోవాలన్నారు. లేకుంటే టెక్నాలజీకు బానిస అయ్యే ప్రమాదం ఉందన్నారు. అవసరాలు ఎన్ని మారినా సంతృప్తి ముఖ్యమన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకులు రవిశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం మానవ సమాజానికి అత్యవసరమైనది ప్రశాంతత అని అన్నారు. విభజిత రాష్ట్రం సమర్థ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యమే తొలి సంపదన్నారు. అనారోగ్యంపై అధికంగా వెచ్చించడం ఆర్థిక రంగానికి మంచిది కాదన్నారు.

మనిషి తనతో తను ప్రకృతిని ఆస్వాదించడం ద్వారా ఉత్తమ ఆలోచనలు పొంద గలడన్నారు. దీంతో పాటు తన నైపుణ్యాలు కూడా పెరుగుతాయన్నారు. సేవా కార్యక్రమాలపై పెట్టుబడి పెడితే దీర్ఘకాలం మంచి సమాజాన్ని పొందగలమన్నారు.ఫలితాలు తక్షణమే కావాలనుకుంటే అశాంతి మిగులుతుందన్నారు. తపనతో పట్టుదలగా కృషి చేయడం, ఓపికతో నిరీక్షించడం ద్వారా కోరుకున్న లక్ష్యాలు చేరవచ్చన్నారు. సంపదను పంచుకోవడం ద్వారానే శాంతియుత వాతావరణం సాధించగలమన్నారు. ఈ సెషన్‌కు క్రాంతినేషన్- ఇండియా ఎండ్ ద ఫోర్త్ ఇండస్ట్రీయల్ రివల్యూషన్ పుస్తకరచయిత ప్రాంజల్ శర్మ మోడరేటర్‌గా వ్యవహరించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఈనెల 28వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా జరుగనున్న ఇంటర్‌మీడియట్ పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపాలి. అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి.అక్రమాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలి. పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారులకు రెవిన్యూ,పోలీస్ తదితర శాఖలు పూర్తి సహకారాన్ని అందించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి సోమవారం నీరు-ప్రగతిపై నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ సందర్భంగా ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులు పలు సూచనలు చేశారు. అనంతరం జలసంరక్షణ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ మనం తలపెట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో భూగర్భజలాలు 1.6మీటర్లు పెరిగాయి,రాయలసీమలో 4.6అడుగులు పెరిగాయి. ఈ ఫలితాలను దృష్టిలో పెట్టుకొని రెండవ దశ జలసంరక్షణ ఉద్యమం మరింత ఉత్సాహంగా నిర్వహించాలని కోరారు. కాలువల్లో నీటిప్రవాహానికి ఉన్న అవరోధాలు గుర్రపుడెక్కలాంటివి పూర్తిగా తొలగించాలి.నరేగా ద్వారా గ్రామాల్లో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాలి. 24కోట్ల పనిదినాల లక్ష్యాన్ని చేరుకోవాలి. రోజుకు 15లక్షల పనిదినాల లక్ష్యంలో ప్రస్తుతం 11లక్షల పనిదినాలకు చేరాం,ఇది మరింత మెరుగుపడాలని సూచించారు. 14వ ఆర్థికసంఘం కింద విడుదలైన రూ.745కోట్ల నిధులు, గతంలో ఉన్న రూ.300కోట్లు కూడా పూర్తిగా వ్యయం చేయాలి.మొత్తం రూ.1045కోట్లతో గ్రామాల్లో మౌలికవసతులు అభివృద్ధి చేయాలన్నారు. అన్ని గ్రామాలు టెన్ స్టార్ రేటింగ్ లో ముందుండాలన్నారు. .కరవు మండలాల్లో అదనంగా మరో 50 పనిదినాలు కల్పించాలని, రోజు కూలి రూ.187 చెల్లించాలని ఆదేశించారు. అలాగే ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు. రబీలో వర్షపాతం లోటు అధికంగా ఉన్నప్పటికీ సాగువిస్తీర్ణం 95% కు చేరుకున్నాం. దిగుబడులు తగ్గకుండా చూడాలి.రెయిన్ గన్లను సద్వినియోగం చేసుకోవాలి.సమర్థ నీటి నిర్వహణ ద్వారా సాగునీటి కొరతను అధిగమించాలని చెప్పారు. పింఛన్ల పంపిణీకి నగదు కొరత లేకుండా చూసేందుకు ఇప్పటికే రూ.500కోట్లు నగదు విడుదల చేయాలని ఆర్బీఐకి లేఖ రాశామని, మరో రూ.500కోట్ల నగదును విడుదల చేయాలని కోరాలని సూచించారు. వేసవిలో పశు గ్రాస కొరత లేకుండా శ్రద్ధ వహించాలని, ఉపాధిహామీ కింద నర్సరీలు అభివృద్ధి చేయాలని, పెంచిన మొక్కలను రహదారులకు ఇరువైపులా ప్లాంటేషన్‌కు వినియోగించుకోవడం ద్వారా పర్యావరణం అభివృద్ధికి కూడా నరేగా నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందని, విశాఖలో మూడవ సమ్మిట్ కూడా విజయవంతం కావడం శుభపరిణామమని సీఎం పేర్కొన్నారు. మూడు సమ్మిట్‌లలో జరిగిన ఒప్పందాలన్నీ 13జిల్లాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా జరిగాయని గుర్తు చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో గ్రామీణాభివృద్ధి,వ్యవసాయం ముఖ్య కార్యదర్శులు జవహర్ రెడ్డి,రాజశేఖర్, గోపాలకృష్ణ ద్వివేది, పంచాయితీ రాజ్ కమిషనర్ రామాంజనేయులు, రియల్ టైం గవర్నెన్స్ ఎండి అహ్మద్ బాబు, సెర్ఫ్ సీఈవో కృష్ణమోహన్, జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర రావు, ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ ఉదయలక్ష్మి,వివిధ జిల్లాల కలెక్టర్లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర వైఖరిని నిరసిస్తూ

రాజ్యసభ ఎన్నికలను బహిష్కరించండి

టీడీపీ, వైసీపీ అధ్యక్షులకు రఘువీరా లేఖలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతోపాటు విభజన అంశాల అమల్లో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి నిరసనగా మార్చిలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు మీ పార్టీలు దూరంగా వుండి కేంద్రంపైన వత్తిడి పెంచాలని కోరుతూ పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి టీడీపీ, వైసీపీల అధ్యక్షులు చంద్రబాబు, జగన్మోహనరెడ్డిలకు సోమవారం వేర్వేరుగా లేఖలు రాశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర 5వ బడ్జెట్‌లో కూడా తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర ప్రజలంతా ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు. కేంద్రం ఏపీ రాష్ట్రంపట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని, వివక్షను తీవ్రంగా నిరసిస్తున్నారు. అధికార, ప్రతిపక్షపార్టీలుగా వున్న మీరు కూడా ఏపీకి ప్రత్యేక హోదా, నాటి ప్రధాని హామీలు, విభజన చట్టం -2014లోని అన్ని అంశాలూ అమలుచేసి తీరాల్సిందేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ మార్చి 5న రాబోతున్నది. రాష్ట్రం నుండి టీడీపీకి 2, వైసీపీకి ఒకస్థానం దక్కనున్నాయి. కావున ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కులను నిరాకరిస్తున్న కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసనగా రాజ్యసభ ఎన్నికలో పాల్గొనకుండా మీ పార్టీలు దూరంగా వుంటే కేంద్రంపైన వత్తిడి పెరిగే అవకాశం వుందని రఘువీరా ఆ లేఖల్లో పేర్కొన్నారు. ప్రజాగ్రహానికి రాజకీయ వత్తిడి తోడైతే రాష్ట్రానికి న్యాయం జరగడానికి కొంతమేరకు ఆస్కారం ఏర్పడుతుంది.దీని ద్వారా మీపార్టీకి దక్కాల్సిన రాజ్యసభ సభ్యులను శాస్వతంగా కోల్పోయే అవకాశం కూడా ఏమీ ఉండదు.మీ పార్టీకి దక్కాల్సిన స్థానాలు ఎప్పటికైనా మీపార్టీకే చెందుతాయి. గతంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా కూడా ప్రత్యేక హోదాకోసం, విభజనచట్టంలోని అంశాల అమలుకోసం కండిషన్ పెట్టాలని కోరుతూ మీకు లేఖరాసాము. అప్పుడే కనుక మీరు కండిషన్ పెట్టివుంటే కొంతమేరకైనా న్యాయం జరిగేదని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రయోజనాల విషయంలో కేంద్రంతో రాజీలేకుండా పోరాడాలని మీరు చిత్తశుద్ధిగా భావిస్తుంటే మార్చిలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు దూరంగా వుండి కేంద్రంపైన వత్తిడి తీవ్రతరం చేయాలని రఘువీరా కోరారు.

హాస్టళ్లు అధ్వానం...

- కర్నూలులో సోషల్ వెల్ఫేర్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు
- 10 మంది సస్పెన్షన్, ముగ్గురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు
- డీడీ, డీఎస్‌డబ్ల్యులకు ఛార్జి మెమోలు



విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు అధ్వాన్నంగా నడుస్తున్నాయి. వంటశాలలో, భోజన శాలలో పందులు, కుక్కలు సంచరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. అలాగే బాలికలకు అందించాల్సిన భోజన పంపిణీలో కూడా అవకతవకలు జరుగుతున్నాయి. ఇదంతా రాష్ట్ర సాంఘిక సంక్షేమ కమిషనర్ రామారావు ఆకస్మిక తనిఖీల్లో బయటపడింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, భోజన పంపిణీలో అక్రమాలకు బాధ్యులను చేస్తూ ఏకంగా 10 మందిపై సస్పెన్షన్, కొందరికి ఊస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. పై వ్యవహారమంతా కర్నూలు జిల్లాలో ఆదివారం జరిగింది. ఆరోజు కమిషనర్ రామారావు జిల్లా కేంద్రం కర్నూలులోని మహిళ కళాశాల, హైస్కూలుకు సంబంధించిన హాస్టళ్ళను ఆకస్మిక తనిఖీ చేశారు. వంటశాలలో, భోజనం చేసే హాళ్ళలో పందులు, కుక్కలు యదేచ్ఛగా సంచరించటం స్వయంగా తిలకించారు. అలాగే బాలికలకు ఇవ్వాల్సిన నాప్‌కిన్స్‌ను అపరిశుభ్రంగా ఉంచటంతో పాటు భోజనం పంపిణీలో కూడా అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో హాస్టల్ వార్డెన్‌లు లత, మాధవిలను ఏఎస్‌డబ్ల్యు రవీంద్రనాథ్‌రెడ్డిని, వాచ్‌మెన్ దిబ్బమ్మ, కమాటీలు లక్ష్మమ్మ, భాగ్యలక్ష్మి, వంట మనిషి మల్లీశ్వరిలను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఉల్లిందకొండ హాస్టల్‌ను కూడా తనిఖీ చేసి అక్కడి హాస్టల్ వార్డెన్‌ను, మరో ఇద్దరిని సస్పెండ్ చేశారు.

వీరితో పాటు అవుట్ సోర్సింగ్‌లో నియమితులైన ముగ్గురు ఉద్యోగులను తొలగించారు. జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, డిఎస్‌డబ్ల్యువో ప్రకాష్‌రాజ్‌లకు ఛార్జి మెమోలు జారీ చేశారు. సాంఘిక సంక్షేమశాఖలో ఆకస్మిక తనిఖీలు జరిపి ఒకేసారి ఇంతమందిని సస్పెండ్ చేయటం సంచలనం సృష్టించింది. ఇక నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని హాస్టళ్ళలో ఆకస్మిక తనిఖీలు జరుపుతానని, తప్పు చేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని విశాలాంధ్రకు చెప్పారు.

ప్రత్యేక హోదా కోసం

మరో చారిత్రక ఉద్యమం అవశ్యం

- ఉద్యోగ, కార్మిక సంఘాలు కదలాలి
- హోదా వస్తేనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ
- ఆర్టీసీ ఈయూ కార్యాలయం ప్రారంభోత్సవంలో వక్తల పిలుపు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పీజే చంద్రశేఖరరావు, మాట్లాడుతున్న డీజీపీ ఎం.మాలకొండయ్య చిత్రంలో పద్మాకరరావు, కె.రామకృష్ణ, ఎ.వెంకటేశ్వరరావు, ధనుంజయ తదితరులు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం సమైక్యాంధ్ర ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగ, కార్మిక సంఘాలు మరో చారిత్రక ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు రంగంలోకి దిగితేనే ఉద్యమం వేడెక్కుతుందని, సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో కార్మికులు దానిని రుజువు చేశారన్నారు. ఉద్యోగ, కార్మిక సంఘాలతోపాటు రాజకీయ పార్టీలు సైతం హోదా కోసం ఉద్యమించాలని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటుపరంకాకుండా ఉండాలంటే హోదా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. హోదా రావటం వల్ల ఏ ఆర్థిక సంస్థ నుంచైనా ప్రభుత్వరంగ సంస్థలు రుణం తీసుకుంటే 90 శాతం నిధులను కేంద్రం భరించే అవకాశం ఉంటుందని, ఈ నేపథ్యంలో ఉద్యోగ, కార్మిక, రాజకీయ పక్షాలు మళ్లీ హోదా కోసం ఉద్యమించాలని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవాడ శివారు జక్కంపూడిలోనిన వైవీ రావు ఎస్టేట్‌లో సోమవారం జరిగింది. కార్యాలయాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు ప్రారంభించగా, సమావేశహాల్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ఆఫీస్ చాంబర్స్‌ను డీజీపీ, ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం మాలకొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పీజే చంద్రశేఖరరావు మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే, ఆర్టీసీని ప్రైవేటుపరం కాకుండా రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. కేంద్రం హోదా ఇచ్చేదిలేదంటుండగా, రాష్ట్ర ప్రభుత్వం తడవకో మాట మాట్లాడుతోందని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలు హోదాను ఉపయోగించుకుని లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒక్కతాటిపైకి రావాలన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న రవాణా రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పటికే తెలంగాణాలో ఆర్టీసీని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అమరావతిలో సరికొత్త రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఉద్యోగ, కార్మికులు హక్కుల కోసం ఎలా ఉద్యమిస్తారో అందుకు పది రెట్లు పోరాటం చేయాలని, అప్పుడే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని పీజే చెప్పారు.

క్రియాశీలక శక్తిగా ఈయూ : ఆర్టీసీ చరిత్రలోనే ఎంప్లాయిస్ యూనియన్ ఒక క్రియాశీల శక్తిగా రామకృష్ణ చెప్పారు. త్వరలో జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలలో వామపక్ష సంఘాలు ఈయూ, ఎన్‌డబ్ల్యుఎఫ్ ఉమ్మడిగా పోటీ చేస్తే గెలుపు తథ్యమన్నారు. గత ఎన్నికలలో విడిపోవటం వల్లే ప్రత్యర్థి సంఘం గెలుపొందిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలను చిన్నచూపు చూస్తోందని, అసలు సంఘాలతో తనకేం పనిలేదంటూ సీఎం చంద్రబాబు ప్రకటించటం శోచనీయమన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటంలేదని, ఆ కార్మికులే లేకపోతే ప్రభుత్వ వ్యవస్థ పని చేయదని హెచ్చరించారు. కార్పొరేట్ ఊడిగాన్ని మానుకుని కార్మికులకు సేవ చేయాలని ఆయన సూచించారు. విభజన తర్వాత 2014-15లో రూ.16 వేల కోట్ల లోటును నాలుగేళ్లలో పూడ్చుకోలేకపోవటం శోచనీయమన్నారు. ప్రత్యేక హోదా కోసం ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల కష్టార్జితంతో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర భవనాన్ని నిర్మించుకోవటం అభినందనీయమన్నారు. కార్యాలయాలంటే పోరాట కేంద్రాలన్నారు. రాష్ట్రంలో రెండున్నర కోట్ల మంది కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సాచివేత ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యుత్, అంగన్‌వాడీ, ఆర్టీసీ తదితర కార్మిక సంఘాల అణచివేతకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. కార్మికుల శ్రమ ఫలితంగానే విద్యుత్, ఆర్టీసీ సంస్థలకు అవార్డులు వస్తున్నాయనే విషయాన్ని మరవ కూడదని సూచించారు. ఆర్టీసీ చరిత్రలోనే ఉత్తమ వేతన ఒప్పందాన్ని అమలు చేసేందుకు ఈయూ కృతనిశ్చయంతో ఉందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో గెలుపొంది, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, హోదా ఉద్యమానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలని కోరారు.

కార్మికుల కష్టం వల్లే తగ్గిన నష్టాలు : మాలకొండయ్య : కార్మికుల కష్టం ఫలితంగానే ఆర్టీసీ నష్టాలు తగ్గాయని డీజీపీ, ఆర్టీసీ వీసీ, ఎండీ మాలకొండయ్య అన్నారు. కార్మికులు ఇదే స్ఫూర్తితో పని చేస్తే ఆర్టీసీ బ్రేక్ ఈవెన్ పాయింట్‌కు చేరుతుందని తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్‌కు ఒక నిబద్ధత ఉందని, ఆ సంఘానికి సమర్థ మంతమైన నాయకత్వం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి గానీ, ఇతరుల నుంచి ఒక్క పైసా తీసుకోకుండా, సభ్యులే విరాళాలు పోగు చేసి భవనాన్ని నిర్మించుకోవటం అభినందనీయమన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిని స్ట్రేషన్) ఏ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కార్మి కుల కృషి ఫలితంగానే నష్టాలు తగ్గటంతోపాటు కార్పొరేట్‌స్థాయిలో ఆసుపత్రిని నిర్మించుకున్నట్లు చెప్పారు. సంస్థ ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే తప్పకుండా వేతన సవరణ చేస్తామని చెప్పారు. దీనిని వేరే కోణం నుంచి చూడవద్దని కోరారు. కార్మికులు, సంఘాల విషయంలో సంస్థ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని చెప్పారు. అంతకు ముందు ఈడీలు వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, జయరావు మొక్కలు నాటారు.

సభ్యత్వ పరిశీలనకు 1న నోటీసు : పద్మాకర్ : ఆర్టీసీలో గుర్తింపు సంఘం పదవీకాలం రెండో తేదీతో ముగియనున్న నేపథ్యంలో సభ్యత్వ పరిశీలనకు మార్చి ఒకటో తేదీన కార్మికశాఖ కమిషనర్‌కు నోటీసు ఇవ్వనున్నట్లు ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మాకర్ చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో సంఘాలు తమ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు అనేక మార్గాలను అన్వేషి స్తున్నాయని, ఈ విషయంలో సంస్థ అధికారులు పక్షపాత రహితంగా వ్యవహరించాలని కోరారు. తమ హయాంలోనే వేతన సవరణ ఒప్పందం చేశామని చెప్పారు. క్షేత్రస్థాయిలో అధికారులు మితిమీరిన జోక్యం చేసుకుంటూ, కార్మికులను వేధిస్తున్నారని, ఈ విధానాన్ని విడనాడాలని కోరారు. నష్టాలను తగ్గించటంలో కార్మికుల శ్రమ ఉందన్నారు. ఈయూ అధ్యక్షుడు వైవీ రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు హనుమంతరావు, యూని యన్ నేత సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, ఈయూ రాష్ట్ర సీనియర్ నాయకులు దామోదర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి సుందరయ్య , తెలం గాణ ఈయూ నాయకులు బాబు, రాజిరెడ్డి, తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు థామస్‌రెడ్డి పాల్గొన్నారు.

హోదా లేకున్నా భారీగా పరిశ్రమలు

బీజేపీ అభివృద్ధి కమిటీ చైర్మన్ రఘునాథబాబు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేకపోయినా రూ.18 లక్షల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయని, ఈ విషయాన్ని సాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రకటించారని బీజేపీ అభివృద్ధి కమిటీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘునాథబాబు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా వల్ల పరిశ్రమలు రావనే ఆరోపణలలో నిజంలేదన్నారు. విశాఖలో ఇప్పటి వరకు మూడుసార్లు భాగస్వామ్య సదస్సుల్లో రూ.30 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులతో ఒప్పందాలు కుదిరాయని, త్వరలో పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. కుదిరిన ఒప్పందాలలో 59 శాతం (సుమారు రూ.18 లక్షల కోట్లు) పెట్టుబడులు వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వీటి ఏర్పాటు వల్ల రాష్ట్రంలో కొత్తగా 20 లక్షల మంది ఉద్యోగవకాశాలు వస్తాయన్నారు.

హోదా ఉంటేనే పరిశ్రమలు వస్తాయనేది అపోహ అనే విషయం తేటతెల్లమైందన్నారు. సవరించిన నిబంధనల వల్ల 2014 తర్వాత ఈశాన్య రాష్ట్రాల్లో పెట్టిన పరిశ్రమలకు కూడా అధికంగా రాయితీలు లభించలేదనే విషయాన్ని విపక్షాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. కొత్తగా ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకూడదని 14వ ఆర్థిక సంఘం సూచించిందని, అందుకు అనుగుణంగానే కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. రాయలసీమకు జరిగిన అన్యాయంపై రాష్ట్రాన్ని పాలించిన సీఎంలు తమను తాము ప్రశ్నించుకోవాలన్నారు. రాయలసీమ అన్యాయాన్ని రూపుమాపేలా బీజేపీ కృషి చేస్తోందని చెప్పారు. అయినప్పటికీ పార్టీపై అసత్య ప్రచారం చేయటం, బురద చల్లటం శోచనీయమన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మీడియా రాష్ట్ర ఇన్‌ఛార్జి పి దిలీప్ పాల్గొన్నారు.

సంపాదకీయం

సదస్సు ఒప్పందాలు ఫలించేనా?

మూడు రోజులపాటు భారీ పెట్టుబడుల కొరకు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్టణంలో ఘనంగా నిర్వహించిన భాగస్వామ్య సదస్సు సోమవారం ముగిసింది. 2016, 2017లో విశాఖలో రెండు భాగస్వామ్య సదస్సులు జరిగాయి. మూడవ సదస్సుకు ప్రభుత్వం విశాఖ వేదికనే ఎంచుకుంది. 2016లో జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ. 4.67 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 328 అవగాహన పత్రాలపై (ఎంఓయూ) సంతకాలు జరిగినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. 10 లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. 2017లో జరిగిన భాగస్వామ్య సదస్సులో ఏపీ ప్రభుత్వం, వివిధ కంపెనీలు 22 లక్షల కొత్త ఉద్యోగాలు కల్పించే విధంగా మొత్తం రూ. 10.5 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం కల్పించే 665 ఏఓయూలపై సంతకాలు చేశాయి. శనివారం ప్రధాన సదస్సు "నవభారతాన్ని ప్రపంచ శ్రేణి సంస్థలతో అనుసంధానించే వ్యూహరచన" అన్న అంశంపై జరిగింది. అదేరోజు సాయంత్రం "సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్" అంశంపై జరిగిన ప్లీనరీ సదస్సులో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సదస్సు మొదటి రోజునే రూ. 41 వేల కోట్ల విలువైన 80 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. వీటివల్ల లక్షమందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. తొలిరోజు ఆటోమొబైల్ రంగంలో రూ. 15,224 కోట్లు, పర్యాటక రంగంలో రూ. 7,807 కోట్లు మౌలిక వసతుల రంగంలో సుమారు 12,500 కోట్లు, పారిశ్రామిక రంగంలో సుమారు రూ. 5,645 కోట్లు ఒప్పందాలు జరిగాయి. శ్రీకాకుళం జిల్లా బావనపాడులో రూ. 4 వేల కోట్లతో ఓడరేవు నిర్మాణానికి అదానీ పోర్ట్ అండ్ సెజ్ లిమిటెడ్ సంస్థ ఒప్పందం చేసుకొంది. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో మైత్రా మొబిలిటీ సంస్థ రూ. 7 వేల కోట్లతో, సినర్జీ కాస్టింగ్ సంస్థ రూ. 1020 కోట్లతో, ఎలక్ట్రికల్ మొబిలిటీ సంస్థ రూ. 1670 కోట్లతో ఒప్పందాలు జరిగాయి. తొలిరోజు ఎస్సెల్ గ్రూపు, మహీంద్ర హాలిడేస్ అండ్ రిసార్ట్స్ ఇండియా, ఐసీ నేవల్ ఆర్కిటెక్ట్స్, గ్రాసెమ్ ఇండస్ట్రీస్ వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. ఇటీవల అమరావతిలో ముఖ్యమంత్రితో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఛైర్మన్ ముఖేశ్ అంబానీ విందు సమావేశం ఫలితంగా, రాష్ట్రంలో వివిధ రంగాల్లో రూ. 40 వేల కోట్ల పెట్టుబడుల నిబద్ధతకు దారితీసింది. రిలయన్స్ గ్రూప్ అండ్ ఇండియా గ్యాస్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ (ఇందులో ఆర్ఐఎల్ 50 శాతం వాటాలు కలిగి వుంది) ఎంఓయూపై సంతకం చేసింది. ఎంఓయూ ప్రకారం 20 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా, ఐటీ, ఎలక్ట్రానిక్ పార్క్ రంగాల్లో ఆర్ఐఎల్ రూ. 15 వేల కోట్లు పెట్టుబడులు పెడుతుంది. ఆర్ఐఎల్ తిరుపతిలో ప్రపంచ శ్రేణి మౌలిక సౌకర్యాల తయారీ యూనిట్‌ను నెలకొల్పుతుంది. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఈ-గవర్నెన్స్, ఈ-ప్రగతి ప్రాతిపదిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపి) నిర్మాణానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి సురేష్ ప్రభు భాగస్వామ్య సదస్సులో శంకుస్థాపన చేశారు. ఈ రెండు ప్రతిష్టాత్మక సంస్థల క్యాంపస్‌లు కాకినాడలోని జీఎంఆర్ ప్రత్యేక ఆర్థిక మండలిలో నెలకొల్ప బడతాయి. చంద్రబాబు ప్రభుత్వం ఈ రెండు సంస్థలకు ఒక్కోదానికి 25 ఎకరాలు కేటాయించింది. ముంబై ప్రధాన కేంద్రంగా గల ఐఐపి ఎగుమతి మార్కెట్, శిక్షణపై దృష్టి కేంద్రీకరిస్తుంది. విశాఖపట్టణంలో ఐఐఎఫ్‌టికి 2013లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రతిపాదించారు. అయితే, అది కాగితాలకే పరిమితమైంది. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత వాణిజ్య మంత్రిత్వ శాఖతో సంప్రదించగా అది అంగీకరించింది. ఏస్ అర్బన్ ఇన్ఫోసిటీ వైజాగ్‌లో టెక్‌పార్క్‌ను నిర్మిస్తుంది. కాగా, సంపూర్ణ సమీకృత నూతన సాంకేతిక పరిజ్ఞాన క్యాంపస్‌ను రూ. 3,220 కోట్ల పెట్టుబడితో విశాఖలో నెలకొల్పేందుకు ఏస్ అర్బన్ ఇన్ఫోసిటీ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందంపై సంతకాలు చేసింది. మూడు రోజుల సదస్సులో మొత్తం రూ. 4,39,765 కోట్ల పెట్టుబడులు వచ్చే విధంగా, 11 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలతో కూడిన 734 ఒప్పందాలు కుదిరాయి. దేశ విదేశాల్లోని ప్రముఖ కంపెనీలన్నీ ఈ సదస్సులో పాల్గొన్నాయి. సోమవారం చంద్రబాబు సదస్సులో మాట్లాడుతూ, ప్రజలు అభివృద్ధికే ఓటు వేస్తారని, ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే రాజకీయ నాయకులకే ప్రజలు ఓటువేస్తారని చంద్రబాబు రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చెప్పారు. ఆయన ఏ దృష్టితో చెప్పినా అక్షరసత్యం పలికారు. అదే సమయంలో 2014 శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా నిరుద్యోగ విద్యాధిక యువతకు ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు చేయగలిగారో ఆత్మ విమర్శ చేసుకోవలసిన అవసరం వుంది. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా పెట్టుబడుల రాకకోసం భాగస్వామ్య సదస్సు నిర్వహించడాన్ని హర్షించవలసిందే. అయితే, ఎంఓయూలపై సంతకాలు చేసి, ఒప్పందాలు కుదుర్చుకున్నంత మాత్రాన అంతా అయిపోతుందని, రాష్ట్రానికి ఇబ్బడి ముబ్బడిగా పరిశ్రమలు వచ్చేస్తాయని, నిరుద్యోగిత పరిష్కారమైపోతుందని ఎవరైనా భావిస్తే అది పేరాసే అవుతుంది. గత రెండు భాగస్వామ్య సదస్సులలో ఎంఓయూలపై సంతకాలు జరిగిన వాటిలో ఎన్ని ఆచరణలో ప్రారంభానికి నోచుకున్నాయో పరిశీలించాల్సిన అవసరం వుంది. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా సాధించినట్లయితే, లభించే రాయితీలను దృష్టిలో పెట్టుకొని పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి క్యూ కడతారన్నది వాస్తవం. అందుచేత, హోదా సాధనపై చంద్రబాబు దృష్టి కేంద్రీ కరించాలి. భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు ఆచరణకు నోచుకునే విధంగా కృషి చేయడం వల్లనే ఇటువంటి సదస్సుల వల్ల ప్రయోజనం వుంటుంది. లేనట్లయితే అవి నిరర్థకమేనన్నది నిస్సందేహం.

చురక

చెరగని అందం పూసిన పువ్వు
సింగిడి వన్నెలు పొదిగిన నవ్వు
చిత్రనగరి కళ శ్రీదేవి
చివరకు వీడెనా భూదేవి

ఉందో లేదో అమరలోకం
ఉంటే నీవే అపురూపం
రంభా మేనక అసూయ కోపం
రగిలేను చూస్తే నీరూపం

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

వాగ్ధానాలు కాదు - కార్యాచరణ కావాలి



పి.జనార్ధనరావు

భారతీయుల జీవన విధానం అంతా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైన ఆధారపడింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రుతు పవనాలు వర్షించే దానిపైన ఆధారపడి వుంది. భారత జనాభాలో 6 శాతం గ్రామాల్లో వుంటున్నారు. వ్యవసాయం ద్వారా ఆదాయం సంపాదించటం ప్రధాన వ్యాపకం. వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయదారులకు తోడ్పాటు అందించే వివిధ వృత్తులవారు గ్రామీణ నివాసితులు. అత్యధికంగా ఏవిధమైన ఆస్తులు లేనివారు. తాము చేసే శ్రమ ద్వారానే కుటుంబ పోషణ చేసుకుంటారు. వ్యవసాయదారుల్లో అధికంగా భూములున్న సంపన్నులు, మధ్యస్థంగా భూములున్న వారు, రెండు హెక్టార్ల భూములున్న వారు అధికులు. వీరు కొంతమంది కౌలుదారులుగా వుంటున్నారు. కొద్ది మొత్తంలో భూస్వాములు ఉద్యోగస్తులై దూరప్రాంతల్లో వున్నవారు భూములు కౌలుకు ఇస్తారు. రెండు రుతుపవనాలు వర్షాన్ని అందిస్తాయి. నైరుతీ రుతుపవనం దేశమంతటా విస్తరించి మే నెల నుండి సెప్టెంబరు వరకు వర్షాన్ని అందిస్తుంది. అనేక వాతావరణ స్థితిగతులవల్ల వర్షించకపోతే దేశం సంక్షోభ పరిస్థితిలో పడుతుంది. జలాశయాలు నిండవు. విద్యుదుత్పత్తి జరగదు. ఖరీఫ్ పంటలు, రబీ పంటలు ప్రారంభం కావు. ప్రజలు గ్రామాలోనూ నగరాల్లోనూ తాగునీటి కొరత ఎదుర్కొంటారు. ఆహారానికి భద్రత వుండదు. దేశం కరవు పరిస్థితి ఎదుర్కొంటుంది. ఉపాధుల నష్టం, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గుతుంది. ఉపాధి లేనందున అత్యధిక గ్రామీణులకు ఆదాయం లేనందున వినిమయం తగ్గుతుంది. బావుల్లో నీరు లేనందున విద్యుత్, డీజెల్ వినియోగం తగ్గుతుంది. ఉపాధిని వెతుకుంటూ ప్రత్యేకించి వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు వలసపోతున్నారు. నగరాలకు జనజీవనం అస్తవ్యస్థమవటమే కాక దేశ ఆర్థిక వ్యవస్థ గందరగోళ పరిస్థితిలో పడుతుంది. అభివృద్ధి చెందటానికి రుతుపవనాలు కీలకం, ప్రత్యామ్నాయం లేదు. ప్రతి రంగానికి ఒక జాతీయ విధానం వుంటుంది. భారతదేశంలో వ్యవసాయరంగానికి అటువంటి కార్యాచరణ విధానం లేదు. దేశంలో అభివృద్ధి సాధ్యం చేయటానికి ప్రభుత్వం, ప్రైవేటురంగం పెట్టుబడులు పెట్టాలి. ప్రభుత్వరంగ పెట్టుబడులు లేబర్‌ఇంటెన్సివ్‌రంగాలైన వ్యవసాయం, ఉత్పాదక, నిర్మాణరంగాల్లో పెట్టాలి. సాగునీటి వసతుల పెంపుదలకు, పరిశోధన ద్వారా నూతన వంగడాలకు పెట్టాలి. అత్యధిక ప్రజానీకానికి ఉపాధి కల్పించే రంగాలవి. భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తుల రంగంలో వ్యవసాయ దారులే పెట్టుబడి పెడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేదు. 'వ్యవసాయం చేసేవారు విత్తనం, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు, సంవత్సరం పొడుగునా కూలీ ఖర్చులు భరిస్తున్నారు. పంట నష్టం, పేదరికం పెరిగిన రుణభారం వారిని కుంగదీస్తూంటే ప్రభుత్వాలు అందించే తోడ్పాటు ఏమీలేదు. అత్యధికంగా పెట్టుబడులు అవసరమైన మరో రంగం. కేపిటల్ ఇంటెన్సివ్ రంగంలో ప్రైవేటు రంగం పాల్గొంటుంది. పరిశ్రమల స్థాపన, ఉత్పత్తులను మార్కెటింగ్ చేయటం, పరిశ్రమలను ఆధునికీకరించడానికి పెట్టుబడులు ఉంచుతారు. అధికంగా లాభాలు ఆర్జిస్తారు. తక్కువగా శ్రామికులను వినియోగిస్తారు. ఇక్కడ పెట్టుబడి ఉపాధి కల్పనకు తోడ్పడదు. ఈ రంగంలో పరిశ్రమలు స్థాపించేవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సౌలభ్యాలు కల్పిస్తాయి. భూమి, నీరు, విద్యుత్, రవాణా ఏర్పాట్లు, యంత్రపరికరాల దిగుమతికి తక్కువ సుంకాలు వగైరా. అలాగే పెట్టుబడి అవసరాలకు అనేక బ్యాంకులు కన్సార్టియంగా ఏర్పడి తక్కువ వడ్డీకి విస్తారంగా అప్పులు ఇస్తాయి. వారు చెల్లించలేకపోతే పారుబాకీగా రద్దు చేస్తాయి. ఈ పారుబాకీల వలన బ్యాంకింగ్ రంగంలో ఎన్‌పీఏలు 9 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. పారుబాకీల్లో పారిశ్రామిక పెద్దలవి సగం పైనే వున్నాయి. వారి సొంత ఆస్తులు, లాభాలు భద్రంగా వున్నాయి. ప్రజలు దాచుకొన్న సొమ్ము బ్యాంకులు నష్టపోయాయి. ప్రభుత్వాలకు ఈ నష్టానికి ఏ విధమైన బాధ్యత లేదు. ఇదీ పెట్టుబడిదారీ విధానం ప్రత్యేకత. సామాన్యులకు నష్టాల్లో ఊరట ఇవ్వరు. సంపన్నులకు యేళ్లపాటు ఊరట కలిగిస్తారు. సంపద కేంద్రీకరణ జరుగుతుంది. దేశ ప్రజలకు ఆహార అవసరాలు అందించేది వ్యవసాయం దాని అనుబంధ రంగాలు. వ్యాపారరీత్యా ఆలోచించినపుడు గ్రామీణులు ప్రత్యేకించి వ్యవసాయదారులు పెద్ద వినిమయదారులు. వారికి వ్యవసాయేతర ఆదాయ మార్గాలు అతి తక్కువ. పండించిన పంట అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం సంవత్సరం పొడవునా పెట్టిన ఖర్చు పోను మిగిలేది చిన్నసన్నకారు రైతులు, కౌలుదారులకు అతి స్వల్పం. వారు పంటకు ఖర్చు చేయటానికి బ్యాంకులు అప్పు ఇవ్వవు కనుక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకొంటున్నారు. వరుసగా పంట నష్టపోయినా, అమ్మకం నాటికి ధరలు పడిపోయినా అప్పు పెరిగి తీర్చలేక ఆత్మహత్యకు కుటుంబ పెద్ద పూనుకుంటున్నాడు. వ్యాపార పంటలైన పత్తి, మిర్చి, పొగాకు, పసుపు తదితరాలకు పెట్టుబడి అధికంగా వున్నది. ధరల్లో వచ్చే మార్పులవల్ల వ్యవసాయ దారుడు నష్టపోతున్నాడు. ప్రభుత్వం కొన్ని పంటలకు కొనుగోలు ధరలు నిర్ణయించింది. ఆ ధరలకు ప్రభుత్వ పంటను సేకరించటంలేదు. నిల్వచేయటానికి గిడ్డంగులు లేనందున ప్రైవేటు వ్యాపారులు మిగిలిన పంటను తక్కువ ధరలకు కొంటారు. వ్యవసాయదారుడు నష్టపోతు న్నాడు. వ్యాపారి లాభం పొందుతున్నాడు. ఒక్కొక్కప్పుడు ప్రభుత్వం చేపట్టే దిగుమతుల విధానం వలన నష్టపోతున్నది. ఉదాహరణకు పప్పుధాన్యాలకు ధరలు నిర్ణయించింది. వ్యవసాయదారులు పప్పుధాన్యాలు అధికమొత్తంలో పండించారు. ప్రభుత్వం దిగుమతులు అధికంగా చేసుకొంది. దేశంలో కొనుగోళ్లు చేయలేదు. రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయరంగంలో అనేక ఉత్పత్తి కారకాలు, విత్తనాలు పురుగుమందులు, ఎరువులు వగైరాలు బహుళజాతి సంస్థల చేతిలో వున్నాయి. ధరల నిర్ణయం వారిది. ప్రభుత్వం చేత విద్యుత్, డీజెల్, నీటితీరువా, ఎరువుల ధరలు తరచూ పెంచుతున్నారు. ధరల ఒడుదుడుకులకు టమోటా, ఉల్లి పాయలు, బంగాళదుంపలు పండించిన వ్యవసాయదారుల దుస్థితిని దేశం గమనించింది. వినియోగదారులు తీవ్రంగా ఇబ్బంది పడటం అధిక ధరలు చెల్లించడం జరిగింది. అసమానం, ప్రణాళికాబద్ధంగాలేని విధానం వల్ల వ్యవసాయ దారులు అదే సమయాన వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

భారతదేశంలో 6,40,000 గ్రామాలున్నాయి. 90 శాతం వ్యవసాయంపై ఆధారపడ్డాయి. ఈ మధ్య ప్రభుత్వ నేతలు డెయిరీ, పౌల్ట్రీ, మత్స్య పెంపకం ద్వారా ఆదాయం సంపాదించమని సలహాలిస్తున్నారు. పెద్ద రైతులకు ఆవరణ లుంటాయిగాని అత్యధికులకు తక్కువ నివాస సౌకర్యాల్లో వ్యాపకం, వ్యవసాయేతర మార్గాల ద్వారా ఆదాయం పొందటం సాధ్యంకాదు. పెద్దఎత్తున పెట్టుబడి పెట్టి బ్యాంకులు అందజేసే పరపతి ద్వారా డైరీఫామ్‌లు, పౌల్ట్రీఫామ్‌లు, మత్స్య పరిశ్రమలు ఏర్పాటు చేసేది వ్యాపార దృక్పథం వ్యవసాయం కాదు. వ్యవసాయం జీడీపీకి అందించే తోడ్పాటు తగ్గింది. పెద్ద రైతులే కేటాయించిన నిధులు అధికంగా పొందుతున్నాయి. 82 శాతంగా వున్న మార్జినల్ రైతులు గాని కౌలుదారులు గాని బ్యాంకుల నుండి తోడ్పాటు పొందటం లేదు. పత్తి, మిర్చి, పసుపు, చెరకు, పొగాకు పంట వేసే మార్జినల్ రైతులు వడ్డీ వ్యాపారుల ద్వారా అప్పు పొందుతున్నారు. అధిక పెట్టుబడులు అవసరమైన పంటలవి. అప్పు తీర్చలేక ఆత్మహత్యలకు పూనుకొనేవారిలో వారే అధికంగా వున్నారు.

కేంద్ర ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వం గాని వ్యవసాయానికి ప్రాధాన్యం ఎందుకు ఇవ్వడం లేదో అర్థం గాని విషయం. అత్యధిక శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయం. అత్యధికంగా ఉపాధిలందిచే రంగం. పేదరికాన్ని తగ్గించే రంగం మొత్తం జనాభాకి అహారం, పప్పుధాన్యాలు, వంట నూనెలు వగైరా ఉత్పత్తి చేసే రంగం. గ్రామీణ భారతం - నగర భారతం మధ్య అంతరం పెరగటానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి గాని విద్యా, ఆరోగ్య సౌకర్యాలు పెంచటానికి కృషిలేదు. ప్రపంచీకరణ వ్యామోహంలో అసమానతలు విస్తరి స్తుంటే ప్రభుత్వాలు నిర్లిప్తంగా చూస్తున్నాయి. ప్రభుత్వంలోని కిందిస్థాయి ఉద్యోగి కనీసంగా రూ. 18 వేలు నెలకి పొందుతుంటే గ్రామీణ ఉపాధి పొందే కూలీ రూ. 200 కూడా పొందటం లేదు. చిన్న, సన్నకారు రైతు కుటుంబ పోషణకు బాధపడుతున్నాడు. గ్రామీణుల జీవితం మెరుగుపడలేదు కనుకనే పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రైతాంగం ఆందోళనకు దిగారు. పంటలకు మంచి ధరలు, యువతకు మెరుగైన ఉపాధికి పోరాడుతున్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు వారికి ఏమాత్రం కల్పించరు. కార్యాచరణ మాత్రమే పరిష్కారం భారతదేశంలో నిత్యవ్యవసాయ దారుల్లో సగం కంటే ఎక్కువ రుణభారంతో తమ కృషిని కొనసాగిస్తున్నారు. వ్యవసాయ రంగం జీడీపీకి అందించే వాటా 2.1 శాతం తగ్గిపోతుంటే అశ్రద్ధ చేయడం ఆకలిచావులకు దారితీస్తోంది. ప్రపంచ ఆకలి సూచిలో భారత్ స్థానం 118 దేశాల్లో 97వ స్థానం. పిల్లల్లో పౌష్టికాహారలోపం 15 శాతం, వృథా 15 శాతం, స్టంటెడ్ 39 శాతం. కారణం ఎండిమిక్ పావర్టీ. తాగునీటి వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటు లేక తల్లిదండ్రులకు స్థిరమైన ఉపాధి లేకపోవడం, ఆరోగ్య రక్షణ చర్యల్లేక- ఇవన్నీ గ్రామీణ ప్రాంత సమస్యలే. ఆరోగ్య రక్షణ విషయంలో ఇండియా స్పెండ్ జర్నల్ అందజేసిన వివరాలు 93 శాతం తమ కుటుంబాల వైద్య ఖర్చులు భరించలేక పోతున్నారు. దేశవ్యాప్తంగా 6.26 కోట్ల కుటుంబాలవారు ప్రత్యేకించి హెక్టారుకంటే తక్కువగా వున్నారు. 25 ఎకరాలకంటే అధికంగా కలవారి నెలవారీ ఆదాయం రూ. 41,338. వారు తమ ఖర్చులు భరిస్తున్నారు. వారు 3.5 లక్షల కుటుంబాలే. నయా ఉదారవాదం చేపట్టి విద్య, ఆరోగ్య రక్షణ కార్పొరేట్ రంగానికి అప్పచెప్పారు పాలకులు లక్షల కోట్లతో లోటుబడ్జెట్లు వేస్తూ లోటు పూడ్చటానికి అప్పులు చేస్తూ ప్రజల కనీస అవసరాలు తీర్చే ప్రయత్నం లేదనేది విదితమే. తాజా బడ్జెట్లో జైట్లీ మాటలు కోటలు దాటాయి. కేటాయింపులు కంటితుడుపే. ఆహారభద్రతకు, కరవుల నుండి రక్షణకు, ఉపాధులు కాపాడటానికి వ్యవసాయరంగంలో సాగు కార్యక్రమాలు కొనసాగటం అవసరం. సాగునీటి వసతులు 160 మిలియన్ హెక్టార్లకు గాను వ్యవసాయ యోగ్యమైన భూమిలో 41 శాతం మాత్రమే (65 మిలియన్ హెక్టార్లు) నీటి వసతులున్నాయి. నదులపై ఆనకట్టలు కట్టినా కాలువలు ఏర్పరచనందున అనుకున్నమేర పంటల సాగు జరగటం లేదు. సాగునీటి వసతులను విస్తరించటం, వర్షంపైనే ఆధారపడిన ప్రాంతాల్లో వర్షజలాన్ని నిల్వచేయటానికి నిధులందించాల్సి వుంది. ధరవరలు వ్యవసాయం గిట్టుబాటు కాక యువత వ్యవసాయం నుండి విరమించే ఆలోచన నిలుపరించాలి. ఇప్పటికే వ్యవసాయదారులు 16.61 కోట్ల నుండి 14.62 కోట్లకు తగ్గారు. ఆదాయాలు తగ్గటం, రుణభారం పెరగటం కారణాలు. లాభాలందించే విధంగా ధరలు నిర్ణయిస్తామని వాగ్ధానాలతో మోడీ ప్రభుత్వం సరిపెట్టింది. మరో ముఖ్యమైన అంశం పరపతి - వ్యవసాయ రంగానికి కేటాయించిన మొత్తాలు అత్యధిక శాతం సంపన్న వర్గాలు పొందుతున్నారు. అత్యధిక శాతం మార్జినల్ రైతులు మెట్ట పంటలు. వ్యాపార పంటలు సాగుచేసేవారికి, కౌలుదారులకు అప్పులు బ్యాంకులు ఇవ్వవు. ఈ సమస్య పరిష్కారం కానంత వరకూ ఉత్పత్తి, ఉత్పాదకత పెరగదు. రూరల్, అర్బన్ ప్రాంతాల మధ్య ఆదాయం అంతరం, సౌకర్యాల అంతరం పూడ్చాల్సి వుంది.

వ్యాస రచయిత : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, విజయవాడ

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు - ప్రజా ఐక్య ఉద్యమమే శరణ్యం

దిగుపాటి రాజగోపాల్

ఆయా రాజకీయ పార్టీల స్వార్థ ప్రయోజనాల కోసం, ఓట్లు పొందాలనే ఉద్దేశంతో ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను అడ్డంగా విభజించేందుకు కాంగ్రెసు, బీజేపీ, తెలుగుదేశం పార్టీలు అంగీకరించాయి. ఇప్పుడు ఏపీకి అన్యాయం జరిగిందనీ, ప్రత్యేక హోదా, ప్యాకేజి, నిధులు యివ్వటం లేదని తెలుగుదేశం పార్టీ గుండెలు బాదుకుంటున్నట్టు రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టడానికి మంచి నటనాచాతుర్యం ప్రదర్శిస్తున్నది. బీజేపీ మొదటి నుండి చిన్న రాష్ట్రాలుగా ఏర్పాటు చేసి, హిందూ మతోన్మాద, కులపోకడలతో ప్రజలకు చేర్చి రాజకీయాధికారం దక్కించు కోవాలన్నది బీజేపీ సిద్ధాంతం.

అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంటు సాక్షిగా ఆర్థికంగా ఆదుకోవడానికి ఆంధ్రాకు ప్రత్యేక కేటగిరి హోదా ప్రకటిస్తున్న సమయంలో 5 సంవత్సరాలు కాదు 10 సంవత్సరాలు యివ్వాలని వెంకయ్యనాయుడు పార్లమెంటులో గంభీర ఉపన్యాసం చేశారు. తరువాత మాట మార్చి ప్రత్యేక హోదా మేలు కాదు, సంజీవిని కాదని, ప్యాకేజీ మేలని పాటపాడడం, చంద్రబాబు బీజేపీకి భజన చేస్తూ ఆంధ్ర ప్రజలను మభ్య పెట్టి మోసగించారు..

దేశంలో ప్రస్తుతం ప్రత్యేక హోదా జమ్మూ-కాశ్మీర్‌కు ఉండగా, ఈశాన్యరాష్ట్రాలకు, ఉత్తరఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌కు కలిపి మొత్తంగా 11 రాష్ట్రాలకు ప్రత్యేక కేటగిరి హోదా ఉంది.

ప్రత్యేక హోదా కంటే ప్యాకేజీ మేలన్న బీజేపీ, టీడీపీ బూటకపు వాదన

సాధారణంగా కేంద్రం ప్రత్యేక ప్రణాళిక పద్దు కింద రాష్ట్రాలకు నిధులు ఇస్తుంది. వీటిలో 30 % పత్యేక కేటగిరి హోదా ఉన్న రాష్ట్రాలకు కేటాయించి మిగిలిన 70 % అన్ని రాష్ట్రాలకు పంచుతుంది. వాటిలో కూడా మిగతా రాష్ట్రాలకిచ్చే నిధుల్లో గ్రాంటు 60 % ఉంటుంది., ప్రత్యేక హోదా ఉండే రాష్ట్రాల కయితే 90 % గ్రాంటుగా వస్తుంది. ఇంత స్పష్టంగా విధి విధానాలు వుండి ప్రత్యేక హోదావల్ల ఇటువంటి లాభాలు ఉంటే, ప్యాకేజి నిధులు మంచిదనడం ప్రజలను మోసగించడం కాదా? అన్న అంశాన్ని టీడీపీ, బీజేపీ ఆంధ్ర ప్రజలకు చెప్పవలసిన అవసరం ఉన్నది.

ప్రత్యేక కేటగిరి హోదా లాభంకంటే నష్టమే ఎక్కువ, ప్యాకేజీ మేలని చెబుతున్న కేంద మంత్రి సుజనా చౌదరి రాయితీలు వస్తాయి కాబట్టి ఉత్తరఖండ్‌లో యూనివర్సల్ ప్లాంట్ పెట్టడం అబద్ధమేమీ కాదు. తెలుగుదేశం పార్లమెంటు సభ్యులు గల్లా జయదేవ్ రాయితీలు వస్తాయనే కదా ఉత్తరఖాండ్‌లో అమరరాజా బ్యాటరీస్‌కు స్థలం కొన్న విషయం వాస్తవం. టీడీపీకి చెందిన మరో పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ రాయితీల కోసమే ఈశాన్య రాష్ట్రాలలో విద్యుత్ పరిశ్రమను నడపడం పచ్చి నిజం. ఇంకొక టీడీపీ ఎమ్మెల్యే (వినుకొండ నియోజకవర్గం), జీవీ సీతారామాంజనేయులు హైదరాబాదు నుండి ఉత్తరాఖండ్‌కు వెళ్లి శివశక్తి బయో ప్లాంటును పెట్టారంటే రాయితీల కోసమేకదా? కానీ ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం ప్రత్యేక హోదా అక్కరలేదు, ప్యాకేజీ మేలని నీతి వాక్యాలు వల్లిస్తున్నారు. ప్రత్యేక హోదా ఉంటేనే కొత్తగా పరిశ్రమలు పెట్టడానికి వస్తారు. ప్రత్యేక ప్యాకేజీల వల్ల పెట్టుబడిదారులు రారనేది వాస్తవం ఎందుకంటే ప్యాకేజీలో రాయితీలు ఉండవు. చట్టబద్ధత ఉండదు.

పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఏ పెట్టుబడిదారుడికీ, కార్పొరేట్ కంపెనీకి ఏ ప్రాంతంపైనా ప్రత్యేకంగా మక్కువకాని, ద్వేషంకాని, ప్రేమకాని ఉండవు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు కావాల్సింది లాభం. పెట్టుబడి పెట్టేముందు అక్కడ ఎటువంటి రాయితీలు ఉన్నాయి, ప్రోత్సాహకాలు ఎలా ఉన్నాయి, వాటివల్ల తక్షణం వచ్చే ప్రయోజనాలు, దీర్ఘకాలంలో వచ్చే లాభాలు, అక్కడ యూనిట్ పెడితే పెరిగే ఖర్చులు, అంతేకాక లేబర్ చౌకగా దొరుకుతుందా, నీరు, కరెంటు సబ్సిడీలు ఏమైనా ఉన్నాయా తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుంటారు.

రగులుగుతున్న తెలుగు గుండెలు

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంనుంచి రావాల్సిన ప్రయోజనాల కోసం పోరాటం ఉధృతమవుతున్నది. ప్రజలు తమ డిమాండ్లు సాధించుకోవడానికి ఉద్యమిస్తున్నారు. రాష్ట్రబంద్ సందర్భంగా ప్రజలు రోడ్డెక్కారు. టీడీపీ, బీజేపీ గత నాలుగు సంవత్సరాల నుంచి ఇదిగో, అదిగో అంటూ తాత్సారం చేసి విభజన హామీల అమలుకు చిత్తశుద్ధితో ముందుకు రావడం లేదు. 2014 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెసు అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించిందని తాను రాష్ట్రానికి న్యాయం చేస్తానని, రాజధానిని నిర్మిస్తానని నరేంద్రమోడీ హామీ ఇచ్చారు. బీజేపీ ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ముందుకు రావటం లేదు. ఆంధ్ర ప్రజలకు తీరని అన్యాయం జరిగింది. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర మనస్తాపం చెందడమేకాక ప్రజా ఐక్య ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. కేంద్రబడ్జెట్‌లో ఆంధ్ర ప్రజలకు అన్యాయం జరిగింది. 24.4 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినా ఆంధ్ర రాష్ట్రానికి అరకొర నిధులతో సరిపెట్టారు. ఈ మధ్యనే బీహార్ ఎన్నికల సమయంలో ఆ రాష్ట్రానికి లక్షా 50వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించారు, ఎన్నికల తరువాత ప్యాకేజీ ఊసేలేదు. ఆంధ్రాను జీరో చేశారు. విభజన హామీలకు సంబంధించి పోలవరం జాతీయ ప్రాజెక్టు నిధులు రాకపోవడం, విశాఖ రైల్వేజోన్ ఇవ్వకపోవడం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, గ్రీన్‌ఫీల్డ్ ముడి చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో రసాయన సముదాయాన్ని నెలకొల్పకపోవడం, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్, ఢిల్లీ-ముంబై పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయకపోవడం, రెవెన్యూ లోటు భర్తీ చేయకపోవడం, రాయలసీమ, ఉత్తరకోస్తా జిల్లాల అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వకపోవడం, జాతీయ విద్యా సంస్థలను నెలకొల్పకపోవడం, సచివాలయం, శాసనసభ, రాజభవన్, హైకోర్టు స్థాపనకు నిధులు సక్రమంగా ఇవ్వకపోవడం తదితర అంశాలపై ఆంధ్రప్రజలు రగిలిపోతున్నాయి. రాష్ట్రంలో తీవ్రమైన ఐక్య ఉద్యమాలకు తెలుగు ప్రజలు సిద్ధంకావడం, బీజేపీ, తెలుగుదేశం పార్టీల నిజస్వరూపం బహిర్గతమయ్యే సమయం దగ్గరపడింది.

పార్లమెంటు హామీలు, ప్రమాణాలను పతనం చేసిన బీజేపీ

ప్రపంచ చరిత్రలో భారతదేశ పార్లమెంటులో చేసే ప్రసంగాలకు, చట్టాలకు, హామీలకు విలువ కల్గి చాలా దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. పార్లమెంటులో ప్రజాస్వామ్యాన్ని తమదైన రీతిలో ప్రవర్తించి చాలా విలువలతో కూడిన రోజులున్నాయి. పార్లమెంట్‌లో విలువలతో కూడిన అద్భుత ప్రసంగాలు చేసే వారి సంఖ్య తగ్గిపోయింది, ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారాలు ఇచ్చేందుకు నేతలు కరువయ్యారు.

పార్లమెంటుకు ఎలాంటి సభ్యులను పంపించాలి? తాను ఎన్నికైన రాష్ట్రానికి, పార్టీకి ఎలాంటి గౌరవరం పెంచాలి. తాను ఏ అంశాలు మీద చర్చలో పాల్గొనాలి లాంటి వాటిపై ఎవ్వరూ ప్రాధాన్యత యివ్వటంలేదు. ఈ మధ్యనే బీజేపీ అధ్యక్షులు అమిత్‌షా రాజ్యసభలో చేసిన ఉపన్యాసాన్ని పరిశీలిస్తే దేశ ప్రజలు సిగ్గుపడాల్సి వచ్చింది. పార్లమెంటు అంటే ఒకరిపై ఒకరు విమర్శ నాస్త్రాలు గుప్పించడం, అరుచుకోవడం, పరస్పర దాడులు చేసేందుకు వేదికగా ఉన్నది. కొంత మంది పార్లమెంటు సభ్యులు తమ వ్యాపారాలను పెంచుకునేందుకు పైరవీలు చేసుకునేందుకు కేంద్రంగా మారింది. రాష్ట్రాల అవసరాలను కేంద్రం పట్టించుకోకపోవడం ఆయా రాష్ట్ర ఎం.పీలు నిరసన ప్రదర్శనలు నిర్వహించడం, పార్లమెంట్‌ను స్థంబింపచేయడం మినహా వేరే మార్గము లేకపోయింది.

2014 ఫిబ్రవరిలో ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా 5 సం.లు పాటు ఇస్తామని పార్లమెంటు సాక్షిగా ప్రకటించారు. 2014 సెప్టెంబరు 7వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఆంధ్రప్రదేశ్‌కు ప్యాకేజి ప్రకటించి, అ ప్యాకేజికి చట్ట బద్ధత కల్పించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్యాకేజి అమలుకు సంబంధించి నిధులు కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం ఏపీని నిర్లక్ష్యం చేసింది. పార్లమెంటు సాక్షిగా యిచ్చిన విభజన హామీలను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కి ఆంధ్ర ప్రజలకు దోహ్రం చేసింది. పార్లమెంటులో ప్రకటించిన హామీలను అమలు చేయకుండా మోడీ పార్లమెంట్ విలువలను, ప్రమాణాలను పతనం చేశాడు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కుగా రాష్ట్ర ప్రజానీకం భావించారు. ఈ హక్కును ఎవరు హరించినా సహించేది లేదని యిప్పటికే అన్ని వర్గాలు కదంతొక్కడం మన ఐక్యతకు నిదర్శనం. పార్లమెంటు చేసిన విభజన చట్ట హామీలను అమలు చేయవలసిన బాధ్యత కేంద్రంపై ఉంది. ప్రత్యేక హోదా సాధించడానికి ఆంధ్రప్రజలకు సత్తా ఉందని నిరూపించుకోవలసిన పరీక్ష సమయం వివిధ పార్టీల ముందు ఉన్నది. 2014 ఎన్నికలలో బీజేపీకి పూర్తి మెజార్టీ రావడంతో మోడీ ప్రభుత్వం రాష్ట్రాల పట్ల వివక్షత చూపుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ అవకాశాలు, ప్రయోజనాలు లేకపోవడంతో విభజన చట్టాల హామీల అమలులో బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇప్పుడైన రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలు అవకాశవాద పొత్తులకు, ప్రయోజనాలను ఆశించకుండా అన్ని వర్గాల ప్రజలను విశ్వాసంలోకి తీసుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. ముఖ్యంగా టీడీపీ, బీజేపీ పాత్రను ప్రజలు అనుమానిస్తున్నారు. కనుక వివిధ వర్గాల ప్రజలు, సంస్థలు, రాజకీయాలు ప్రక్కన పెట్టి పార్టీలు అన్నీ ఏక తాటి మీదకు రావాలి.

వ్యాస రచయిత : మాజీ ఎమ్మెల్యే, ఆచంట
సెల్ : 9848024831

వి-మెయిల్

తమిళరాజకీయ రంగంలో కమల్‌హాసన్ రాణించేనా?

"విలక్షణ విశ్వనటుడు, తెలుగు, తమిళ, వివిధ భాషలలో అనేక సినిమాలలో హీరోగా తన సహజమైన నటనతో అశేష అభిమానులను సొంతం చేసుకున్న కమల్ హాసన్ రాజకీయ రంగ ప్రవేశం చేసి 'మక్కల్ నీది మయ్యం" (ప్రజా న్యాయం కేంద్రం) పార్టీని స్థాపించారు. ఆరుచేతులు, నక్షత్రంతో జెండాగా రామేశ్వరంలో అబ్దుల్‌కలాం నివాసం నుండి యాత్ర ప్రారంభించి, మధురైలో జరిగిన సభలో కమల్‌హాసన్ ఉద్వేగంగా ప్రసంగించి పార్టీ పేరు, చిహ్నం, జెండా, తన పార్టీ ఎజెండాను ప్రకటించారు. ఓటును అమ్ముకొని ఏళ్ళతరబడి కష్టాలపాలవుతున్న ప్రజలను గట్టెక్కించేందుకే రాజకీయ పార్టీని ప్రారంభించాను" అంటూ కమల్ మాట్లాడడం అందరిని ఆకట్టుకుంది. భారతదేశంలోనే తమిళనాడు. రాజకీయంగా భిన్నంగా వుంటుంది. అవినీతి, అక్రమాలు తమిళనాడులో పెరిగిపోతున్నాయి. ప్రజలు కూడా రాజకీయాలంటే ఈసడించికునే పరిస్థితి నెలకొంది. జయలలిత మరణం తర్వాత అధికారంలోకి రావడానికి వివిధ పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నాయో! గందరగోళంగా. దారితీసిన పరిస్థితులు తెలిసినవే. కొన్ని నెలల క్రితం సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయపార్టీ ఏర్పాటుపై అభిమానులతో సమావేశాలు ఏర్పాటు చేసి అదను కోసం ఎదురుచూసున్న సమయంలో కమల్‌హాసన్ ఒక అడుగు ముందుకేసి. రాజకీయ పార్టీని స్థాపించడం, అభిమానులకు శుభవార్తే అని చెప్పవచ్చు. రాజకీయ రంగంలో కమల్‌హాసన్ రాణిస్తారా అనేది ప్రశ్న? భ్రష్టుపట్టిన తమిళ రాజకీయాలను కమల్ బాగుచేస్తాడా! 'నాయకన్' సినిమాలోతన నటనతో అందరినీ ఆకర్షించిన కమల్‌హాసన్ నిజజీవితంలో 'నాయకుడిగా' వెలుగొందుతారా? వేచి చూడాల్సిందే). బహిరంగ సభలో మచ్చలేని నాయకుడు, ఢిల్లీ సి.యం కేజ్రీవాల్ అదనపు ఆకర్షణగా నిలిచారు. సున్నిత మనస్తత్వం గల కమల్‌హాసన్ తన పార్టీని తమిళనాడులో ఎలా విస్తరింప చేస్తాడో, అభిమానుల ఆరాధ్యుడైన కమల్ రాజకీయ రంగంలో కూడా రాణించి అవినీతి, అక్రమాలలోని నూతన తమిళ రాజ్యాన్ని అవిష్కరింపచేస్తారని ఆశిద్దాం. మన తెలుగు రాష్ట్రాల నుండి వారిని అభినందిద్దాం.

- కామిడి సతీష్ రెడ్డి, జెడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.



ఆట కాదు...!

ఈ చిత్రం చూస్తే ఈ కూర్మము ఎంచక్కా ఇసకలో ఆడుకుంటున్నట్లు ఉంది కదా! కానీ కాదు, ఇదేమీ ఆడుకోవడం లేదు. ఆలివ్ రిడ్లే జాతికి చెందిన ఈ తాబేలు గుడ్లు పెట్టడానికి గూడు పెడుతోంది. ఒడిషాలోని గంజాం జిల్లా రుషికుల్యా వద్ద దృశ్యం ఇది.

నిరంతర రక్తదాత!



వృత్తిరీత్యా ఆయనొక ఉపాధ్యాయుడు. గతంలో ఎయిర్‌ఫోర్సులో టెక్నీషియన్‌గా విధులను నిర్వర్తించి పదవీ విరమణ చేశారు. ఒకవైపు ఎయిర్ ఫోర్స్ ఉద్యోగిగా పెన్షన్, మరోవైపు ఉపాధ్యాయునిగా మంచి జీతం. తినేందుకు, ఉండేందుకు ఎటువంటి ఇబ్బందుల్లేని కుటుంబం. అయినా సమాజానికి తనవంతుగా ఏదోక తోడ్పాటును అందించాలని తహతహలాడుతుంటాడు.
ఈ క్రమంలోనే రక్తదానం చేయటం అలవాటుగా చేసుకున్నారు. ఒకటీ కాదు, రెండు కాదు ఏకంగా 133 సార్లు రక్తదానం చేసి నిరంతర రక్తదాతగా మారారు. రాష్ట్రంలోనే ఎక్కువసార్లు రక్తదానం చేసిన వ్యక్తిగా రికార్డులకు ఎక్కారు. రక్తదానంతోపాటు తమన్నా ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఈ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారు. ఉత్తమ రక్తదాతగా ఎన్నో అవార్డులు, ప్రశంసలు, అభినందనలు అందుకున్నారు. ఆయనే...ఆ ఉపాధ్యాయుడే బొడ్డేపల్లి రామకృష్ణారావు. ఆయన పుట్టింది శ్రీకాకుళం జిల్లాలో, ప్రస్తుతం ఉండేది విజయనగరం జిల్లాలో.



తొలిసారిగా రక్తదానం చేసిన ధృవపత్రం

బొడ్డేపల్లి రామకృష్ణారావు పుట్టింది శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం బొడ్డేపల్లి గ్రామంలో. 1964, జనవరి 22న రాములు, లక్ష్మి దంప తులకు మూడో సంతానంగా రామకృష్ణారావు జన్మించారు. ఆయన విద్యా భ్యాసం అంతా విజయనగరం, విశాఖ జిల్లాల్లో కొనసాగింది. బిఎస్సీ, బిఇడి పూర్తి చేసిన ఆయన 1983లో ఎయిర్‌ఫోర్స్ టెక్నిషియన్‌గా వృత్తిని ప్రారం భించి 2003 వరకు ఆ ఉద్యోగంలో కొనసాగారు. అనంతరం ఆయన ఉద్యోగ విరమణ చేసి 2006లో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభించారు.

శ్రీలంక ఘటనతో...!

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో 1987 సంవత్సరంలో శ్రీలంకలో జరిగిన ఓ సంఘటనలో క్షతగాత్రులను పెద్ద ఎత్తున బెంగుళూరు ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకువచ్చారు. అక్కడ క్షతగాత్రులకు చాలా రక్తం అవసరమైంది. ఆనాటి సంఘటనతో చలించిన రామకృష్ణారావు 1987, సెప్టెంబర్ 17న తొలిసారిగా రక్తదానం చేసారు. అదే స్ఫూర్తితో ఆనాటి నుంచి నేటి వరకు నిరంతరం రక్తదానం చేస్తూనే ఉన్నారు. ఆయన బ్లడ్ గ్రూపు ఎబి-పాజిటివ్.



రక్తదానం చేస్తున్న రామకృష్ణారావు, వారి కుమారుడు చాణక్య

ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్

రక్తదానాన్ని ప్రోత్సహించేందుకు ఆయన ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్‌ను స్థాపించారు. ఈ క్లబ్ ద్వారా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు రక్తదానంపై అవగాహన సదస్సులను నిర్వహించి ప్రజల్ని చైతన్యవంతులు చేస్తున్నారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు 120 రక్తదాన శిబిరాలను నిర్వహించారు.

ఉత్తమ రక్తదాతగా అవార్డులు

రాష్ట్రంలోనే అత్యధికంగా 133 సార్లు రక్తదానం చేసిన రామకృష్ణారావు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎన్నో అవార్డులను పొందారు. భారత రక్తప్రదాత అవార్డుతో పాటు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి ఉత్తమ రక్తదాతగా సత్కారాన్ని పొందారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ రక్తదాతగా కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నుంచి వరసగా రెండేళ్ళు 2016, 2017 సంవత్సరాల్లో అవార్డులను అందుకున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య నుంచి ఉత్తమ రక్తదాతగా సత్కారాన్ని అందుకున్నారు. జిల్లాకు చెందిన అనేకమంది కలెక్టర్ల చేతుల మీదుగా ఎన్నో అవార్డులను తీసుకున్నారు.

అవయవదానం

పలుమార్లు రక్తదానం చేసి రికార్డులకెక్కడమే కాదు 2008లో తన అవయవాలను దానం చేసి ఆదర్శవంతునిగా నిలిచారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తనవం తుగా కృషి చేస్తున్నారు. మరణానంతరం అవయవాలను వృథాగా పోనీయకుండా వేరొకరికి ఉపయోగపడేలా చేయాలంటూ ఆయన ప్రజల్ని చైతన్యపరుస్తున్నారు. మనిషిగా పుట్టిన తర్వాత ప్రతి ఒక్కరూ తనకోసం తాను బతుకడం కాదు సమాజం కోసం కూడా ఎంతోకొంత సేవ చేయాలన్నది రామకృష్ణారావు మాష్టారు సిద్ధాంతం.

తమంతట తాము రక్తదానం చేయడంతోపాటు ఇతరు లచే రక్తదానం చేయించాలని, రక్తదానంపై అపోహలను వీడి ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకి రావాలని ఆయన పిలుపునిస్తున్నారు. రక్తదానం ఎంతో ఆరోగ్యకరమని, ఆరోగ్యవం తులైన ప్రతిఒక్కరూ స్త్రీ,పురుష లింగబేధం లేకుండా ఎవరైనా ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చని చాటి చెబుతున్నారు.

తమన్నా ఫౌండేషన్

తమన్నా ఫౌండేషన్ స్థాపించి ఈ ఫౌండేషను ద్వారా గ్రామాల్లో కనుమరుగైపోతున్న సంస్కృతి, సంప్రదాయాలను వెలుగులోకి తీసుకువస్తున్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఎన్నో రకాల సామాజిక కార్యక్రమాలూ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటే కార్యక్రమం, మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టి యువతలో స్ఫూర్తిని నింపుతున్నారు. స్వైన్ ఫ్లూ సమయంలో తమన్నా ఫౌండేషను ద్వారా సుమారు లక్ష మందికి ఉచితంగా హోమియోపతి మందులను పంపిణీ చేశారు. యువతను చైతన్య పరిచి వారిచే సాధనా యూత్ క్లబ్, చేయూత ఫౌండేషన్, ఆదర్శయువజన సంఘం వంటి స్వచ్ఛంద సంస్థలను పలు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. గ్రంథాలయోద్యమ పితామహుడు జయంతి రామలక్ష్మణమూర్తి పేరు మీద గ్రంథాలయం నిర్వహణ కూడా చేపట్టారు. విద్యార్థులకు ఉచితంగా దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలకు శిక్షణను ఇచ్చారు. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు చెప్పడానికే పరిమితం కాకుండా, ఆయన ఏ గ్రామంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తే ఆ గ్రామంలో యువతను చైతన్య పరుస్తూ వారిలో స్ఫూర్తిని నింపడంలో ముందుంటారు రామకృష్ణారావు. తాను పనిచేసే చోట గ్రామపెద్దలు, యువత సహకారంతో ఆ గ్రామంలో సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజం పట్ల వారి బాధ్యతలను గుర్తెరిగేలా చేయడంలో ముందుంటున్నారు.

కుటుంబ సభ్యులతోనూ...!

తాను రక్తదానం చేయడంతోపాటు తన కుటుంబ సభ్యులందరితోనూ రక్తదానం చేయించి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఆయనతోపాటు ఆయన కుమారుడు చాణక్య ఇప్పటివరకు 28 సార్లు, అల్లుడు నవీన్‌కుమార్ 16 సార్లు రక్తదానం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అన్ని రక్త నిధి కేంద్రాల్లో రక్తదానం చేసిన ఏకైక వ్యక్తి రామకృష్ణారావు. తన శరీరంలో అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చిన ఆదర్శనీయుడు రామకృష్ణారావు. రక్తదానం, అవయవదానంలో తనతోపాటు తన కుటుంబ సభ్యులనూ భాగస్వాములను చేసిన ఈ టీచర్ సమాజానికి స్ఫూర్తిదాయకుడిగా నిలిచారు.

– ఎస్. శివాజీ, విజయనగరం



పూనం మాలకొండయ్య నుంచి సత్కారం పొందుతున్న దృశ్యం



కేంద్రమంత్రి అశోక్ నుంచి సత్కారం పొందుతున్న దృశ్యం

ప్లాస్టిక్ పాత్రల జిడ్డు వదిలిద్దామిలా!





ప్లాస్టిక్ పాత్రలను కడగడం కాస్త కష్టమే. స్టీల్, గాజు పాత్రలతో పోలిస్తే ప్లాస్టిక్ పాత్రలకు జిడ్డు, వాసన, మరకలు త్వరగా పోవు. ప్లాస్టిక్ పాత్రల నిర్వహణ కాస్తంత సవాలుతో కూడుకున్నదే అని చెప్పొచ్చు. దిగువన పేర్కొన్న టిప్స్‌తో మీ ప్లాస్టిక్ పాత్రలు మెరవాల్సిందే. ఈ టిప్స్‌ను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. పాత్రల క్లీనింగ్‌కు వెళ్లేముందు ప్లాస్టిక్ వాటి నాణ్యత గురించి తెలుసుకోవడం ముఖ్యం. రోజువారీ అవసరాలకు మందంగా ఉండే పాత్రలను ఎంపిక చేసుకోవడం మంచిది. మరోవైపు పల్చగా ఉన్న ప్లాస్టిక్ పాత్రల వల్ల ఆహారం చెడిపోయే ప్రమాదం ఉంది.

వాసన పోయేందుకు.. నిమ్మ

నిమ్మలో సిట్రిక్ ఆమ్లం ఉంటుంది. ఇది న్యాచురల్ డిస్ ఇన్ఫెక్టెంట్ లాగ పనిచేస్తుంది. నిమ్మలో యాంటీ బ్యాక్టీరియా గుణాలు ఉంటాయి. అవి దుర్వాసను సులువుగా వదిలించగలవు. ఒక నిమ్మకాయ తీసుకొని సగానికి కోసి ప్లాస్టిక్ పాత్రల లోపలి భాగాలను శుభ్రం చేయవచ్చు. ఆ తర్వాత బేకింగ్ సోడాతో రుద్ది నీటితో కడిగి ఆరబెడితే చాలు.

పత్రికలు

ఇది వినడానికి విడ్డూరంగా ఉంటుంది కానీ మీ అభిమాన దినపత్రికలతో ప్లాస్టిక్ పాత్రలను శుభ్రం చేసుకోవచ్చు. దుర్వాస వచ్చే పాత్రలలో న్యూస్‌పేపర్లు చుట్టలా చేసి మూతపెట్టేయాలి. రాత్రంతా ఉంచి పొద్దునే తీసేసి సబ్బు నీళ్లతో కడిగేస్తే వాసన మటుమాయం. రాత్రే ఉంచాలని కాదు పగలు కూడా న్యూస్‌పేపర్ల చుట్ట ఉంచొచ్చు.

వెనిగర్

రెండు వంతుల వెనిగర్ లో 1 వంతు నీళ్ల కలపాలి. ఈ ద్రావణాన్ని ప్లాస్టిక్ డబ్బాలో వేసి రాత్రి ఉంచాలి. ఉదయాన్నే నీటితో శుభ్రంగా కడిగేయాలి.

జిడ్డు పోగొట్టేందుకు.. బేకింగ్ సోడా

బేకింగ్ సోడాను నీటిలో వేసి పేస్టులా చేసుకోండి. మెత్తని బట్టతో ప్లాస్టిక్ బాక్సులోపల తుడవండి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయండి. బేకింగ్ సోడా ప్లాస్టిక్ నుంచి జిడ్డును తొలగించగలదు.

డిటర్జెంట్ సబ్బు

ఇది సాధారణంగా చేసే విధానం. దీంట్లో భాగంగా గోరువెచ్చని డిటర్జెంట్ నీటిని 10 నుంచి 15 నిమిషాల పాటు ప్లాస్టిక్ కంటెయినర్లో ఉంచాలి. ఆ తర్వాత దాన్ని డిష్ వాష్‌తో కడిగేసి ఎండలో ఆరబెట్టాలి. ఏదైనా జిడ్డు ఉంటే సులభంగా వదిలిపోతుంది.

మరకలు పోగొట్టేందుకు.. క్లోరిన్ బ్లీచ్

క్లోరిన్ బ్లీచ్, నీళ్ల ద్రావణం తయారుచేసుకోవాలి. ఒక టేబుల్ స్పూన్ క్లోరిన్ బ్లీచ్‌కు ఒక కప్పు నీళ్లు సరిపోతాయి. ఈ మిశ్రమాన్ని ప్లాస్టిక్ పాత్రలో అరగంట పాటు ఉంచాలి. ఆ తర్వాత సబ్బు నీళ్లతో కడిగేస్తే సరి.

సూర్య రశ్మి

ఏదైనా వస్తువును ఎండలో ఎక్కువ సేపు ఉంచితే రంగు పోతుందన్న సంగతి తెలిసిందే. అదే విధంగా ప్లాస్టిక్ పాత్రలపై ఏవైనా మరకలుంటే సులభంగా వదిలించుకోవచ్చు. 3 లేదా 4 గంటలు ఎండలో వదిలేస్తే మరకలు పోతాయి. ఆ తర్వాత నీటితో శుభ్రంగా కడిగేయాలి. వంట స్ప్రే ప్లాస్టిక్ బాక్సుల్లో ఆహారాన్ని ఉంచేముందు కాస్తంత నూనె స్ప్రే చేయడం మంచిది. ఇది ఆహారానికి, ప్లాస్టిక్ కు మధ్య వారధిలా ఉంటుంది.

ఆకట్టుకునే అందం

ఆఫ్రికన్ వైలెట్

కొన్ని పూలు ముచ్చటైన రంగుల్లో మది దోచేస్తాయి... అందరినీ ఆకట్టుకుంటుంటాయి...ఇంటి ముందు, నట్టింట్లో పెంచుకోవడం మాత్రమే కాదు, ఎవరికైనా బహుమతిగా ఇవ్వాలన్నా ఇవి చక్కని ఎంపికవుతాయి. అలాంటి ప్రత్యేకతలన్నీ ఉన్నవే ఆఫ్రికన్ వైలెట్లు.. ప్రపంచ వ్యాప్తంగా ఇవి వందల రకాల్లో దొరుకుతున్నాయి. మన దేశంలో మాత్రం ఎరుపు, గులాబీ, తెలుపు, వంగపూవ్వు కలర్ వంటి ఐదారురంగుల్లోనే ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి. సుమారు రెండొందలు రూపాయల ఖరీదులో ఇవి అన్ని నర్సరీల్లో లభిస్తాయి.

ఇంట్లోనే అందంగా పెంచుకోవచ్చు:

మన వాతావరణంలో ఇది చాలా చక్కగా పెరుగుతుంది. పూలు త్వరగా పూస్తాయి. అయితే ఇతర పూల మొక్కలతో పోలిస్తే ఇది నేరుగా పడే సూర్యకాంతిని తట్టుకోలేదు. అందువల్ల పెరట్లో పెంచుకుంటున్నా, లేక కుండీల్లో నాటుకుని, ఇంట్లోనే పెంచుకుంటున్నా తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి. ముదురు రంగుల్లో గుబురుగా పూలు పూయడం ఈ మొక్క ప్రత్యేకత. బాల్కనీ, కిటికీలు, మాత్రమే కాదు...టీపాయ్, డైనింగ్ టేబుల్...ఇలా ఎక్కడైనా ఈ మొక్కను పెట్టుకోవచ్చు. వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు గాలి ధారాళంగా వచ్చేలా చూసుకోవాలి. లేదంటి ఫంగల్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.



ఆఫ్రికన్ వైలెట్ మొక్కను పెంచుకోవాలనుకున్నప్పుడు తేమ ఎక్కువగా పీల్చుకునే మట్టిని ఎంపిక చేసుకోవాలి. లేదంటే సమాన పరిమాణంలో కోకోపీట్ ఎరువుల మిశ్రమాన్ని కలిపి మొక్కను నాటాలి. లేదంటే మట్టిలో తేమ తగ్గి ఆకులు సహజ అందాన్ని కోల్పోతాయి. క్రమంగా ఎండి రాలిపోతాయి. అందుకే ఎప్పటికప్పుడు తేమ తగ్గకుండా చూసుకోవాలి. అది కుదరదనుకున్నప్పుడు సెల్ఫ్ వాటరింగ్ కంటైనర్‌ని మొక్క దగ్గర ఏర్పాటు చేసినా మంచిదే. దీని వల్ల నెల వరకూ దానికి తేమను పరిశీలించాల్సిన అవసరం ఉండదు.

ఒక మొక్కను నాటుతూనే..దాన్నుంచి మరికొన్ని పెరిగేలా కూడా చేసుకోవచ్చు. అదెలాగంటే..ఈ మొక్క కాండం చాలా సున్నితంగా, దానిలోపల జెల్లీ తరహా ద్రవంతో నిండి ఉంటుంది. దీన్ని నాటేముందే కణుపుల దగ్గర పదునైన చాకుతో కత్తిరించి అంటుకట్టడం ద్వారా కొత్త మొక్కలను కూడా పాక్షికంగా ఎండ తగిలే చోట ఉంచితే సరిపోతుంది.

పోషకాలూ అందించాలి : ఈ మొక్క ఎంత సులువుగా పెరుగుతుందో అంత సున్నితమైంది కూడా. అందుకే నీళ్లు పెట్టడం నుంచి ఎరువులు వేసే వరకూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ నీళ్ళు పడితే అవి కాకుండా ఫిల్టర్ నీటిని ఎంపికచేసుకోవాలి. అలాగే 14:14:14నిష్పత్తిలో నీటిలో కరిగే ఎన్ ఫీకే, మైక్రోన్యూట్రీయంట్లను కలిపి నెలకోసారి చల్లాలి. ఎరువుల మోతాదు ఎక్కువైతే మొక్క మాడిపోయే ప్రమాదంఉంటుంది. అందుకే నిష్పత్తి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

బొద్దింకల బెడద తగ్గించుకోవాలా!

మీ వంటింటి శత్రువులు బొద్దింకల్ని ఎంత తరిమినా పోవడం లేదా! ఇంట్లో యజమానుల్లా తిరుగుతున్నాయా! వీటివల్ల ఆహారం విషపూరితమవుతుంది. బొద్దింకల్ని వదిలించుకోవడానికి కొన్ని పద్ధతులున్నాయి. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా బొద్దింకలు రాకుండా నియంత్రించవచ్చు. వంటకాల్ని అపరిశుభ్రమైన గిన్నెల్లో కొన్ని రోజుల పాటు ఉంచితే బొద్దింకలు వస్తాయి. అలా చేయకుంటే అవి రావు. బొద్దింకలు ఆహారం కోసం ఇంటింటికీ తిరుగుతుంటాయి. బ్లాట్స్, ఉచ్చులు, ఎరలు వేసి వాటిని బంధించి చంపవచ్చు. బ్లాట్స్ ఉపయోగించడం ఉత్తమమైన పద్ధతి. బ్లాట్స్‌తో సులభంగా బొద్దింకలను తొలగించవచ్చు. జెల్స్‌ని కూడా ఉపయోగించవచ్చు. ఈ రెండూ మార్కెట్లో ఎక్కువగా లభ్యమవుతాయి. నెమ్ము బొద్దింకలు నీరు లేకుండా ఏడు రోజులు మాత్రమే బతుకుతాయి. అందుకని ఇంట్లో ఎక్కడా కూడా తేమ లేకుండా చూసుకోవాలి. అలా చేస్తే బొద్దింకల బెడద అదుపులో ఉంటుంది. ఎక్కువ వాసన వచ్చే క్రిమి సంహారక మందుల్ని వాడటం ద్వారా కూడా వాటిని అదుపులో వుంచవచ్చు. బోరిక్ యాసిడ్, బోరిక్ యాసిడ్ పొడిని బొద్దింకలు సంచరించే ప్రదేశాల్లో చల్లండి. బిర్యాని ఆకుని బొద్దింకల్ని తొలగించడానికి ఉపయోగించవచ్చు. బిర్యాని ఆకు ఘాటైన వాసన కూడా ఇందుకు సహకరిస్తుంది. బొద్దింకలు తిరిగే చోట వీటిని వేలాడదీస్తే ఫలితం ఉంటుంది.





జరిగిన కథ

నర్సుల భవంతి పెరటి ద్వారంనుంచి ఆస్పత్రి ఆవరణలోకి ప్రవేశించి - సరాసరి పెద్ద అధికారి బంగళాముందు కారును ఆపమన్నాను. వెనుకటిలాగే కారు తాళాలని నా దగ్గిరవుంచు కొని మాలతిని కారులో పడుకోబెట్టి అధికారితో మాట్లాడి వస్తానని కారువాడితో చెప్పి, బంగాళాలోకి వెళ్ళాను... అతడు ఉత్తరాదిమనిషి. పెద్దతోలుకుర్చీలో కూర్చుని చల్లని ఎలక్రిక్ దీపం దగ్గిర చదువుకుంటున్నాడు. దగ్గర మేజామీద ఒక గళాసులో పానీయం, నాలుగు 'అషాహీ బీర్' సీసాలు వున్నాయి. నన్నుచూసి ఆయన త్రుళ్ళిపడ్డాడు. చేతిలో పుస్తకం భళుక్కుమని కిందపడింది.

"మీరు జపానువాళ్ళ తాలూకా ఏమిటి? కాకపోతే, యీ బాంబుల వర్షంలో ఇంత ధైర్యంగా ఎలా వస్తారు? మీ చేతిలో దేమిటి?" అని గాభరాగా అడిగేడు, నా రివాల్వరు చూసి అదిరిపోతూను. "నేను ఎవరైనదీ మీకు అవసరంలేదు. నా చేతిలోది చక్కని 303 'షైదరు' ఆటోమాటిక్కు

(నిన్నటి సంచిక తరువాయి)

మహా సున్నితంగా పనిచేస్తుంది - నూరుగజాల మేరలో! నా స్నేహితురాలు పురిటినొప్పులు పడుతూ ప్రమాదస్థితిలో వుంది. ఆమెని తక్షణమే ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స యేర్పాటుచెయ్యాలి మీరు. నిలబడ్డపాటుని నాతో రండి. కారు గుమ్మంలో వుంది. స్త్రీల విభాగానికి వెళదాం!" అన్నా.

"ఆసుపత్రిలో ఖాళీలు లేవండి!" అన్నాడాయన - కాస్తధైర్యం తెచ్చుకుని.

"ఆ మాటనడం మీకు ఊతపదం అయిపోయింది! ఎంత మందో రోగులు జపాను ప్లేన్లకి బెదిరిపోయి - ఆస్పత్రినుంచి పారిపోవడం - నా కళ్ళారా ఇప్పుడే చూశాను. దయచేసి వెంటనే రండి!

"ఈ రివాల్వరు అతి నాజూకైనది. 'సేఫ్టీక్యాప్' కూడా తప్పించాను"! అన్నాను - కాలు నేలను కొడుతూను.

ఆయన లేచి, "ఇదిగో-వస్తున్నానుగా! ఆయుధాన్ని దాచేయండి మరి!" అన్నాడు ఖంగారుగా.

కారెక్కి స్త్రీల విభాగానికి కెళ్ళాం. వసారాలలో వున్న వైద్యురాలితో అతను మాట్లాడి - నర్సుల నిద్దరిని పిలిపించి - మాలతిని కారులో నుంచి దింపించి - ఆస్పత్రిలోకి ఆమెను తీసుకెళ్ళాడు. నేను వసారాలో బెంచి బల్లమీద కూర్చున్నాను. పది నిమిషాల్లో అధికారి లోపలినుంచి వచ్చి 'మీ స్నేహితురాలిని ఆస్పత్రిలో స్పెషలువార్డులో చేర్చుకున్నాం. మొదటిసారి కాన్పు కాబట్టీన్నీ - ఈవేళ బీభత్సానికిన్నీ - రక్తస్రావం వల్ల బాధపడుతూంది. కాని మీ వైద్యుడెవరో గట్టివాడు. 'హయూసైన్ హైడ్రో బ్రొమైడ్' యేకంగా ఒక గ్రెన్ ఇచ్చేసినట్టున్నాడు - అంచేత ఆమె కింకా నిద్దర మత్తొదల్లేదు. అట్టే ప్రమాదం లేకుండా - రేపు మధ్యాహ్నానికి పురుడు రావొచ్చుని" అన్నాడాయన. ఒక వైద్యుడి నోటంట వైద్యుడిని మెచ్చుకుంటూ మాటలు వినడం ఇదే మొదటిసారి నాకు. అంచేత ఇతడు చాలా మంచివాడని తోచింది. నా మనస్సు కుదుటపడింది. ధైర్యంచేసి నే నామాత్రలు రెండుసార్లివ్వడం మంచిదే అయిందన్న మాట?

"అయ్యా! వందనశతాలు! మీకు కృతజ్ఞురాలను! సెలవు!" అన్నా, కారువరకూ నడుస్తూ. ఆయన నా వెంట వస్తూ, "పదకొండుగంటల రాత్రి. ప్రమాద పరిస్థితులు. తుంటరులు, గూండాలు రోడ్లమీద విచ్చల విడిగా తిరుగుతూంటారు.' యే నిమిషం యే బాంబు పడుతుందో అన్న విషసమయం. వంటరిగా అబలలు మీరెక్కడికి వెళతారు! ఈ రాత్రి తప్పకుండా బాంబు చేస్తామని సింగపూరు రేడియోలో ఇప్పుడే చెప్పాడు. ఇంటికంటే గుడి పదిలెం. గుడికంటే ఆస్పత్రి పదిలెం! జపానువాడు దయాశీలుడు. ఆస్పత్రులని బాంబు చెయ్యడు! నా బంగాళాకి దయచేయండి. నేనుకూడా వంటరిగా వున్నాను" అన్నాడు కన్ను గీటుతూ.

"మీ కుటుంబం?" అని అడిగా నేను చిరునవ్వు నవ్వుతూను.

"టోకియా రేడియో అజ్ఞానుసారంగా వారం రోజుల కిందటే నా భార్యా పిల్లల్ని పుట్టింటికి పెషావర్ పంపించేశాను. అప్పటినుంచీ నిర్బంధ బ్రహ్మచర్యం!" అన్నాడాయన మంచి హుషారుతో...ఇక శృతిమించి రాగాన్ని పడుతూందని గ్రహించి, నా సంచి తెరచి కారు స్విచ్చి తాళాలకోసం వెతుకుతున్నాను. "ఆ



ఆయుధాన్ని మళ్ళీ తీయకండి! నాకు కృతజ్ఞురాలనని మీరు అన్నందున నేనేదో అన్నాను మాటల ధోరణిలో అంతే సుమండీ! నాకు సెలవియ్యండి!" అన్నాడు ఆయన గడగడ వణుకుతూ. తన దృష్టినంతా నా చేతిసంచీమీదేవుంచి!... కారులో కూచున్నా. ఇంటికి తీసుకెళ్ళమన్నా కారువాడిని.

వీధుల్లో జనం యథాప్రకారంగానే వున్నారు. వెన్నెలరాత్రి క్రీనీడలు. ఆ క్రీనీడలను చూసుకొనే భయకంపితులవుతున్నారు జనం. ఏ నీడ చూచినా జపాను ప్లేన్ల నీడేమో అని గాభరాయే వాళ్ళ కాళ్ళకి రెక్కల నిచ్చింది. వాళ్ళగోల అంతరిక్షానికి అందుతూంది. లక్ష కాళ్ళుగల ఆ రోకలిబండ బీచివేపు



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

పరిగెడుతూంది. రోడ్డుపై రేగిన దుమ్ము - భూమికి చంద్రుడికి మధ్య వెండితెరలాగు యేర్పడింది. ఆ వెన్నెల రాత్రిలో - చెవులు చిల్లులు పడేటంతటి కోలాహలంలో కూడా - ఏదేనా చప్పుడు వినిపించేటప్పటికల్లా ఆ మూక వక్కపాటున గజగజ వణికిపోతుంది. నా కారు దీపాల శూలాలు - ఆ మూకని తాకేసరికల్లా ఒక్కపాటున ఆ కొసనించి యీ కొసకి -బెంబేలెత్తిపోయారు - జపానువాడు వెనుకనుంచి తరుముకు వస్తున్నాడేమో అన్నట్టు. ఆకాశాన్ని నక్షత్రాలు రాలితే - జపాను బాంబులే అనుకుని ఆ మనుష్యులమంద - ఆపాదమస్తకం - హడిలిపోతూంది. ఆ ముక్కిడిమూకకు ఒకటే తలంపు - ఒకటే భయం - ఒకటే కలవరింత - ఒకటే సింహస్వప్నం - 'అదుగో ప్లేను! ఇదిగో బాంబు! పదండి! పదండి!...'

ఇల్లు చేరుకున్నాను. టాక్సీ వాడికి నూరు రూపాయిలిచ్చి పంపించేశాను. తాళాలు తీసి ఇంట్లో కెళ్ళాను. కిటికీ తలుపులు మూసి, దీపం వేశాను. నిలువుటద్దంలో నా ప్రతిబింబాన్ని చూసుకున్నాను. తలంతా రేగిపోయింది జడ విడిపోయింది. జడగంటలు రాలిపోయాయి. చీరకొంగు చిరిగిపోయింది. మోచేతులు గీసుకుపోయాయి. చేతి గడియారం చితికిపోయింది. వేలుని ప్లాటినం వుంగరం - అమ్మ ఇచ్చినది - ఎవరో లాగేశారు. వొళ్ళంతా ధూళిమయం ... పెద్దగడియారం పన్నెండు కొట్టింది .... అప్పుడు జ్ఞాపకం వొచ్చింది, మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత - గుక్కెడు నీళ్ళేనా గొంతుకలో పోసుకోలేదని - పట్టలేనంత బడలిక నన్నావరించింది. ఎక్కడలేని నీరసం - ఎముకల్లోను - కీళ్ళలోనూ నిస్సత్తువ. ఊపిరితీయడానికే నిస్త్రాణ. మంచంమీద వాలి కళ్ళు మూసుకోవడానికే బలహీనం....

లేచాను. గడియారం చూద్దును - నాలుగైంది. పదహారు గంటలు నిద్దరోయానన్నమాట. ఇల్లు చిందర వందరగా వుంది. పాలవాడు వచ్చినట్టు లేదు. దాసీది ఐపులేదు. బంట్రోతులజాడ అసలే లేదు. వంట బ్రహ్మడు పరారి. తోటమాలి గైరుహాజరు. బాంబుదెబ్బలే తగిలాయో - అందరితో పాటు వీళ్ళూ ఎక్కడికేనా తలదాచుకుందుకు పారిపోయారో - ఆ మూకలో కాళ్ళే విరిగాయో - చేతులే విరిగాయో -పాపం! వీళ్ళకి అభయం చెప్పేవాళ్ళెవరేనా వున్నారో లేదో! వీళ్ళకి సాయం చెయ్యడానికి యెవరేనా పూనుకున్నారో లేదో. గవర్నమెంటు? కాంగ్రెసు? హిందుమహాసభ? హితకారిణీ సమాజం? పరమహంస సేనాసేనా...

మాలతి జ్ఞాపకం వచ్చింది. వెంటనే స్నానం చేశాను. ఆకలి అమితంగా వేస్తూంది. తినడానికి యింట్లో యేమేనా వుందా అని వంటిల్లంతా వెతికాను. నిన్న పది గంటలకి వార్చిన అన్నం కెరడు వుంది. సత్తు బుడ్డిలో పుల్ల మజ్జిగ. మెతుకులు మేకులు - పాసిపోయిన వాసన. అక్నట్ హామ్సన్ రాశాడు - "ఆకలితో మాడుతున్నవాడు తినడానికేమీ దొరక్క - చెప్పుల చర్మం పీక్కుతిని - 'మహాబాగుంది రుచి' అని లొట్టలేశాడుట!" అని. పాసిపోయిన మెతుకుల్లో - ఇంత ఉప్పు, వాము కలిపి - పచ్చిమిరపకాయ చిదుముకుని పుల్ల మజ్జిగ పోసుకుని తిన్నాను. ఆకలి తీరింది. కొత్తచీరె కట్టుకుని ఆస్పత్రికి వెళ్ళాను...ఊరంతా నిర్మానుష్యం. ఇళ్ళన్నీ మూసేసుకున్నాయి. కొన్నిళ్ళకి ద్వార బంధాలు - తలుపులు - కిటికీలు వూడబెరికున్నాయి. కొన్నిళ్ళ వసారాల్లో ఎలక్ట్రిక్కు తీగెలూ, దీపాలూ పీకేస్తున్నాయి. దుండగీళ్ళు లూటీ చేసుండాలి. పాడుపడ్డపట్నంలాగుంది. చౌకుల దగ్గిర పోలీసు పహరా లేదు. మిలిటరీ జాడే లేదు... కాలినడకని ఆసుపత్రి చేరుకునేసరికి ఆరుగంటలైంది. వసారాలో 'మేట్రను'ని చూసి

మాలతిగురించి అడిగేను. నిన్నటిరాత్రినుంచి బాధపడుతూందనీ - ఇంకా పురుడు రాలేదనీ - రెండు మూడు గంటల్లో రావచ్చుననీ చెప్పింది ... తొమ్మిదిగంటలు ... పది గంటలు... పదిన్నర... 'మేట్రను' వచ్చి నాతో "పురుడు చాలా కష్టంతో వస్తూంది. అమ్మాయి నీర్సపడుతూంది. రక్తస్రావం హెచ్చుగా వుంది. శస్త్రం చెయ్యాలంటున్నారు. శస్త్రమే చేయాల్సివస్తే - దైవకృప యెలాగుంటుందో!" అని తన మెడలో వేలాడుతున్న ఏసుక్రీస్తు శిలువని తట్టి కళ్ళు మూసుకుని నమస్కరించింది. నాకు భగవంతుడిమీద నమ్మకం పదేళ్ళ క్రితమే పోయింది. ప్రార్థన చెయ్యడానికి నోరు రాదు. చేతులు జోడించడానికి మనసు కిట్టదు. చెన్నపట్నంలోనుకూడా - అమ్మ నాకు అన్నీ నేర్పింది కాని ప్రార్థన నేర్పలేదు. ఆమె ప్రార్థన చేయగా నేనెప్పుడూ చూడలేదు. అమ్మే నాకు దైవం! అమ్మనే తల్చుకున్నాను. మాలతిని విడవ వద్దని చెప్పింది. రైలు కదులుతూండగా - "అమ్మా....అమ్మా...! నీ ఆజ్ఞ నేను మీరలేదు. మాలతిని కనిపెట్టుకునే వున్నాను" అనుకున్నాను మనస్సులో . మాలతి నిపుణులైన వైద్యుల చేతుల్లో వుంది. వాళ్ళు చేతనైన చికిత్స చేస్తున్నారు. అంతటితో వదిలిపెట్టేదాం అనుకున్నాను... రెండు గంటలకి మేట్రను వచ్చి "మీ స్నేహితురాలు పెద్దగండం తప్పి బైటపడింది. ఇప్పుడే పురుడు వచ్చింది - మొగపిల్లడు. ఎనిమిదిపౌన్ల బరువు. ఆమెకి రెండు మూడు గంటల్లో తెలివి రావచ్చు లెండి" అంది. ఆమెకి ధన్యవాదాలు చెప్పి - అమ్మని తల్చుకుని ఆ బెంచిమీదే నిద్రపోయాను.

...మెలుకువ వొచ్చింది. తెల్లవారుతూంది. ఆస్పత్రి గడియారం ఐదు గంటలకొట్టింది. పరిసరాలన్నీ కొత్తగా ఉన్నాయి. ఎక్కడున్నానో జ్ఞాపకం తెచ్చుకోవలసి వచ్చింది.

- ఇంకా వుంది.

ఎన్ఎస్‌జీ నూతన డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియమితులయ్యారు ?

కరెంట్ ఎఫైర్స్ బిట్‌బ్యాంక్



- మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు 2018 జనవరి 18న నగారా మోగింది. అవి ఏవి ?
  - త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ
- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 32వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎవరికి విశిష్ట జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు ?
  - భరత్ భూషణ్
- ప్రపంచవ్యాప్తంగా తనదైన ఫర్నిచర్ సామ్రాజ్యాన్ని స్థాపించిన అపర కుబేరుడు, ఐకేఈఏ వ్యవస్థాపకుడు 2018 జనవరి 27న మరణించారు. ఆయన పేరు ఏమిటి ?
  - ఇంగ్వర్ కంప్రాడ్
- 2018-19 కు గాను రక్షణ రంగానికి రూ.2.95 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేంద్రం కేటాయించింది. అయితే ఈ మొత్తం బడ్జెట్‌లో ఎంతశాతం ఉంది ?
  - 12.1 శాతం
- 2018 సంవత్సరానికిగాను దేశంలో వివిధ రంగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఎంతమందికి ప్రతిష్ఠాత్మక 'పద్మ' పురస్కారాలను భారత ప్రభుత్వం 2018 జనవరి 25న తేదీన ప్రకటించింది ?
  - 85 మంది
- ప్రముఖ నేత్ర చికిత్స పరిశోధన సంస్థ శంకర నేత్రాలయ ప్రతియేటా అందజేసే ప్రతిష్ఠాత్మక ఎంఎస్ సుబ్బులక్ష్మి పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?
  - సుప్రసిద్ధ సినీ నేపథ్యగాయని వాణీ జయరాం
- అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లో రెండేళ్లకొకసారి జరిగే 'ఇండియా ఏవియేషన్ షో' ఈసారి 2018 మార్చి 8 నుంచి 11 వరకు ఏ థీమ్‌తో బేగంపేట విమానాశ్రయం వేదికగా జరుగుతుంది ?
  - వింగ్స్ ఇండియా 2018
- భారత విదేశాంగ శాఖ నూతన కార్యదర్శిగా ఎవరు నియమితులయ్యారు ?
  - విజయ్ కేశవ్ గోఖలే
- 'మీర్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా అందిస్తున్న విశిష్ట సేవలకు, మానవ హక్కుల పరిరక్షణపై కల్పిస్తున్న అవగాహనకుగాను ఏ బాలీవుడ్ నటుడికి డబ్ల్యూఈఎఫ్ పురస్కారం దక్కింది ?
  - షారుఖ్ ఖాన్ (షారుఖ్ ఖాన్‌తోపాటు ప్రముఖ ఆంగ్లనటి అయిన ఆస్ట్రేలియాకు చెందిన కేట్ బ్లాంచెట్‌కు, బ్రిటన్‌కు చెందిన గాయకుడు, పాటల రచయిత అయిన సర్ ఎల్టన్ జాన్‌కు కూడా ఈ పురస్కారాలు లభించాయి)
- అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యమున్న బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5 పరీక్ష 2018 జనవరి 18న విజయవంతమైంది. దీని పరిధి ఎంత ?
  - 5 వేల కిలోమీటర్లు
- జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జీ) నూతన డైరెక్టర్ జనరల్ (డీజీ)గా ఎవరు నియమితులయ్యారు ?
  - సుదీప్ లఖ్టాకియా
- భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ పేరిట 2018 జనవరి 29న పోస్టల్ స్టాంపు విడుదలైంది. ఆయన పేరు ఏమిటి ?
  - డాక్టర్ తలిమెరెన్ ఆవో
- ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎంతమంది శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘం సిఫారసు చేయగా దానికి రాష్ట్రపతి 2018 జనవరి 20న ఆమోదం తెలిపారు ?
  - 20 మంది
- స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఏటా జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సు తరహాలో అమరావతిలో ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్థాయిలో 'ఆనంద నగరాల సదస్సు (హ్యాపీ సిటీస్ సమ్మిట్)'ను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలి సదస్సు ఎప్పుడు జరుగుతుంది ?
  - 2018 ఏప్రిల్ 10 నుంచి 12 వరకు
- పాతికేళ్ల సర్వీసులో రూ.961.92 కోట్లకు సంబంధించిన పన్ను ఎగవేతదారులను గుర్తించిన ఇంటెలిజెన్స్ అధికారికి రాష్ట్రపతి అవార్డు దక్కింది. ఆయన పేరు ఏమిటి ?
  - రవిదత్ శంకర్
- భారత సంతతికి చెందిన ప్రముఖ అమెరికా న్యాయవాది మనీషా సింగ్ అమెరికా విదేశాంగ శాఖలోని ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాల సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. తద్వారా ఆ పదవిని చేపట్టిన ఎన్నో మహిళగా ఆమె అరుదైన గౌరవం దక్కించుకున్నారు ?
  - తొలి మహిళగా
- అణ్వాయుధాల నిరోధానికి కృషి చేస్తున్న ప్రముఖ సంస్థ 'ఆస్ట్రేలియా గ్రూపు' (ఏజీ)లో 2018 జనవరి 19న ఏ దేశానికి సభ్యత్వం లభించింది ?
  - భారత్‌కు
- సరికొత్త ఆవిష్కరణలతో తమదైన ముద్రవేసిన ఇద్దరు భారత సంతతి నిపుణులకు ఈ ఏడాదికి అత్యంత ప్రతిష్ఠాత్మక 'నేషనల్ ఇన్వెంటర్స్ హాల్ ఆఫ్ ఫేమ్' గౌరవం లభించింది ?
  - ఆరోగ్యస్వామి పాల్ రాజ్, సుమిత్రా మిత్రా
- దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో పరిశోధనలకు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన భారీ నిధులు సమకూర్చేందుకు 2018-19 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఏ కార్యక్రమాన్ని ప్రతిపాదించారు ?
  - 'విద్యావ్యవస్థల మౌలిక సదుపాయాల పునరుత్తేజం' (రైజ్)
- భారత సైన్యం కొత్త డీజీఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్)గా 2018 జనవరి 30న బాధ్యతలు స్వీకరించింది ఎవరు ?
  - లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్
- లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?
  - మీగడ రామలింగస్వామి
- కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2018 ఫిబ్రవరి 1న ఎన్ని రూ.లక్షల కోట్ల అంచనాలతో 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు ?
  - రూ.24.42 లక్షల కోట్లు
- అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్ర అటార్నీ జనరల్‌గా ప్రముఖ భారతీయ- అమెరికన్ న్యాయవాది నియమితులయ్యారు. ఆయన పేరేమి ?
  - గుర్బీర్ ఎస్ గ్రేవల్
- 2018-19 బడ్జెట్‌లో 'ఆయుష్మాన్ భారత్' కింద రెండు ప్రధాన పథకాలను ప్రకటించారు. అవి ఏవి ?
  - జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీసీ), ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు
- దాదాపు 7 లక్షల మంది డ్రీమర్లను అమెరికా నుంచి పంపిచేందుకు కంకణం కట్టుకున్న అధ్యక్షుడు డోనాల్డ్ మెత్తబడ్డారు. వీరికి ఎన్నేళ్లలో అమెరికా పౌరసత్వం ఇచ్చేందుకు సిద్ధమని చెప్పారు ?
  - 10, 12 ఏళ్లలో
- హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన రొటావైరస్ టీకా (వ్యాక్సిన్) 'రోటా వ్యాక్'కు ఏ గుర్తింపు (ప్రీ క్వాలిఫికేషన్) లభించింది ?
  - ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ)
- అంధుల క్రికెట్ ప్రపంచ కప్‌ను ఏ జట్టు నిలబెట్టుకుంది ?
  - భారత్
- ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఎగ్జిక్యూటివ్ బోర్డు కొత్త ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ?
  - హరీశ్ మన్వానీ
- 2017 సంవత్సరపు పదంగా ఏ పదాన్ని ఆక్స్‌ఫర్డ్ హిందీ నిఘంటువు ఎంపిక చేసుకుంది ?
  - ఆధార్
- ప్రముఖ దర్శక నిర్మాత యశ్‌చోప్రా పేరుతో సుబ్బిరామిరెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన నేషనల్ యశ్‌చోప్రా మెమోరియల్ అవార్డును 2017కుగాను ఎవరికి ప్రకటించారు ?
  - ప్రముఖ నేపథ్య గాయని ఆశాభోంస్లే
- ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2018 లో విజయం సాధించడం ద్వారా ఈ టోర్నీలో అత్యధిక టైటిళ్లు (6) సాధించి ఎవరి సరసన రోజర్ ఫెదరర్‌కు చోటు దక్కింది ?
  - రాయ్ ఎమర్సన్, నొవాక్ జకోవిచ్
- దక్షిణాఫ్రికా-భారత్‌ల మధ్య జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను ఏ జట్టు 2-1తో కైవసం చేసుకుంది ?
  - ఆతిథ్య దక్షిణాఫ్రికా
- భారత్ - ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్) శిఖరాగ్ర సమావేశం 2018 జనవరి 25, 26 తేదీల్లో ఎక్కడ జరిగింది ?
  - భారత రాజధాని ఢిల్లీలో
- 2018-19 బడ్జెట్‌లో రూ.250 కోట్ల వరకు టర్నోవరు ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును ఎంతశాతానికి తగ్గించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది ?
  - 25 శాతానికి
- ప్రొ రెజ్లింగ్ లీగ్-3లో ఏ జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది ?
  - డిఫెండింగ్ ఛాంపియన్ పంజాబ్ రాయల్స్
- ప్రపంచంలోనే అతిపెద్ద గాలి శుద్ధీకరణ టవర్‌ను ఏ దేశం నిర్మించింది ?
  - చైనా
- భారత తదుపరి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా కేంద్రప్రభుత్వం ఎవరిని నియమించింది ?
  - ఓం ప్రకాశ్ రావత్
- గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ఎన్నో స్థానంలో నిలిచింది ?
  - 2వ స్థానంలో
- 2018-19 బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయపుపన్ను, కార్పొరేట్ పన్నుపై కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ఎంతశాతం 'ఆరోగ్య విద్యా సెస్' విధించింది ?
  - 4 శాతం
- కంబోడియా- భారత్‌ల మధ్య 2018 జనవరి 27న ఎన్ని ఒప్పందాలు కుదిరాయి ?
  - నాలుగు ఒప్పందాలు
- చైనా శాస్త్రవేత్తలు రెండు కోతులను క్లోన్ చేశారు. దాదాపు రెండు దశాబ్దాల కిందట డాలీ అనే గొర్రెకు పురుడు పోసిన విధానంలోనే వీటిని సృష్టించారు. అయితే వీటికి ఏమని పేరు పెట్టారు ?
  - ఝూంగ్ ఝూంగ్, హువా హువా
- విద్యారంగంలో అత్యుత్తమ సేవలందించినందుకు, సంస్థ నిర్వహణలో అత్యంత ప్రతిభ చూపినందుకుగాను శ్రీచైతన్య విద్యాసంస్థలకు ఏ అవార్డు దక్కింది ?
  - 'ఏషియన్ గ్రేటెస్ట్ బ్రాండ్స్- 2017' అవార్డు
- ప్రతిష్ఠాత్మక టాటా స్టీల్ ఛాలెంజర్స్ చెస్ టోర్నమెంట్‌లో ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు ?
  - భారత యువ గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి
- ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం-డబ్ల్యూఈఎఫ్) 48వ వార్షిక సదస్సు 2018 జనవరి 23-26 తేదీల మధ్య ఎక్కడ జరిగింది ?
  - స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో
- హైదరాబాద్‌లో 2018 జనవరి 27 నుంచి 31 వరకు 'జీవశాస్త్ర కణం' అంతర్జాతీయ సదస్సు-2018 జరిగింది. ఈ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇది ఎన్నోసారి ?
  - తొలిసారి
- తక్కువ ఖర్చుతో సాఫీగా జీవనం సాగించేందుకు అనువైన దేశాల జాబితాల భారత్‌కు ఎన్నవ స్థానం దక్కింది ?
  - రెండో స్థానం
- ప్రస్తుత గ్రీకు ప్రాంతంలో 9 వేల ఏళ్లనాడు జీవించిన ఒక కౌమారప్రాయ యువతి ముఖాన్ని శాస్త్రవేత్తలు పునఃనిర్మించారు. ఆమెకు ఏమని పేరు పెట్టారు ?
  - డాన్ (ప్రభాత గీతం- గ్రీకులో అవ్‌గి)
- ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2018లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు సొంతం చేసుకున్నారు ?
  - డెన్మార్క్‌కు చెందిన కరోలినా వోజ్నియాకి
- ఇండోనేషియా మాస్టర్స్ -2018 టోర్నమెంట్‌లో మహి ళల సింగిల్స్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?
  - ప్రపంచ నెంబర్ వన్ తైజు యింగ్ (తైవాన్)
- జాతీయ టీ-20 లీగ్‌ను ఏ జట్టు కైవసం చేసుకుంది ?
  - ఢిల్లీ
- ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2018లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు ?
  - స్విట్జర్లాండ్ సూపర్‌స్టార్ రోజర్ ఫెదరర్
- భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ రికార్డు స్థాయిలో ఎన్నోసారి జాతీయ ఛాంపియన్‌గా నిలిచారు ?
  - ఎనిమిదోసా

సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్‌లో 128 ఉద్యోగాలు

విశాలాంధ్ర ప్రజ్ఞ

కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్).. అహ్మదాబాద్, ముంబై, నాగ్‌పూర్, పుణె విభాగాల్లోని 128 గ్రూప్ 'సి' పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : ఎంటీఎస్ (మెడికల్ అటెండెంట్)-77; ఎంటీఎస్ (లేడీ మెడికల్ అటెండెంట్)-51.

వేతనశ్రేణి : రూ.18,000-రూ.56,900.

అర్హతలు: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఫస్ట్ ఎయిడ్‌లో సర్టిఫికెట్ ఉండాలి.

వయసు: 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: రాతపరీక్ష.

దరఖాస్తు రుసుం: రూ.200; ఎస్సీ/ఎస్టీ/ మాజీ సైనికోద్యోగ/దివ్యాంగ/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: మార్చి 3, 2018. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: cghsrecruitment.mahaonline.gov.in

ఐవోసీఎల్ ఈస్టర్న్ రీజియన్‌లో 175 ఖాళీలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) ఈస్టర్న్ రీజియన్.. వివిధ విభాగాల్లోని 175 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : ట్రేడ్ అప్రెంటీస్-113 (ఫిట్టర్/ఎలక్ట్రీషియన్/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్/మెషినిస్ట్-38о అకౌంటెంట్-75); టెక్నికల్ అప్రెంటీస్-62 (మెకానికల్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/సివిల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్).

ఈస్టర్న్ రీజియన్‌లోని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీ ఖాళీలు: అండమాన్, నికోబార్-2; అరుణాచల్‌ప్రదేశ్-4; బీహార్-20; జార్ఖండ్-10; మణిపూర్-11; మిజోరం-2; నాగాలాండ్-4; ఒడిశా-19; సిక్కిం-2; త్రిపుర-7; పశ్చిమబెంగాల్-80; అసోం-14.

అర్హతలు : టెక్నీషియన్ అప్రెంటీస్‌కు సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ డిప్లొమా; ట్రేడ్ అప్రెంటీస్‌కు పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్ విభాగాల్లో ఐటీఐ.

వయసు : 2018, జనవరి 31 నాటికి 18-24 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : రాతపరీక్ష, ఇంటర్వ్యూ.



రాతపరీక్ష విధానం : దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ట్రేడ్ అప్రెంటీస్‌లోని అకౌంటెంట్ విభాగానికి జనరిక్ ఆప్టిట్యూడ్ (క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌తో సహా), రీజనింగ్ ఎబిలిటీస్, బేసిక్ లాంగ్వేజ్ స్కిల్స్ నుంచిబీ మిగిలిన విభాగాలకు (ట్రేడ్/టెక్నీషియన్).. ఈ అంశాలతోపాటు సంబంధిత విభాగంలో టెక్నికల్ ఆక్యుమెన్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: ఫిబ్రవరి 28, 2018.

పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.iocl.com

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో 15 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)... కాంట్రాక్టు పద్ధతిలో 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : పీఎంఏ హెడ్-1; డిప్యూటీ పీఎంఏ హెడ్-3; థిమాటిక్ ఎక్స్‌పర్ట్-11. థిమాటిక్ ఎక్స్‌పర్ట్‌లో స్ట్రాటజీ డెవలప్‌మెంట్, సోషల్ బ్రాండ్ మేనేజ్‌మెంట్, ఐఈసీ అండ్ ఐసీటీ, కెపాసిటీ బిల్డింగ్, రీసెర్చ్ అండ్ పాలసీ, ఫైనాన్స్, స్టాండర్డ్స్ అండ్ క్వాలిటీ అస్యూరెన్స్, ప్రొక్యూర్‌మెంట్, డేటా అనాలిసిస్, అసెస్‌మెంట్ అండ్ సర్టిఫికేషన్, ఎంఐఎస్ విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలున్నాయి.

వేతనం : పీఎంఏ హెడ్-రూ.2,50,000; డిప్యూటీ పీఎంఏ హెడ్-రూ.1,50,000; థిమాటిక్ ఎక్స్‌పర్ట్-రూ.1,00,000.



అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీజీతో పాటు నిబంధనల మేరకు ఉద్యోగానుభవం, సంబంధిత రంగంలోని ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 6, 2018.

పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.nird.org.in

విశాలాంధ్ర బిజినెస్

303.60 ▲	91.55 ▲	300 ▲	బంగారం (విశాఖపట్నం) 29,230	200 ▲	వెండి (విశాఖపట్నం) 39,750	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	ప్రొద్దుటూరు	వెండి (విజయవాడ)	ప్రొద్దుటూరు	
34,445.75	10,582.60	29,300	29,230	39,900	41,582	64.79
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
మారుతి సుజుకి	9,001.80	3.41
టాటా మోటార్స్	372.05	3.22
యాక్సిస్ బ్యాంక్	552.30	2.94
లార్సెన్	1,347.50	2.83
టాటా మోటార్స్ (డి)	210.00	2.67

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
సన్‌ఫార్మా	556.15	-2.46
టీసీఎస్	3,035.25	-1.35
ఇన్ఫోసిస్	1,141.05	-1.26
ఐటీసీ	269.40	-0.93
విప్రో	295.45	-0.76

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.73	64.79
యూరో	79.71	79.89
పౌండ్	90.64	90.89
ఆస్ట్రేలియా డాలర్	51.67	50.85
సింగపూర్ డాలర్	49.00	49.23

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,230	31,262
చెన్నై	29,270	31,304
బెంగళూరు	28,650	30,641
ముంబై	28,910	32,342
విజయవాడ	29,300	31,600
విశాఖపట్నం	29,230	31,887
ప్రొద్దుటూరు	29,230	30,690
ముడి చమురు		67.31

ఇంటి దొంగల నుంచి రక్షణ కోసమే...



న్యూఢిల్లీ : దేశంలో వరుస కుంభకోణాలతో కుదేలవుతున్న బ్యాంకులు ఇప్పుడు తమ ఇంటి దొంగల మోసాల నుంచి తమను తాము కాపాడుకునేందుకు బీమా పరంగా రక్షణ పెంచుకోవాలని యోచిస్తున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన రెండు భారీ కుంభకోణాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్లు, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)కు రూ.390 కోట్ల నష్టం వాటిల్లడంతో తమను ఈ దిశగా ఆలోచింపజేస్తున్నదని, ఇప్పటివరకూ తీసుకుంటున్న ప్రాథమిక నష్టపరిహార పాలసీలతో సరిపుచ్చకుండా బీమా రక్షణను మరింత పెంచుకోవాలని యోచిస్తున్నామని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. సొంత ఉద్యోగుల ప్రమేయంతో జరిగే మోసాల నుంచి కాపాడుకునేందుకు బ్యాంకులు అంతర్గత రిస్క్ మెకానిజమ్, నిఘా వ్యవస్థలను బలోపేతం చేసుకోవడంతో పాటు బీమా పరమైన రక్షణను మరింత పెంపొందించుకోవడంపై దృష్టి సారించాయని, బ్యాలెన్స్ షీట్‌కు రక్షణ కల్పించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆ అధికారి తెలిపారు.

పీఎన్‌బి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను మరోసారి ప్రశ్నించిన సీబీఐ

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన రూ.11,400 కోట్ల భారీ కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఈ కేసులో ఆ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీ బ్రహ్మాజీరావును రెండో రోజు కూడా ప్రశ్నించింది. 35 ఏండ్ల క్రితం విజయా బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన బ్రహ్మాజీరావు పనిచేసిన జోన్లలో పిఎన్‌బీ కుంభకోణం జరిగిన ముంబై జోన్ కూడా ఉన్నదని, దీంతో ఆయనతో పాటు పీఎన్‌బీకి చెందిన పలువురు ఇతర అధికారులను కూడా ప్రశ్నిస్తున్నామని సీబీఐ అధికారులు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతానికి వీరిని నిందితులుగా పరిగణించడం లేదని, ఈ కుంభకోణాన్ని పీఎన్‌బీ ఏవిధంగా గుర్తించిందన్న అంశంతో పాటు ఆ బ్యాంకులో పాటించే నియమ నిబంధనలేమిటి?, వాటిలో ఉల్లంఘనలు ఏమైనా జరిగాయా? అనే అంశాలపై దృష్టి సారించామని సీబీఐ అధికారులు తెలిపారు.



బ్రహ్మాజీరావు ప్రస్తుతం తమ బ్యాంకులో ఇంటిగ్రే టెడ్ రిస్క్ మేనేజ్ మెంట్, క్రెడిట్ ఆపరే షన్స్ విభాగాలకు ఇన్‌చార్జిగా వ్యవహరి స్తున్నాడని, స్టాక్ ఆడిట్, పోర్టుఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసు (పీఎంఎస్) సహా రూ.50 కోట్ల కంటే ఎక్కువ రుణాలకు సంబంధించిన ఖాతా లను ఆయన పర్య వేక్షిస్తున్నాడని పీఎన్‌బీ తమ వెబ్‌సైట్‌లో స్పష్టం చేసింది.

నీరవ్, చోక్సీ విదేశీ ఆస్తులపై ఈడీ గురి

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన దర్యాప్తును ముమ్మరం చేస్తున్నది. ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారులైన వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, అతని మామ, గీతాంజలి జెమ్స్ సంస్థ అధినేత మెహుల్ చోక్సీకి విదేశాల్లో గల ఆస్తులు, వ్యాపారాలకు సంబంధించిన సమాచారాన్ని రాబట్టేందుకు ఈడీ త్వరలో డజనుకు పైగా దేశాలకు న్యాయపరమైన విజ్ఞప్తులను పంపనున్నది. నీరవ్, చోక్సీలకు చెందిన వ్యాపార సంస్థలు ఉన్నట్లుగా గుర్తించిన బెల్జియం, హాంకాంగ్, స్విట్జర్లాండ్, అమెరికా, బ్రిటన్, దుబాయ్, సింగపూర్, దక్షిణాఫ్రికా తదితర 17 దేశాలకు పంపాల్సిన రెగొరేటరీ లెటర్లను పొందేందుకు ముంబైలోని సంబంధిత కోర్టును ఈడీ సంప్రదించబోతు న్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

విజ్ఞానం

పండ్లు కూరగాయలతో డిప్రెషన్ దూరం



క్రమం తప్పకుండా ఆహారంలో విరివిగా పండ్లు, కూరగాయలు, మొలకల వినియోగంతో హైపర్‌టెన్షను తగ్గించుకోవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. పలురకాల జబ్బులు, మానసిక వ్యాధులకు ఆహారంలో తాజా పండ్లు, వ్యాయామం, తృణధాన్యాలతో కూడిన ఆహారంతో డిప్రెషన్ వంటి వ్యాధులను నివారించవచ్చు. ప్రతివ్యక్తి వారి ఆహారపు అలవాట్లనుబట్టే వారి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందనేది సత్యం. పోషకపదార్థాలు, విటమిన్లు ఎక్కువగా ఉన్న ఆహారం అంటే ప్రకృతిలోనే లభ్యమయ్యే పదార్థాల వినియోగంతో మనం ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు. ఫ్యాట్ అధికంగా లేని ఆహారం, చేపలు, బీన్స్, సీడ్స్, నట్స్, పౌల్ట్రీ వంటి ఆహారంతో వృద్ధుల్లో సహజంగా తలెత్తే డిప్రెషన్, మానసిక వత్తిడితోపాటు జ్ఞాపకశక్తి సమస్యలు, వాస్కులార్ సమస్యలైన బీపీ, కొలస్ట్రాల్ సమస్యలు, గుండె వ్యాధులను అధిగమించవచ్చునని చికాగోలోని రష్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ వెల్లడించింది. 81ఏళ్ల వయసున్న సుమారు 964 మందిపై చేపట్టిన ప్రయోగంలో వారి ఆహార విధానాలు, తలెత్తిన జబ్బులపై చేపట్టిన పరిశోధనలో భాగంగా వీరిని రెండు గ్రూపులుగా విభజించారు. తాజా పండ్లు వినియోగించిన వారి ఆరోగ్యం సమర్థవంగంగా ఉందని తేలింది. రెడ్ మీట్ , సాచ్యురేటెడ్ ఫ్యాట్ వినియోగించినవారు అనేకరకాల సమస్యలకు గురైనట్లు తెలుస్తోంది.

పని ఒత్తిడితో రోగాలు



కార్పొరేట్ ఉద్యోగస్థులు రోజులకు 6గంటలకన్నా తక్కువ నిద్రపోవడంతో పలు సమస్యలు తలెత్తుతు న్నట్లు వైద్యులు ఆందో ళన చెందుతున్నారు. సుమారు 56శాతం ఉద్యోస్థులు హైపర్ టెన్షన్, సుగర్ వంటి వ్యాధుల బారినపడటానికి ప్రధానకారణం సరైన నిద్ర కరువే... నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలనే తపనన, తద్వారా మానసిక వత్తిడికి గురవడం, సరైన ఆహారం వినియోగానికి టైమ్ లేకపోవడంతో యువత పలు సమస్యలను ఎదుర్కోవలసివస్తోందని అసోచామ్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. వీరికి కలిగే వత్తిడివలన సుమారు 46శాతం మంది భారతీయులు పలు సమస్యలకు గురవుతున్నారు. వ్యక్తిగత కారణాలు, ఆఫీసు రాజకీయాలు, టార్గెట్ ప్రకారం పనిచేయడం వంటి వత్తిడులతో మెటబాలిక్ సిండ్రోమ్ దెబ్బతింటోంది. డయాబెటిస్, బీపీ, యూరిక్ యాసిడ్ ఎక్కువగారావడం, ఒబెసిటీ, కొలస్ట్రాల్ శాతంపెరగడం వంటి వాటికి గురవుతున్నారు. 24శాతం మంది ఉద్యోగులు వారానికి 1 నుండి 3గంటలు వ్యాయామం చేస్తున్నట్లు తెలిపారు. 9శాతం మంది వారానికి మూడు నుండి 6గంటలు చేస్తుండగా. కేవలం 5శాతం మంది మాత్రమే వారానికి 6గంటలు శారీరకవ్యాయామం చేస్తున్నట్లు తెలుస్తోంది.

వేలానికి స్టీవ్‌జాబ్స్ ఉద్యోగ దరఖాస్తు

సుమారు రూ.32లక్షలు వస్తాయని అంచనా



వాషింగ్టన్ : యాపిల్ సహ వ్యవస్థాపకులు స్టీవ్ జాబ్స్ చిన్నప్పుడు ఓ ఉద్యోగం కోసం పెట్టుకున్న దరఖాస్తు(సీవీ) ఇప్పుడు వేలానికి వచ్చింది. తప్పుల తడకగా ఉన్న ఈ సీవీ.. వేలంలో దాదాపు 50వేల అమెరి కన్ డాలర్లు(సుమారు రూ.32లక్షలు) తెచ్చిపెడుతుందని నిర్వాహకులు అంచనా వేస్తు న్నారు. 1973లో జాబ్స్ ఈ సీవీని రూపొందించారు. టెక్నాలజీ రంగంలో పనిచే యడం తన అభిలాష అని అందులో పేర్కొన్నారు. ఒక పేజీ ఉన్న ఈ సీవీలో కొన్ని అక్షర దోషాలు కూడా ఉన్నాయి. ఇందులో 'స్టీవెన్ జాబ్స్'గా ఆయన పేరు ఉంది. ఇక అడ్రస్.. రీడ్ కాలేజ్‌గా పేర్కొన్నారు. ఆయన 18ఏళ్ల వయ సులో ఉన్నప్పుడు ఈ సీవీని పంపించారట. అయితే ఏ స్థాయి ఉద్యోగం కోసం తాను దరఖాస్తు చేసేది ఇందులో పేర్కొనలేదు. బోస్టన్‌కు చెందిన ఆర్‌ఆర్ యాక్షన్ హౌస్ దీన్ని వేలానికి వేయనుంది. వచ్చే నెలలో దీని వేలం ప్రక్రియ జరగనుంది. మార్చి 8 నుంచి ఈ సీవీ వేలానికి బిడ్డింగ్‌లను ఆహ్వానించ నున్నారు. ఈ దరఖాస్తు పంపిన మూడేళ్ల తర్వాత(1976) జాబ్స్.. స్టీవ్ ఓజనైక్‌తో కలిసి యాపిల్ సంస్థను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కంపెనీ ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా అగ్రస్థానంలో ఉంది. జాబ్స్ క్యాన్సర్ కారణంగా తన 56వ ఏట(2011) కన్నుమూశారు.



6పైసలు లాభపడిన రూపాయి

ముంబై : రూపాయి విలువ 6పైసలు పెరిగి 64.67 వద్ద సమోదైంది.డాలర్ మారకంతో రూపాయి విలువ సోమవారం స్వల్పంగా పెరిగిందనే చెప్పవచ్చు. ఎగుమతులు, బ్యాంకుల నుండి డాలర్ విలువ పెరగడంతో రూపాయి బలపడిందని తెలుస్తోంది. శుక్రవారం రూపాయి 31పైసలు లాభపడి 64.73 వద్ద నిలదొక్కుకుంది.

కార్పొరేట్ రుణాలపై వేటు వద్దట

- పీఎన్‌బి కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వానికి సీఐఐ హెచ్చరిక

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణాన్ని దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే రుణాలపై వేటు వేయరాదని, ప్రత్యేకించి బ్యాంకుల రుణ వితరణ సామర్థ్యాన్ని పెంచుకుని అధిక వృద్ధిరేటు సాధించేందుకు దేశ ఆర్థిక వ్యవస్థ సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం ఇటువంటి చర్యలు చేపట్టడం ఎంతమాత్రం మంచిది కాదని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) హెచ్చరించింది. దేశంలో ఆర్థిక మోసాలను నియంత్రిం చేందుకు మరింత మెరుగైన నియంత్ర వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బి)లో ప్రభుత్వం తన వాటాను క్రమంగా 33 శాతా నికి తగ్గించుకోవాలని, ఆర్థిక మోసాలను అరికట్టేందుకు బ్యాంకులపై పర్యవేక్షణను పెంచడం, కార్పొరేట్ పరిపా లనకు సంబంధించిన ఉత్తమ ప్రమాణాలను విస్తరించడం సహా ద్విముఖ వ్యూహాన్ని అనుసరించాలని సీఐఐ సూచించింది. ఆర్థిక రంగంలో వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పాటు నియంత్రణా సంస్థలు, పారిశ్రామిక రంగం మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని, ఉత్తమ యాజ మాన్య పద్ధతులు పాటించడం, బ్లాక్‌చైన్, బిగ్ డాటా అనలిటిక్స్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప యోగించుకుని నిర్వహణా సామర్థ్యాన్ని పెంచు కోవడం, పీఎస్‌బీల్లో ప్రభుత్వ వాటాను తగ్గించుకోవడం బ్యాంకింగ్ రంగానికి మూడు కీలక పరిష్కారాలని సీఐఐ ప్రెసిడెంట్ శోభనా కామినేని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.



సీఐఐ అధ్యక్షురాలు శోభనా కామినేని

నష్టం ఉండదంటున్న వజ్రాల వ్యాపారులు

ఇదిలావుంటే, పీఎన్‌బీ కుంభకోణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు రుణ వితరణకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేసినప్పటికీ తమ వ్యాపారానికి పెద్దగా నష్టమేమీ వాటిల్లబోదని సూరత్‌లోని వజ్రాల పరిశ్రమ ప్రతినిధులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద బ్యాంకుల్లో రెండవదిగా ఉన్న పీఎన్‌బీలో కొద్ది రోజుల క్రితం రూ.11,400 కోట్ల భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పటికీ బ్యాంకు రుణాల కోసం వజ్రాల కటింగ్, పాలిషింగ్ విభాగాలకు చెందిన చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నామని వారు తెలిపారు.

సూరత్‌లోని దాదాపు 6 వేల డైమండ్ ప్రాసెసింగ్ యూనిట్లలో సుమారు 100 పెద్ద సంస్థలు మాత్రమే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నాయని, మిగిలిన చిన్న, మధ్యతరహా సంస్థలన్నీ ప్రైవేటు పెట్టుబడిదారుల పైనే ఎక్కువగా ఆధారపడి పనిచేస్తున్నాయని జీజేఈపీసీ (జెమ్స్ అండ్ జువెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్) రీజినల్ చైర్మన్ దినేష్ నవాడియా స్పష్టం చేశారు.

పాఠశాలకు సీబీఎస్ఈ బోర్డు హెచ్చరిక

న్యూఢిల్లీ : ఫీజులు కట్టలేదని విద్యార్థులను పరీక్షలకు పంపకుండా అడ్మిట్ కార్డులను తమవద్ద ఉంచుకోవడంపై సీబీఎస్ఈ హెచ్చరించింది. ఫీజులు కట్టలేదని, మార్కులు సరిగా రావడం లేదని పరీక్షలకు అనుమతించకపోవడంపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బోర్డు ప్రకటించింది. విద్యార్థుల తల్లిదండ్రులు వీటికోసం అదనంగా రుసుము వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టామని సీబీఎస్ఈ కంట్రోలర్ ఎగ్జామినేషన్స్ కేకే చౌదురి తెలిపారు. మార్చి5 నుంచి 10,12వ తరగతులకు బోర్డు పరీక్షలను నిర్వహించనుంది.

మార్కెట్ల జోరు షురూ....

335.44 వద్ద నమోదైన సెన్సెక్స్

అత్యధిక లాభాల్లో టాటా స్టీలు, సన్ ఫార్మా,యస్ బ్యాంకు

ముంబై: దేశీయ మార్కెట్లు ఈ వారం ప్రారంభంలో లాభాల్లో ముగిసాయి. ప్రారంభంలో సెన్సెక్స్ 108 పాయింట్ల లాభంతో, నిఫ్టీ 30 పాయింట్ల లాభంతో ప్రారంభమైంది. మరో పక్క రూపాయి కూడా డాలర్‌తో పోలిస్తే బలపడింది. ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి జీడీపీ డేటా వెలువడనుం డటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా లోహరంగ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. స్టీల్‌అథార్టీ ఆఫ్ ఇండియా షేర్లు 3శాతం , హిందూస్థాన్‌జింక్ 2.2శాతం, జిందాల్ స్టీల్ 1.6శాతం, టాటా స్టీల్ 1.6శాతం, ఎన్ఎండీసీ 1.4శాతం, వేదాంత 1.4శాతం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.4శాతం, హిండాల్కో 1.2శాతం లాభాల్లలో ట్రేడవుతున్నాయి. సీబీఐ దర్యాప్తును ఎదుర్కొనుండటంతో ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ షేర్లు 9శాతం నష్టపోయాయి. ఇక డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పై ఓఏఐ స్టేటస్‌ను యూఎస్ఎఫ్‌డీఏ కొనసాగించడంతో షేర్లు 5శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 335.44 పాయింట్లతో 0.98 శాతంతో అత్యధికంగా 34,47.59 వద్ద నమోదైంది. ఫిబ్రవరి 16తరువాత ఇదే అత్యధికం అని చెప్పవచ్చు. నిఫ్టీ 98.75 పాయింట్లతో 0.94శాతంతో 10,589.80 వద్ద ముగిసింది. బిఎస్ఇ 1646 షేర్లు అత్యధికంగా నమోదుకాగా 1,024 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 161 షేర్లలో మార్పులేదు. బిఎస్ఇ మిడ్‌కాప్ ఇండెక్స్ 0.72శాతంతో ముగిసింది. స్మాల్‌కాప్ ఇండెక్స్ 0.89శాతం పెరిగింది. రియాల్టీ షేర్ల జోరు పెరిగింది. పవర్ జనరేషన్ స్టాక్స్ డిమాండ్‌లో ఉన్నాయి. రిలయన్స్ పవర్, ఇన్‌ఫ్రా, సిఇఎస్‌సి,టొరంట్ పవర్, అదానీ పవర్, జీఎమ్‌ఆర్,టాటా పవర్, ఎన్‌హెచ్‌పిసి, జైప్రకాష్ పవర్ వెంచర్స్, ఎన్‌టిపిసి లాభాల్లో నమోద య్యాయి. జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ 0.43శాతం నష్టాల్లో నమో దైంది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ఇండియా 1.89శాతం కోల్ ఇండియా 1.01శాతం పెరిగింది. మిడ్‌కాప్,స్మాల్ కాప్ 239, 272 పాయింట్లు పెరిగాయి.

పెరిగిన టీవీల ధరలు..

ఢిల్లీ: కస్టమ్స్ సుంకం పెరిగిన నేపథ్యంలో, ఎల్ఈడీ/ఓఎల్ఈడీ టీవీల ధరలను 7 శాతం వరకు పెంచేందుకు సోనీ, ఎల్‌జీ, పానసోనిక్, శామ్‌సంగ్ వంటి సంస్థలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇందువల్ల అమ్మకాలపై స్వల్పకాలం ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నాయి. పానసోనిక్ సంస్థ 2-7 శాతం, శామ్‌సంగ్ 5-6 శాతం వరకు ధరలు పెంచనున్నాయని సమాచారం. ధరలు పెంచ డం మినహా ప్రత్యామ్నాయం లేదని, అయితే పరిశో ధన-అభివృద్ధి ద్వారా కొంతమేర వ్యయ నియంత్రణకు ప్రయ త్నిస్తామని ఎల్‌జీ పేర్కొంది. ఇప్పటివరకు ధరలు పెంచ లేదని, కస్టమ్స్ సుంకంలో మార్పు ప్రభావం ఎంతమేర ఉం టుందనే విషయమై అంచనాలు రూపొందిస్తున్నామని, భవిష్య త్తులో పెంచక తప్పదని సోనీ ఇండియా వివరించింది. ప్యానె ళ్లపై కస్టమ్స్ సుంకాన్ని 7.5 శాతం నుంచి 15 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో ప్రతిపాదించిన సంగతి విదితమే. టీవీ విడిభాగాలపై సుంకాన్ని 10 శాతం నుంచి 15 శాతానికి పెంచారు. దేశీయ తయారీ పెంచేందుకే ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది.

మార్కెట్‌లోకి శాంసంగ్ ఎస్9, ఎస్9+

ముంబై: మొబైల్ రంగ దిగ్గజం శాంసంగ్ తన ఫ్లాగ్‌షిప్ ఫోన్ గెలాక్సీ ఎస్9, ఎస్9+ను విడుదల చేసింది. మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2018 కార్యక్రమానికి ముందు దీనిని విడుదల చేయడం విశేషం. గెలాక్సీ ఎస్8ను మరింత మెరుగుపర్చి ఎస్9 సిరీస్‌కు తుదిరూపునిచ్చినట్లు అర్థమవుతోంది. మెరుగైన కెమేరా, స్మార్ థింగ్స్ యాప్, మెరుగుపర్చిన బిక్స్‌బై, నాక్స్ 3.1, డిఫెన్స్ గ్రేడ్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక ఫీచర్లు దీనిలో ఉన్నాయి. భారత్‌లోని కస్టమర్లు కంపెనీ వెబ్‌సైట్‌లో రూ. 2,000 చెల్లించి ప్రీబుకింగ్ చేసుకోవచ్చు. ఈ ఫోన్లు మొత్తం నాలుగు రంగుల్లో అందుబాటులోకి వచ్చాయి. మిడ్‌నైట్ బ్లాక్, కోరల్ బ్లూ, టైటానియం గ్రే, లిలాక్ పర్పుల్ రంగుల్లో విడుదల చేశారు.

ఫీచర్లు:

- ఈ ఫోన్లలో ఏఐ, ఏఆర్ టెక్నాలజీ వినియోగించారు. వాస్తవ పరిస్థితుల్లో ఈఫోన్ ఎదుట ఉన్న వస్తువులను గుర్తించగలదు. దీనికి చేయాల్సిందల్లా కెమేరా ద్వారా ఆ వస్తువును స్కాన్ చేయడమే. దీంతోపాటు భాషను కూడా తర్జుమా చేయగలదు.
- ఇక యాపిల్ ఎనిమోజీకి పోటీగా శాంసంగ్ ఏఆర్ ఎమోజీ ఫీచర్‌ను ఇచ్చింది. దీనిలో 2డీ ఇమే జ్‌ను వాడి 3డీ చిత్రాలను చేయ వచ్చు.
- స్క్రీన్ విషయానికి వస్తే ఎస్9లో 5.8 అంగుళాలు, ఎస్9+ లో 6.2 అంగుళాలు ఉంది. ఇన్ఫినిటీ డిస్ప్లే సౌకర్యం ఉంది.
- రెండు వేరియంట్లు 8.5 ఎంఎం మందం ఉన్నాయి.
- ఫింగర్ ప్రింట్ స్కానర్‌తో పాటు ఇంటిలిజెంట్ స్కానర్ కూడా ఉంది. ఇది ఫోన్ యజమానిని ఐరిస్, ఫేషియల్ స్కాన్ ద్వారా గుర్తి స్తుంది. అవసరాన్ని బట్టి ఈ స్కానర్లతో ఫోన్‌ను అన్‌లాక్ చేసు కోవచ్చు.
- ఆక్టాకోర్ , 10ఎన్ఎం ప్రాసెసర్ వాడారు.

ట్రేడింగ్‌పై బ్యాంక్ మోసాల ఎఫెక్ట్

- ఆర్థిక గణాంకాలపై ఆధారం
- రూపాయి విలువ కూడా కీలకమేనంటున్న నిపుణులు



న్యూఢిల్లీ: స్థూల ఆర్థిక గణాంకాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్, గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు కూడా భారతీయ మార్కెట్లను శాసించగల వని చెబుతున్నారు. ఇక పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంతోపాటు, ఇతరత్రా బ్యాంకుల్లో మోసాల ప్రభావం ఉండనే ఉంటుందన్న అభిప్రాయాల్ని మార్కెట్ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వెలుగుచూస్తున్న వరుస స్కాంలతో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న విషయం తెలిసిందే. గత వారం సెన్సెక్స్ 131.39 పాయింట్లు, నిఫ్టీ 38.75 పాయింట్లు లాభపడ్డాయి. బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవగా, సీబీఐ విచారణ, అరెస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తులు వంటివి మదుపరులను కొనుగోళ్ల వైపునకు వెళ్లకుండా అడ్డుపడ్డాయి. ఈ వారం కూడా ఇదే పరిస్థితులకు ఎక్కువ అవకాశాలున్నాయని పలువురు నిపుణులు అంటున్నారు. కాగా, బుధవారం ఉత్పాదక రంగం కోసం పీఎంఐ గణాంకాలు విడుదలవుతుండగా, ఈ జనవరి-మార్చి త్రైమాసికానికి గాను జీడీపీ అంచనాలూ వెల్లడి కానున్నాయి. దీంతో మదుపరులు వీటి ఆధారంగా తమ పెట్టుబడులపై ఓ నిర్ణయానికి రావచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు. ఇక శుక్రవారం హోలీ సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో ఈ వారం నాలుగు రోజులే ట్రేడింగ్ జరుగనున్నది.

సెబీ, ఎక్స్ఛేంజ్‌ల విచారణ

కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల ఈక్విటీ, డెరివేటివ్‌ల ట్రేడింగ్‌లో అవకతవకలు జరిగాయా? అన్న కోణంలో అటు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, ఇటు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ విచారణ జరుపుతున్నాయి. సెబీ లోగోతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను ఉద్దేశిస్తూ ఈ నెల 21న వాట్సాప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఓ నకిలీ లేఖ చక్కర్లు కొట్టిన నేపథ్యంలోనే ఈ విచారణకు తెరలేచింది. పీఎన్‌బీ కుంభకోణం మధ్య ఈ లేఖ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ సృష్టించగా, మదుపరులను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశ్యంతోనే ఈ లేఖ విడుదలైందని తర్వాత గుర్తించారు. అయినా ఎవైనా అక్రమాలు చోటుచేసుకున్నాయా? అని విచారణ జరుగుతున్నది.

రూ.58,650 కోట్లు ఎగిసిన ఎనిమిది సంస్థల మార్కెట్ విలువ

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లోని టాప్-10 కంపెనీల్లో ఎనిమిదింటి విలువ గత వారం రూ.58,650.26 కోట్లు ఎగిసింది. దేశీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ అత్యధికంగా రూ.26,742.6 కోట్లు ఎగిసి రూ.5,89,007.15 కోట్ల వద్దకు చేరింది. ఆ తర్వాత ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువ రూ.7,790.98 కోట్లు పుంజుకుని రూ.5,91,607.74 కోట్లను తాకింది. టాప్-10 సంస్థల్లో హిందుస్థాన్ యునీ లివర్, మారుతి సుజుకీల మార్కెట్ విలువ మాత్రమే దాదాపు రూ.10,500 కోట్లు పడిపోగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐల సంపద రూ.24,000 కోట్లకుపైగా పెరిగింది. ప్రస్తుతం టాప్-10 సంస్థల్లో మార్కెట్ విలువ ఆధారంగా ఆర్ఐఎల్ మొదటి స్థానంలో ఉండగా, తర్వాతి స్థానంలో టీసీఎస్ ఉన్నది.

మృత సముద్రం కనుమరుగుకానున్నదా!





డెడ్‌సీ పేరులోనే ఒక ప్రత్యేకత ఉంది. అంతేకాదు దీనికి కొన్ని ప్రత్యేకమైన విశేషాలున్నాయి. అసలు ఈ సముద్రం ఎక్కడ ఉందంటే, ఇజ్రాయిల్, పాలస్థీనా, జోర్డాన్‌ల మధ్య ఉంది. మృతసముద్రం ఎన్నో విశేషాలకు, విచిత్రాలకు, విశిష్టతలకు అలవాలము డెడ్‌సీ. రోజురోజుకూ కంచించుకుపోతున్నదని నిపుణులు చెబుతున్నారు. ఈ అంశం పర్యాటకులను, పర్యావరణవేత్తలను కలచివేస్తోంది. ప్రకృతి అద్భుతంగా ఎన్నో ప్రత్యేకతలను తనలో నింపుకున్న ఈ సముద్రం ఏడాదికి ఒక మీటరు చొప్పున లోపలికి వేగంగా అంతరించిపోతుందని చెబుతున్నారు. దీనికి కారణం మానవ తప్పిదాలే ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మృత సముద్రంలోకి జోర్డాన్ నది నుంచి నీళ్ళు వచ్చి చేరుతుంటాయి. అక్కడక్కడ మరికొన్ని చిన్నచిన్న సెలయేళ్ళ నుంచీ నీరు ఇందులో కలుస్తుంది. మొత్తానికి వీటన్నింటి ద్వారా దీన్లోకి నీరు వచ్చి చేరటమేగానీ, దీన్నుంచి ఎటూ బయటకు పారటమన్నది మాత్రం లేదు. కానీ ప్రస్తుతం ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజలు తాగునీటి కోసం జోర్డాన్ నది నుంచి భారీగా పైపులైన్లు వేసుకుని నీటిని తోడేస్తుండటంతో అసలీ సముద్రంలోకి నీళ్ళు వచ్చి చేరటమన్నదే తగ్గిపోతుంది. అసలే విపరీతమైన వేడి వాతావరణం, కొత్తగా నీరు చేరేది లేకపోవటంతో ఉన్న నీరు వేగంగా ఆవిరైపోతుంది. మరోవైపు ఈ నీళ్ళలో ఉండే ఖనిజాలు, లవణాలు వీటికి ఉన్న ప్రత్యేకతల రీత్యా దీన్ని పెద్దఎత్తున సౌందర్య ఉత్పత్తుల తయారీలోను వాడేస్తున్నారు. వీటన్నింటి మూలంగా మృతసముద్రం గత రెండుమూడు దశాబ్దాల్లోనే 80అడుగుల మేర ఎండిపోయింది.

సముద్రం ఎండిపోయిన తీరంలో గాఢమైన ఉప్పు మిగులుతోంది. క్రమేపి ఆ ఉప్పు కరిగిపోయి నేల ఉన్నట్టుండి పెద్దపెట్టున కుంగిపోయి పెద్దపెద్ద ముంపు గుంటలు మిగులుతాయి. వీటినే "సింక్ హోల్స్" అంటారు. ఇలాంటివి దాదా పు 6,500 ముంపుగుంటలు ఇప్పుడీ ప్రాంతాన్ని ప్రమాదకరంగా కూడా మార్చేశాయని, ప్రస్తుతం మృతసముద్రం వేగంగా కుంచించుకుపోవటంతో ఈ "సింక్ హోల్స్" పాత్ర ఎక్కువేనని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీని లోకి నీటి ప్రవాహం తగ్గిపోకుండా చూడాలన్న ప్రయత్నాలు ఊపందుకున్నాయి. దీనిలో నీటి స్థాయిలు తగ్గకుండా చూసేందుకు రెడ్‌సీ నుంచి కాలువల ద్వారా నీటిని దీనిలోకి మళ్ళించేందుకు ఇజ్రాయెల్-జోర్డాన్ ప్రభుత్వాలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. కానీ వాటి అమలు అంత సంతృప్తికరంగా లేదని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఈ సముద్రం పూర్తిగా మృతిచెందటం తథ్యమని ఆందోళన చెందుతున్నారు పర్యావరణవేత్తలు.

మృతసముద్రంలో నీళ్ళు ఎంత చిక్కగా ఉంటాయంటే మనుషులు, ఇతర జీవులు దానిలో దిగినా మునిగిపోరు. కావాలన్నా ఈత కొట్టలేరు. ఆ చిక్కదనానికి సహజంగానే పైన తేలుతుంటారు. ఈ అనుభూతి కోసం చాలామంది పర్యాటకులు మృతసముద్రాన్ని దర్శిస్తుంటారు. సాధారణంగా సముద్రపు నీరు ఉప్పగా ఉంటుంది. కానీ ఈ సముద్రంలోనీళ్ళు భయంకరమైన ఉప్పు మయం. మామూలు సముద్రపునీటి కన్నా దీనికి 10రెట్లు ఉప్పదనం ఉంటుంది. ఈ గాఢమైన ఉప్పు వల్ల మృతసముద్రంలో జీవాలేవీ కనబడవు. చిన్నచిన్న జీవులు కూడా కనిపించవు. అంతేకాదు సర్వసహజంగా పెరిగే నాచులాంటిది (ఆల్గే) కూడా కనిపించదు. అందుకే దీనికి మృతసముద్రం అని పేరు స్థిరపడింది.

గాఢమైన ఉప్పదనంతోపాటు ఈ సముద్రపు నీటిలో కొన్ని ఖనిజాలు ఉన్నాయి. మెగ్నీషియం, బ్రోమైడ్, పొటాషియం వంటి ఖనిజాలున్నాయి. అందుకని ఈ నీటికి వైద్యపరమైన ఔషధంగా ఉపయోగిస్తారు. చర్మవ్యాధులున్న వారికి ఈ సముద్ర స్నానం మంచిదని వైద్యనిపుణులు చెబుతున్నారు. దీంతో వైద్యపరంగా ఇక్కడకు పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. అందాల భామగా ఖ్యాతిగాంచిన రాణి క్లియోపాత్ర ఎంతో ప్రసిద్ధి. ఆమె తన సౌందర్య పోషణ కోసం ఈ నీటిని వాడేదని చెబుతుంటారు. ఆమె అందానికి అసలు రహస్యం ఇదే!

అయితే ఈ సముద్రంలో కొత్తగా వచ్చి చేరే నీరు తగ్గిపోతుండటం వలన కొన్నికొన్ని ప్రాంతాల్లో ఎండిపోయినట్లు కనబడుతుంది. వాటిని సింక్‌హోల్స్‌గా చెబుతారు. సముద్రం ఎండిన ప్రాంతంలో సింక్‌హోల్స్ ఎక్కువగా ఏర్పడటంతో ఈ సముద్రం వేగంగా అంతరించిపోతోంది.

పేరుకి సముద్రమే గానీ వాస్తవానికి 'డెడ్‌సీ' 50కి.మీ పొడవు, 15కి.మీ వెడల్పుతో విస్తరించింది. ఇది ఒక పెద్ద సరస్సులాంటిది. భూమండలం మీద అత్యంత లోతైన ప్రాంతం. దీని తీరం సముద్రమట్టానికి దాదాపు 1300 అడుగుల దిగువగా ఉంటుంది. ఎంతలోతుగా ఉన్నా, ఎన్ని నీళ్ళు ఉన్నా నీటిలో జీవం అంటూ లేని ప్రాంతం ఇదేనేమో!

మేలు చేసే బాక్టీరియాలు



బాక్టీరియాలు అనగానే హాని చేసేవి అని అనుకుంటాం. కాని మనకు మేలు చేసే బాక్టీరియాలు కూడా వున్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. మేలు చేసే బాక్టీరియాలు ఏమిటో తెలుసుకుందాం.

ముందుగా మనలో వున్న బాక్టీరియాలనే తీసుకుందాం. మనం తిన్న ఆహారం బాగా జీర్ణం కావటానికి "ఎక్షరీషియా కోలై" అనే బాక్టీరియా సహాయపడుతుంది. మరికొన్ని సూక్ష్మజీవులు కూడా పేగుల్లో వుండి విసర్జక పదార్థం ఏర్పడటానికి తోడ్పడతాయి. మనం రోజూ ఆహారంలో పెరుగు తింటాం. పాలను కాచి, చల్లార్చి, దానిలో కాస్త మజ్జిగ కలుపుతాం. ఆ మజ్జిగలో "లాక్టోబాసిల్లస్" అనే బాక్టీరియా వుంటుంది. ఇది లాక్టిక్ ఆమ్లాన్ని తయారు చేసి ఆ పాలను పెరుగుగా మారుస్తుంది. జున్ను కూడా ఇదే మాదిరిగా బాక్టీరియా సహాయంతో తయారవుతుంది. చిక్కుడు మొక్కలను చూసే వుంటారు. ఆ మొక్కల వేర్లకు చిన్నచిన్న బొడిపెలు వుంటాయి. ఆ బొడిపెల్లో రైజోబియం అనే బాక్టీరియా వుంటుంది. ఇవి గాలిలో వున్న నత్రజనిని తీసుకొని సంయోగ పదార్థమైన "అమోనియా"గా మారుస్తాయి. నేలలో ఉండే మరికొన్ని బాక్టీరియాలు అమోనియాను నైట్రేట్స్‌గా మారుస్తాయి. వీటిని



మొక్కలు గ్రహిస్తాయి. ప్రోటీనులను తయారు చేసుకుంటాయి.

హాని చేసే బాక్టీరియాలు వున్నాయి కదా! వాటిని నాశనం చేసే కొన్ని పదార్థాలు వున్నాయి. వాటినే "యాంటి బయాటిక్స్" అంటారు. అవి పెన్సిలిన్, స్ట్రెప్టోమైసిన్, టెట్రాసైక్లిన్, క్లోరోమైసిటిన్ మొదలైనవి. వీటి తయారీలో రకరకాల బాక్టీరియాలే ప్రధాన పాత్ర వహిస్తాయి.

మురికి గుంటల్లో "అనరోబిక్" బాక్టీరియా వుంటుంది. ఇది మురికిని శుభ్రపరచటంలో సహాయపడుతుంది. కొన్ని బాక్టీరియాలు మృత దేహాలను కుళ్ళేటట్లు చేస్తాయి. ఈ బాక్టీరియాలే కనుక లేకపోయినట్లయితే భూమంతా మృతకళేబరాలతో నిండిపోయి వుండేది. బాక్టీరియాలు పరిసరాలను శుభ్రం చేస్తున్నాయి. లేకుంటే కుళ్ళిపోయిన జంతువులు, చెత్తాచెదారంతో మనమంతా బాధపడవలసి వచ్చేది. ఇలా ఎన్నో మేలు చేసే బాక్టీరియాలు మానవులకు మిత్రులుగా పేర్కొనవచ్చు.

తమకు రోజూ అవసరమయ్యే నీటికోసం కొన్ని రకాల సాలీళ్ళు తమ గూళ్ళనే తినేస్తాయి. ఈ గూళ్ళలోని తీగలు వాతావరణంలోని తేమను పీల్చు కుంటాయి. నీటి కోసం తాము అల్లుకున్న గూళ్లనే ఆరగించే ఈ సాలీళ్ళు ప్రతిరోజూ కొత్త గూళ్లను నిర్మించుకుంటాయి.





శ్రీదేవి కుటుంబంతో మా అనుబంధం మరువలేనిది

శ్రీదేవి గురించి ఇలాంటి ఒక సందర్భం వస్తుందని అనుకోలేదు. ఆమె గురించి ఇలా మాట్లాడాల్సి వస్తుందని నిజంగా నేనెప్పుడూ ఊహించలేదు. ఇది దురదృష్టం. అందం అభినయం కలబోసిన నటి శ్రీదేవి. అత్యద్భుత నటి. ఇలాంటి నటి ఇంతవరకు లేరు. ఇక మీద పుడుతారని కూడా నేను అనుకోవటం లేదు. నిజంగా భగవంతుడు ఆమెకు చాలా అన్యాయం చేశాడు. శ్రీదేవి హఠాన్మరణాన్ని నేను జీర్ణించుకోలేకపోతున్నాను. చిన్నప్పట్నుంచీ శ్రీదేవికి నటన తప్ప మరో వృత్తి లేదు. మరో ధ్యాస లేదు, మరో వ్యాపకం లేదు. ఎంత సేపూ నటన నటన అంటూ నటనపై తన అంకిత భావాన్ని తెరమీద చూపింది.

- చిరంజీవి

శ్రీదేవిగారితో నాన్నగారు చాలా సినిమాల్లో నటించారు. ఎలాంటి భావాన్నైనా కళ్ళతోనే పలికించగల మహానటి శ్రీదేవిగారు. ఆవిడ హఠాన్మరణం చిత్రసీమకు తీరని లోటు. ఆవిడ ఆత్మకి శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని వేడుకొంటున్నాను.

- బాలకృష్ణ

శ్రీదేవిగారితో నా అనుబంధం ఈనాటిది కాదు. నా సూపర్ హిట్ సినిమాల్లో ఎక్కువగా హిందీలో రీమేక్ చేసింది బోనీ కపూర్ గారే. ముంబై వెళ్ళినప్పుడల్లా శ్రీదేవిగారి ఇంటికి వెళ్లకుండా ఎప్పుడూ వెనుదిరగలేదు. అటువంటి మంచి మనిషి, అద్భుతమైన నటి నేడు మన మధ్య లేదు అన్న చేదు నిజాన్ని దిగమింగడం చాలా కష్టంగా ఉంది.

- ప్రముఖ నిర్మాత ఏ.ఎం.రత్నం

శ్రీదేవి కుటుంబంతో నాకు తిరుపతి నుండి మంచి అనుబంధం ఉంది. ఆమె తల్లి తిరుపతికి చెందినవారు. శ్రీదేవితో కలిసి చాలా సినిమాల్లో నటించాను. భారతీయ చిత్రసీమ మంచి నటిని మాత్రమే కాదు, ఉన్నతమైన వ్యక్తిని కూడా కోల్పోయింది. నా 42వ సినీ జీవిత ఉత్సవాలు విశాఖపట్నంలో జరుగుతున్నప్పుడు కేవలం ఫోన్ చేయగానే వైజాగ్ వచ్చి, ఆ వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోనిబ్బరాన్ని ఆ శిరిడీ సాయినాధుడు ప్రసాదించాలని కోరుకొంటున్నాను.

- డా.మోహన్ బాబు

భారతదేశం గర్వించదగ్గ గొప్ప నటి

భారతదేశం గర్వించదగ్గ గొప్ప నటి శ్రీదేవి తో మా తొలి చిత్రం 'క్షణక్షణం' తీయడం, ఆ చిత్రానికి తొలిసారిగా ఆమె ఉత్తమ నటిగా నందితో పాటూ ఫిలిం ఫేర్ అవార్డు కూడా అందుకోవడంతో చాలా సంతోషించాం. ఆ చిత్ర నిర్మాణంలో తానొక పెద్ద స్టార్ హీరోయిన్ అనే ఫీలింగ్ లేకుండా చాలా సింపుల్ గా ఉంటూ ప్రతిక్షణం ఎంతో సహకరించేవారు. ఆ సమయంలో వాళ్ళ నాన్నగారు దూరమై, మానసికంగా డిప్రెస్ అయినా కూడా షెడ్యూల్స్‌కి ఎలాంటి ఆటంకం లేకుండా సినిమా అనుకున్న టైమ్‌కి పూర్తవడానికి ఎంతో తోడ్పడ్డారు. అలాంటి గొప్ప అంకితభావం ఉన్న నటి దూరమవడం చాలా దురదృష్టకరం. ఆవిడ ఆత్మకి శాంతి కలగాలని కోరుకుంటూ, కుటుంబసభ్యులకు సంతాపం తెలియచేస్తున్నాను

- డా.కె.ఎల్.నారాయణ
శ్రీ దుర్గా ఆర్ట్స్



ఘనంగా దండుపాళ్యం -3 ఆడియో ఫంక్షన్

దండుపాళ్యం గ్యాంగ్‌కి కన్నడలో మంచి క్రేజ్ వుంది. ఆ క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు శ్రీనివాసరాజు రియలిస్టిక్‌గా తెరకెక్కించారు. అలా చేసిన దండుపాళ్యం 1, దండుపాళ్యం 2 భారీ ఓపెనింగ్స్‌తో సూపర్ సక్సెస్ సాధించాయి. ఇప్పుడు ఈ ఫ్రాంచయిస్‌లో చివరి పార్టుగా దండుపాళ్యం-3 తీసుకొస్తున్నాడు. విభిన్నమైన కథాంశంతో, సహజమైన సన్నివేశా లతో, భావోద్వేగమైన నటనతో దండుపాళ్యం చిత్రం ద్వారా ఆ గ్యాంగ్‌కి సపరేట్ క్రేజ్ సంపాదిం చుకున్నారు. శ్రీనివాస రాజు దర్శకత్వంలో రూపొం దిన ఈ సెన్సేషనల్ చిత్రం మరోసారి తెలుగు ప్రేక్షకుల్ని థ్రిల్ చేయనుంది. ఈ చిత్రాన్ని శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ వారు తెలుగులో విడుదల చేస్తున్నారు. శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో.. సాయికృష్ణ ఫిల్మ్స్ సమర్ప ణలో శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్స్‌పై శ్రీనివాస్ మీసాల, సాయి కృష్ణ పెం డ్యాల సంయుక్తంగా తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రాన్ని అందిస్తున్నారు. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంబంధించిన ఆడియో ఫంక్షన్ ప్రసాద్ ల్యాబ్ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్ర మానికి ఎక్కడికి పోతావు చిన్నవాడా దర్శకుడు వి.ఐ.ఆనంద్, నేను లోకల్ దర్శకుడు త్రినాథ్, ప్రముఖ రచయిత, దర్శకుడు, నటుడు పరుచూరి వెంకటేశ్వరావు, ప్రముఖ నిర్మాత మర్యాపురం శివకుమార్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. మెట్టమెదటిసారిగా ఈ చిత్రంలో నటించిన గ్యాంగ్ మొత్తం ఈ కార్యక్రమానికి హాజరవ్వటం విశేషం.

ఈ సందర్భంగా హీరోయిన్ పూజాగాంధి మాట్లాడుతూ.. నేను చాలా గ్లామర్ రోల్స్ చేశాను. కాని దర్శకుడు శ్రీనివాస రాజు గారు చెప్పిన కథ, కథనం నచ్చి ఈ దండుపాళ్యం చేశాను కాని ఆయన వరుసగా మూడు పార్టులు తీసారు. ఇప్పుడు మా గ్యాంగ్ అందర్ని దండు పాళ్యం గ్యాంగ్ అంటున్నారు. మేము ఇంతకు ముందు చేసిన పాత్రలు మర్చిపోయారు. లక్ష్మి పాత్రకు నేను కొంచెం కష్టపడాల్సి వచ్చింది. నా బాడీ లాంగ్వేజ్‌తో నా మాటతీరు అన్ని మార్చు కోవాల్సి వచ్చింది. పార్టు 3 కూడా మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను అన్నారు.

మకరంద్ పాండే మాట్లాడుతూ ఈ చిత్రంలో నా నవ్వుని సిగ్నేచర్ స్మైల్‌గా మార్చారు. ఈ సినిమా తరువాత మమ్మల్ని ప్రేక్షకులు చూసే తీరు మారిపోయింది. క్రూరంగా ఘోరంగా చూస్తు న్నారు. మీరు దండుపాళ్యం గ్యాంగ్ కదాని అడుగుతున్నారు. చాలా హ్యాపీగా వుంది. పాత్రల్ని గుర్తుపెట్టుకున్నారు అంటే అదే మా విజయం. దండుపాళ్యం 3 మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను.. అని అన్నారు. రవికాలే మాట్లాడుతూ.. తెలుగులో చాలా చిత్రాలు చేశాను కాని ఈ చిత్రానికి వచ్చిన గుర్తింపు మరే చిత్రానికి కూడా రాలేదు. మంచి డ్రస్‌లు వేసుకుని హుం దాగా నటించినప్పుడు బాగానే చేశాడు అన్నారు. కాని ఈ గ్యాంగ్‌లో కనపడితే మీరు దండుపాళ్యం గ్యాంగ్ కదా అని అడుగుతున్నారు. దర్శకుడు శ్రీనివాస రాజుకి మా ధన్యవాదాలు.. అన్నారు.

వి.ఐ.ఆనంద్ మాట్లాడుతూ.. ఇలాంటి చిత్రాలు తీయాలంటే అందరివల్ల కాదు.. దానికి ఎంతో ధైర్యం కావాలి. ఇలాంటి చిత్రాన్ని నిర్మించ దానికినికి మించిన గట్స్ కావాలి. దర్శకుడు శ్రీనివాస రాజు మెదటి పార్టుతోనే తనేంటో ప్రూవ్ చేసుకున్నారు. మూడు పార్టులు తీసి సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతున్నాడంటే మామూలు మేటర్ కాదు. అలాగే తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్న సాయి గారికి, శ్రీనివాస్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను అని అన్నారు.

త్రినాథ్ మాట్లాడుతూ.. యధార్ధ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన దండుపాళ్యం చిత్రం అన్ని పార్టులు మంచి విజయాలు సాధించాయి.. ఇప్పుడు ఈ చివరి పార్టు దండుపాళ్యం 3 కూడా మంచి విజయాన్ని సాధించాలని నిర్మాతలు మీసాల శ్రీనివాస్, సాయి కృష్ణ పెండ్యాలకు మంచిగా డబ్బులు రావాలని కోరుకుంటున్నాను అన్నారు.

పరుచూరి వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. మేము ఇప్పటికీ 365 చిత్రాలకి రాశాము. ఈ దర్శకుడు ఏచిత్రం గురించైనా 365 రోజులు డిస్కస్ చెయ్యగలడు అంత సినిమా నాలెడ్జ్ వున్నవాడు. చాలా టాలెంట్ వున్న దర్శకుడు. వరుసగా సీక్వెల్స్‌తో హిట్స్ కొడుతున్నాడు. ఇప్పుడు ఈ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించాలని కొరుకుంటున్నాను అన్నారు. నిర్మాతలు శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణ పెండ్యాల మాట్లాడుతూ.. మహానుభావుడు, ఆనందో బ్రహ్మ, ఒక్కక్షణం లాంటి సూపర్‌డూపర్ హిట్ చిత్రాల్ని పంపిణీ చేశాము. ఈ సంవత్సరం దండుపాళ్యం 3 చిత్రంతో నిర్మాతగా సినీరంగ ప్రవేశం చేశాము. దర్శకుడు శ్రీనివాస రాజు చాలా మంచి దర్శకుడు. ఆయన కమిట్‌మెంట్ కథని కన్విన్స్ చేసే విధానం చాలా బాగుంటాయి. ప్రేక్షకులు థ్రిల్‌గా ఫీలవుతారు. ఈ దండుపాళ్యం పార్టులన్ని మంచి విజయాలు సాధించాయి. చివరి పార్టుగా వస్తున్న దండుపాళ్యం 3 మార్చిలో విడుదల కానుంది. మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం వుంది. సంగీతం: అర్జున్ జన్యా, సినిమాటోగ్రఫీ: వెంకట్ ప్రసాద్, ఎడిటింగ్: రవిచంద్రన్, కో ప్రొడ్యూసర్ సాయి కృష్ణ పెండ్యాల నిర్మాతలు: శ్రీనివాస్ మీసాల, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీనివాసరాజు.



నాగార్జునకి జోడీగా అనుష్క

ఈ ఏడాది జనవరిలో 'భాగమతి' సినిమాతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్న టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క.. ప్రస్తుతం స్వీటీ కొత్త కథలను వినే క్రమంలో ఉన్నారు. అయితే ఇప్పుడు ఓ రూమర్ తెలుగు సినీ పరిశ్రమలో చక్కర్లు కొడుతోంది. అదేమిటంటే నాగార్జున, నాని కథానాయకులుగా ఓ మల్టీస్టారర్ మూవీ తెరకెక్కబోతున్న విషయం విదితమే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మణిశర్మ సంగీత దర్శకుడు. ఇందులో ఇద్దరు కథానాయికలకు చోటు ఉండగా వారిలో ఒకరిగా అనుష్క పేరు వినిపిస్తోంది. నాగ్ పోషిస్తున్న డాన్ పాత్రకి జోడీగా అనుష్క కనిపించనుందని సమా చారం. నానికి జోడీగా కన్నడ బ్యూటీ శ్రద్ధా శ్రీనాథ్‌ను ఫైనల్ చేసారని తెలుస్తోంది. మార్చి నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని నిర్మాత అశ్వినీదత్ ఇప్పటికే ప్రకటించారు. గతంలో నాగార్జున, అనుష్క జంటగా 'సూపర్', 'డాన్', 'రగడ', 'ఢమ రుకం' వంటి సినిమాలతో ప్రేక్షకులను అల రించారు. కాగా, అనుష్క ఎంపిక విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌కి జంటగా కాజల్



తన సినిమాల్లో ఎప్పుడూ స్టార్ హీరోయిన్లను తీసుకోవడానికి ఇంపార్టెన్స్ ఇస్తుంటాడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఇందులో భాగంగా ఇప్పటికే సమంత, రకుల్, పూజా హెగ్డే లాంటి భామలతో సినిమాలు చేసిన ఈ యంగ్ హీరో ఇప్పుడు కాజల్‌పై ఫోకస్ పెట్టాడు. వీలైతే తన నెక్స్ట్ మూవీలో ఆమెను హీరోయిన్‌గా తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. వంశధార క్రియేషన్స్ బ్యానర్ పై నూతన దర్శకుడు శ్రీనివాస్ ను పరిచయం చేస్తూ ఓ సినిమాకు ఈమధ్యే కొబ్బరికాయ కొట్టాడు బెల్లంకొండ. ఈ సినిమాలో హీరోయిన్‌గా కాజల్ ను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు మేకర్స్. ఇందులో భాగంగా ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారని మేకర్స్ ఇప్పటికే ప్రకటించగా.. మెయిన్ హీరోయిన్‌గా కాజల్‌ను తీసుకోవాలని అనుకుంటున్నారు. కాజల్ ఫిక్స్ అయిన వెంటనే సెకెండ్ హీరోయిన్‌ను ప్రకటిస్తారు. నవీన్ నిర్మించనున్న ఈ సినిమాకు తమన్ సంగీత దర్శకుడు.

నిను చూసి ఎన్నెలంత అలిగెల్లి పోదా ఇల్లా...'

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కణం'. ఈ చిత్రం మొదటి సింగిల్ 'సంజాలి..'ని ఆదివారం విడుదల చేశారు. 'నిను చూసి ఎన్నెలంత అలిగెల్లి పోదా ఇల్లా..' అంటూ మొదలయ్యే ఈ 'సంజాలి' పాట చక్కని సాహిత్యంతో, మధురమైన శ్యామ్ సి.ఎస్. సంగీతంతో రూపొందింది. త్వరలో విడుదలకు సిద్ధమవు తున్న ఈ చిత్రానికి నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్., ఎల్.జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్, ఎం.ఆర్.రాజకృష్ణన్, కె.మణివర్మ, రామసుబ్బు, సప్న షా, వినయదేవ్, మోడేపల్లి రమణ, కె.భార్గవి, ప్రత్యూష, ఎస్.ఎం.రాజ్‌కుమార్, ఎస్.శివశరవణన్, షియామ్ పనిచేస్తున్న సాంకేతికవర్గం. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.ప్రేమ్, సమర్పణ: ఎన్.వి.ఆర్. సినిమా, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, దర్శకత్వం: విజయ్.



మార్చి 8 నుండి రామ్ కొత్త సినిమా

'ఉన్నది ఒకటే జిందగీ' సినిమా తరువాత రామ్, త్రినాద్ రావ్ దర్శకత్వంలో నటించబోతున్నాడు. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అనుపమ పరమేశ్వరన్ హీరో యిన్‌గా నటిస్తోన్న ఈ సినిమా షూటింగ్ మార్చి 8 నుండి మొదలుకాబోతోంది. ఈ మూవీలో ఇద్దరు హీరోయిన్స్ యాక్ట్ చెయ్యబోతునట్లు సమాచారం. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిం చబోతున్న ఈ సినిమా రామ్ చేస్తోన్న 16వ చిత్రం. త్రినాథ్ రావ్ గత చిత్రాల్లో ఒకటైన 'సినిమా చూపిస్తా మావా' తరహాలో ఎంటర్ టైన్మెంట్ ఈ సినిమాలో ఎక్కువగా ఉండబోతోం దని సమాచారం. ప్రకాష్ రాజ్ ఈ సినిమాలో హీరోయిన్ తండ్రి పాత్రలో కనిపించబోతు న్నాడు. ఈ చిత్రంలో నటించబోయే మరో హీరోయిన్ ఎవరనేది త్వరలో తెలుస్తుంది. దీని తరవాత నూతన దర్శకుడితో రామ్ సినిమా చేసే అవకాశాలున్నాయని సమాచారం. ప్రస్తు తం ఆ సినిమా చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది.



మరిన్ని చిక్కుల్లో కేజ్రీవాల్..!

న్యూఢిల్లీ : రాష్ట్ర చీఫ్ సెక్రటరీని ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు కొట్టిన కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి కేజ్రీవాల్ ఇంట్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. అయితే ఆ ఫుటేజ్‌ను మార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో దానిని ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి పరీక్షల కోసం పంపించారు. ఢిల్లీ సీఎం, సీఎస్ మీటింగ్ కేజ్రీవాల్ ఇంట్లోని డ్రాయింగ్ రూమ్‌లో జరిగినట్లు అడిషనల్ డీసీపీ హరేంద్ర సింగ్ కోర్టుకు తెలిపారు. అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా.. సమ యంలో మార్పు ఉండటం గమనించినట్లు ఆయన చెప్పారు. ఈ నెల 19న రాత్రి సీఎస్ కేజ్రీవాల్ ఇంటికి వెళ్లారు. అక్క డున్న ఆప్ ఎమ్మెల్యేలు తనపై దాడి చేసినట్లు ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి విచారణ మొదలుపెట్టిన ఢిల్లీ పోలీసులు.. గత శుక్రవారం కేజ్రీవాల్ ఇంటికి వెళ్లి సీసీటీవీ ఫుటేజ్‌కు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకు న్నారు. నిజానికి ఆ హార్డ్‌డిస్క్‌ను ఇవ్వాల్సిందిగా కోరినా.. పట్టించుకోకపోవడంతో పోలీసులే ఇంటికి వెళ్లాల్సి వచ్చింది.

రద్దుచేసుకున్న మహిళల బెర్తులు మహిళలకే

న్యూఢిల్లీ : రద్దు చేసుకున్న మహిళా రిజర్వేషన్ బెర్తులను మహిళలకే కేటాయించాలని, దానిలో సీనియర్ సిటిజన్లకు ప్రాధాన్యత కల్పించాలని రైల్వే అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం వీటిని ఓపెన్ కేటగిరిలోని వెయిటింగ్ లిస్టుకు బదిలీ చేస్తున్నామన్నారు. అయితే వీటిని మహిళలకు మాత్రమే కేటాయించాలని ఫిబ్రవరి 15న రైల్వేబోర్డు రాత పూర్వక సర్క్యులర్‌ను కమర్షియల్ మేనేజర్లకు పంపింది. సర్క్యులర్ ప్రకారం మహిళా సీనియర్ ప్రయాణీకులకు ప్రధాన్యత ఇవ్వనున్నారు. ప్రసుతం స్లీపర్ క్లాస్ కోచ్‌ల్లో ఏసీ 3 టైర్ మూడు కింది బెర్తులు, ఏసీ 2 టైర్ రైళ్లలో రెండు బెర్తులు సీనియర్ సిటిజన్లకు కేటాయిస్తున్నారు. వీరిలో 45 ఏళ్లకు పైబడినవారు, గర్భిణీలు ఉన్నారు. పూర్తి ఏసీతో ఉండే రాజధాని, దురంతోల్లో కింది బెర్తులను మహిళలకే కేటాయిస్తున్నారు.

పంజాబ్ సీఎం అల్లుడిపై సీబీఐ కేసు

రుణ ఎగవేత ఫిర్యాదు చేసిన ఓబీసీ - మరో 13 మందిపై కూడా..

చెరకు రైతుల నిధులను దారి మళ్లించిన వైనం

హాపూర్ (ఉత్తరప్రదేశ్) : దేశంలో ప్రభుత్వరంగ బ్యాంకులను మోసం చేసిన ఘటనలు వరుసగా బయట పడుతున్నాయి. తాజాగా రూ.110 కోట్ల రుణ ఎగవేత ఆరోపణలపై యూపీలోని సింభౌలి షుగర్స్ లిమిటెడ్‌కు చెందిన పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ అల్లుడు గురుపాల్ సింగ్‌తోసహా 13 మంది ఉన్నతాధికారులపై ఆదివారం సీబీఐ కేసు నమోదు చేసింది. ఓరియంటల్ బ్యాంకు అఫ్ కామర్స్(ఓబీసీ) ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టింది. ప్రైవేటు సంస్థకు డిప్యూటీ జనరల్ మేనేజర్ హోదాలో సింగ్ పని చేస్తున్నారు. కాగా సింభౌలి షుగర్స్ చైర్మన్ గుర్మీత్ సింగ్ మన్, సీఈవో జి.ఎస్. సి.రావు, సీఎఫ్‌వో సంజయ్ తప్రియ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుర్‌సిమ్రాన్ కౌర్ మన్‌లతో సహా మరో 12 మందిపై కేసు నమోదు చేశారు.



ఓబీసీ బ్యాంకు 2011వ సంవత్సరంలో రూ.148.60 కోట్ల రుణాన్ని మంజూరు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇదే బ్యాంకు నుంచి రెండు రుణాలు మంజూరైనట్లు ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. బ్యాంకు నష్టాలకు కారణమైనందుకు అవినీతి నిరోధక చట్టం-1988, భారత నేర శిక్షా స్మృతికి చెందిన 420, 409 సెక్షన్ల క్రింద వీరిపై కేసు నమోదు చేశారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) పథకం కింద ఒక ఏర్పాటులో వ్యక్తిగత, ఉమ్మడి బాధ్యత గ్రూపులు(జేఎల్‌జీజీ), స్వయం సహాయక గ్రూపులు (ఎస్ఎల్‌జీజీ) చెరకు రైతులకు ఆర్థిక సహాయం కోసం రుణం మంజూ రయ్యింది. 2012, జనవరి 25 నుంచి 2012, మార్చి 13 వరకు 5,762 మంది చెరకు రైతులకు చెరకు సరఫరా కోసం రుణం మంజూరయ్యింది. అయితే ఈ నిధులను మోసపూరితంగా తమ సొంత అవసరాల కోసం మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా ఈ ఖాతా 2015, మార్చి 31న నిరర్థక ఆస్తి(ఎన్‌పీఏ)గా మారింది. అటుతర్వాత రూ.97.85 కోట్లు కుంభకోణం జరిగినట్లు 2015, మే 31న ఆర్‌బీఐకి ఓబీసీ బ్యాంకు తెలిపింది. ప్రస్తుత ఎన్‌పీఏకి అదనంగా బహుళ ఏర్పాటు క్రింద మరో రూ.110 కోట్ల కార్పొరేట్ రుణాన్ని మంజూరు చేసింది.

అయితే 2016, నవంబరు 29న కార్పొరేట్ రుణాన్ని ఎన్‌పీఏ క్రింద మారింది. బ్యాంకు 2017, నవంబరు 17న సీబీఐకి ఫిర్యాదు చేయగా, కేసు మాత్రం ఈ ఏడాది ఫిబ్రవరి 22న నమోదయ్యింది. ఇదిలాఉండగా సీబీఐ ఆదివారం రాత్రి నోయిడా, హాపూర్, ఢిల్లీలోని కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయాలు, కార్పొరేట్ కార్యాలయాలు, ఫ్యాక్టరీ, డైరెక్టర్ల నివాసాలతో సహా ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.

మళ్లీ మోడీ, ప్రశాంత్ జోడీ?

2019 ఎన్నికల్లో కలిసి పనిచేస్తున్నారా?

ఆరు మాసాలుగా ఇద్దరి మధ్య చర్చలు

కొత్త ఎత్తులపై ప్రశాంత్ కిషోర్ దృష్టి



న్యూఢిల్లీ : ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ మళ్లీ ప్రధాని నరేంద్రమోడీకి దగ్గరవుతున్నారా? 2019 సార్వత్రిక ఎన్నికల్లో మోడీతో కలిసి పని చేయనున్నారా? ఇటీవల పరిణామాలు ఈ వార్తలను నిజమనే చెబుతున్నాయి. ఇటీవల కాలంలో మోడీ, ప్రశాంత్ కిషోర్ తరచూ కలుస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ బీజేపీకి వ్యూహకర్తగా పనిచేయనున్నట్టు బీజేపీలో కీలకనేతలు చెబుతున్నారు. ఎన్నికలకు ఏడాది ముందుగానే ఆయన మోడీ ఎన్నికల ప్రచారాన్ని రూపొందించనున్నట్టు తెలిపారు. 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మోడీకి కలిసి ప్రశాంత్ కిషోర్ పనిచేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లోనూ మోడీకి వ్యూహకర్తగా కొనసాగారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య వైరుధ్యాలు తలెత్తాయి. దీంతో బీహారు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్, మహాకూటమి తరపున ఆయన పని చేశారు. అయితే మోడీ, ప్రశాంత్ కిషోర్ గడచిన ఆరు మాసాలుగా వ్యక్తిగతంగా కలుస్తున్నారు. మరోసారి కలిసి పనిచేయడానికిగల అవకాశాల గురించి చర్చించుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ పాత్రపై చర్చలు జరుగుతున్నాయి. బీజేపీ అధినేత అమిత్‌షాతోనూ ప్రశాంత్ సమావేశమైనట్టు తెలుస్తోంది. 2014 ఎన్నికల ప్రచారం తర్వాత అమిత్‌షాతో వైరుధ్యాల కారణంగానే బీజేపీకి ప్రశాంత్ కిషోర్ దూరమైనట్టు వార్తలు వచ్చాయి. 'సమావేశాలు జరిగాయి. అయితే, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. గుజరాత్‌లో మొదటిసారి ప్రశాంత్ కిషోర్ కలిసిన మోడీ వేరు...ఇప్పటి మోడీ వేరు. మోడీ ఇప్పుడు దేశ ప్రధాని. భారతదేశంలో అతిపెద్ద నాయకుడు. బీజేపీ కూడా 2014 నాటి బీజేపీ కాదు. గాంధీనగర్ నుంచి కిషోర్ సమాంతరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన నాటి బీజేపీ ఇప్పుడు లేదు. బీజేపీ ఇప్పుడు పటిష్టంగా తయారైంది. ప్రశాంత్ కిషోర్ కూడా అదే కిషోర్ కాదు. కొన్నేళ్లుగా ఆయన వేరే పార్టీలకు వ్యూహకర్తగా పనిచేశారు. ఆ దశలో మోడీ, కిషోర్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు' అని ఆ చర్చల్లో భాగ స్వామిగా ఉన్న ఓ వ్యక్తి చెప్పారు. భారతీయ రాజకీయ కార్యాచరణ కమిటీని నడుపుతున్న ప్రశాంత్ కిషోర్...వ్యక్తిగత నాయకత్వ బ్రాండింగ్, రాజకీయ వ్యూహం, మాక్రో, మైక్రో క్యాంపెయిన్ ఈవెంట్స్, కమ్యూనికేషన్, సందేశాలు, ప్రసంగాలపై పనిచేస్తున్నారు. దీంతోపాటు టికెట్ల పంపిణీపై అవసరమైన సలహాలు, సూచనలు చేస్తున్నారు. నియోజకవర్గ పరిస్థితులకు అనుగుణంగా ఆయన విలువైన సూచనలు చేస్తారు. ఒకవేళ ప్రశాంత్ కిషోర్ తిరిగి వస్తే...నరేంద్రమోడీతో నేరుగా పనిచేసే అవకాశం ఉంటుంది. ఇది మోడీకి సంబంధించిన వ్యక్తిగత ప్రచారం మాత్రమే. బీజేపీ తరపున ఆయన పనిచేసే అవకాశం ఉండకపోవచ్చు. బీజేపీ సంస్థాగతంగా పటిష్టంగా ఉంది. ఓట్లను తనవైపు మార్చుకునే దిశగా అది పనిచేస్తోంది. అందుకు మోడీ అనే బ్రాండ్ అండగా ఉంటుంది. అందుకే 2019 ఎన్నికలు కూడా మరోసారి బ్రాండ్‌పై ఆధారపడే జరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు. మోడీ, కిషోర్ చర్చలు ఫలిస్తే...ఓటర్లకు 2019లో కొత్తసందేశం ఎలా ఇవ్వాలనే అంశంపైనే కిషోర్ దృష్టి సారించే అవకాశం ఉంది. మోడీతో వైరుధ్యాల తర్వాత మొదటిసారి 2015లో కిషోర్ బీహారులో నితీష్ కుమార్- లాలు ప్రసాద్-కాంగ్రెస్ మహాకూటమికి వ్యూహకర్తగా పనిచేశారు. ఆ ఎన్నికల్లో బీజేపీకి దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయి. 2016లో కాంగ్రెస్‌కు వ్యూహకర్తగా ఉన్నారు. ఆ ఏడాది ఆయనకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. పంజాబ్‌లో కాంగ్రెస్ విజయం సాధించినా యూపీలో ఘోరపరాజయం పొందింది. దీంతో కాంగ్రెస్‌కు కిషోర్ దూర మయ్యారు. ఇటీవల కాలంలో ప్రశాంత్ కిషోర్ ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వం లోని వైసీపీతో కలిసి పనిచేస్తున్నారు. ఏపీలో వైసీపీకి దశ. దిశ కలిగించేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

బ్యాంకుల సమ్మె యోచన విరమణ

యూఎఫ్‌బీయూ నిర్ణయం

పీఎన్‌బీ అవకతవకలపై క్షుణ్ణంగా దర్యాప్తుకు డిమాండు

వదోదర : దేశవ్యాప్తంగా మార్చి 15వ తేదీన నిర్వహించ తలపెట్టిన సమ్మెను ఉపసంహరించుకుంటున్నట్టు బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ల యునైటెడ్ ఫోరం (యూఎఫ్‌బీయూ) సోమవారం ప్రకటించింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో చోటుచేసుకున్న భారీ అవక తవకలు, బ్యాంకింగ్‌రంగంలో మొత్తంమీద చోటుచేసుకున్న వైవిధ్య వాతావరణం నేపథ్యంలో సమ్మె తగదని భావించి ఉపసంహ రించుకుంటున్నట్టు తెలిపింది. "వారాంతంలో ఫోరం సమావేశమైంది. మార్చి 15న ఇచ్చిన సమ్మె పిలుపును ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది" అని ఆల్‌ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పీఎన్‌బీలో భారీ అవకతవకలు చోటుచేసుకోవడం ఫోరంను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని తెలిపారు. బ్యాంకులు అనాలోచితంగా ఈ విధమైన చర్యలకు పాల్పడడం విచారకరమని ఫోరం పేర్కొంది. "ఈ కుంభకోణంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపించడానికి బదులు కేవలం దిగువస్థాయి ఉద్యోగులనే బాధ్యులుగా చూపించే ప్రయత్నాలు జరగడంపై కూడా సమావేశం చర్చించింది. అంటే అవినీతికి వారొక్కరే బాధ్యులా" అని ప్రశ్నించింది. బ్యాంకుల పర్యవేక్షణ వ్యవస్థ సమర్థతను కూడా ఫోరం ప్రశ్నించింది. "వాస్తవాలను ఎవరూ మరుగున పర్చజాలరు. పీఎన్‌బీ ఉన్నతాధికారులతో సహా బ్యాంకు ఉన్నత స్థాయి వివిధ యాజమాన్యం బాధ్యతలు నిర్వర్తించడంలో, నియంత్రణలో, పర్యవేక్షణ, పరిశీలనలో తీవ్ర నిర్లక్ష్యం ఉంది" అని ఆ ప్రకటన పేర్కొన్నది. ఈ కుంభకోణంలో భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) పాత్ర, బాధ్యతను కూడా తెలుసుకోవాలని ఫోరం డిమాండు చేసింది. ఈ అక్రమాలను ముందుగా ఎందుకు వెలుగులోకి తీసుకు రాలేకపోయిందని" అని ప్రశ్నించింది.



లోక్‌పాల్‌పై జాప్యమేమిటి?

నాడు గుజరాత్‌లో లోకాయుతను పట్టించుకోలేదు

ఇప్పుడు లోక్‌పాల్‌పై మౌనం

అవినీతి అంటే నీరవ్, జైషా గుర్తు రావడం లేదా?

పీఎన్‌బీ కుంభకోణంపై పెదవి విప్పరా..

రామదుర్గ (కర్నాటక) : అవినీతి నియంత్రణ కోసం లోక్‌పాల్‌ను ఇప్పటి వరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రధాని నరేంద్రమోడీని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సూటిగా ప్రశ్నించారు. మోడీ సంపన్నుల పక్షపాతి అని నిందించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో రాహుల్‌గాంధీ ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్ని బహిరంగ సభల్లోనూ మోడీ లక్ష్యంగా రాహుల్ విమర్శలు గుప్పిస్తున్నారు. పంజాబ్ నేషనల్ కుంభకోణం వంటి అంశాలపై ఎందుకు మౌనంగా ఉన్నారని మోడీని నిల దీశారు. గుజరాత్‌లో మోడీ లోకాయుక్తను అమలు చేయ లేదని రాహుల్ విమర్శించారు. మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు అవుతుందని, ఢిల్లీలోనూ ఆయన లోక్‌పాల్‌ను అమలు చేయలేదని దుసుమాడారు. ఈ దేశానికి తాను కావలాదారుడి(చౌకీదారు)నని పదేపదే చెప్పుకునే మోడీ...పీఎన్‌బీ కుంభకోణంపై ఎందుకు మౌనం వహిస్తు న్నారని నిలదీశారు. అమిత్‌షా కుమారుడు జైషా కంపెనీ టర్నోవర్ కొద్ది కాలంలోనే అంత ఎక్కువ ఎలా పెరిగిందని ప్రశ్నించారు. 'ఈ దేశ చౌకీదారు కర్ణాటక వస్తారు. ఆయన పార్టీ ముఖ్యమంత్రి(మాజీసీఎం బీఎస్ యడ్యూరప్ప) అవినీతి గురించి మాట్లాడతారు. బీజేపీ హయాంలో జైలుకెళ్లిన నలుగురు ఆయన పార్టీ మంత్రుల గురించి ప్రస్తావిస్తారు' అని రాహుల్ ఎద్దేవా చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన భారీ ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. తన మాటలను ఆచరణలో పెడితే బాగుంటుందని మోడీకి హితవు పలికారు. కర్ణాటకలోని ఉత్తర ప్రాంతాల్లో మూడు రోజుల పర్యటనకు గాను రాహుల్ ఇక్కడికి వచ్చారు. 'మోడీగారూ...మీ ప్రసంగాల కోసం ఈ దేశానికి మిమ్ములను ప్రధానిగా చేయలేదు' అని అన్నారు. భారతదేశ పేదలకు చెందిన వేలాది కోట్ల రూపాయలను వజ్రాలవ్యాపారి నీరవ్ మోడీ విదేశాలకు తరలించుకు పోయారని రాహుల్ అన్నారు. భారతదేశ రైతులు, కార్మికులు, పేదలకు చెందిన రూ.22 వేల కోట్లను నీరవ్ మోడీ తరలించుకుపోయారు. అయినా మన చౌకీదారు ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. పీఎన్‌బీ బ్యాంక్‌కు సంబంధించి నీరవ్‌మోడీ రూ.11,400 కోట్లు దోచుకుంటే మోడీ ఒక్కసారి స్పందించారని, ఆర్థిక అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటానని మాత్రమే శుక్రవారం మోడీ చెప్పారని గుర్తుచేశారు. ప్రజాధనాన్ని దోపిడీ చేస్తే సహించేది లేదని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారని రాహుల్ అన్నారు. జీఎస్‌టీని గబ్బర్‌సింగ్ టాక్స్‌గా అభివర్ణించిన రాహుల్.. దీనిని తీసుకొచ్చినందుకు మోడీపై నిప్పులు చెరిగారు. జీఎస్‌టీతో సామాన్యుడి జేబు ఖాళీ చేస్తున్నారని మండిపడ్డారు. లక్షలాదిమంది వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలు మూసుకున్నారన్నారు. నష్టాలతో లక్షలాదిమంది బాధపడుతున్నారని రాహుల్ ఆవేదన చెందారు. కానీ ఒకే ఒక మనిషి విజయవంతంగా వ్యాపారం నిర్వహిస్తున్నారని. ఆ ఒక్కరూ ఎవరంటే జైషా అని హేళనగా మాట్లాడారు. జైషా కేవలం మూడు మాసాల్లోనే రూ.80 కోట్లను రూ.50 వేల కోట్లకు పెంచారని రాహుల్ అన్నారు. అయినా చౌకీదారు స్పందించలేదని అన్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య నుంచి మోడీ నేర్చుకోవాల్సింది చాలా ఉందని చెప్పారు. ఎవరేమనుకున్నా సిద్ధరామయ్య, తాను, కాంగ్రెస్‌పార్టీ పేదలు, బలహీనవర్గాల కోసమే పనిచేస్తామని రాహుల్ చెప్పారు. కర్ణాటక పురోగతి కోసం అందరం కలిసి పనిచేస్తామన్నారు.

మహిళా పోలీసులు 7.28 శాతమే

తెలంగాణ, ఏపీ, యూపీ, మేఘాలయాల్లో అతి తక్కువ

తమిళనాడులో అత్యధికం



న్యూఢిల్లీ : దేశంలో మహిళలపై నేరాల సంఖ్య ఇటీవల కాలంలో పెరిగినప్పటికీ పోలీసు దళాల్లో మహిళల సంఖ్య మాత్రం పెరగడంలేదు. భారత్‌లోని పోలీసు బలగాల్లో మహిళలు కేవలం 7.28 శాతం మాత్రమే. నక్సలైట్ల ప్రాబల్యం ఎక్కువగా కలిగిన తెలంగాణ రాష్ట్రంలో ఈ శాతం మరింత అధ్వాన్నంగా ఉంది. అక్కడ మహిళలు కేవలం 2.47 శాతం మాత్రమే ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. తీవ్రవాద ప్రాబల్యం అధికంగా కలిగిన జమ్మూ-కాశ్మీర్‌లో పోలీసు బలగాల్లో మహిళలు కేవలం 3.05 శాతం మాత్రమే ఉన్నారు. ఆ రాష్ట్రానికి మంజూరైన పోలీసుల సంఖ్య 80,000పైనేనని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాలు తెలిపాయి. దేశంలో మహిళలపై దాడుల సంఖ్య పెరుగుతోందని కూడా ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. మహిళలపై నేరాలు మొత్తం మీద 2015లో 3,29,243 ఉండగా, 2016లో ఆ సంఖ్య 3,38,954కు పెరిగిందని ఆ గణాంకాలు తెలిపాయి. పోలీసు బలగాలలో మహిళల సంఖ్యను 33 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 2009, 2012, 2016లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సూచనలు పంపించినప్పటికీ ఆ శాతం పెరగకపోవడం ఆందోళనకరమని మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. మహిళా కానిస్టేబుళ్లు, సబ్ ఇన్స్‌పెక్టర్ల అదనపు పోస్టులు సృష్టించాలని, మహిళల నియామకాలు జరపడం ద్వారా ఆ ఖాళీలను భర్తీ చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరినట్లు అధికారులు తెలిపారు.

గత ఏడాది జనవరి 1 నాటికి తెలంగాణలో కేవలం 2.47 శాతం మంది మహిళలు పోలీసు దళంలో పనిచేస్తున్నారు. ఆ రాష్ట్రానికి మొత్తం 60,700 మంది పోలీసులను మంజూరు చేశారని ఆ గణాంకాలు తెలిపాయి. దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పోలీసు దళంలో కేవలం 3.81 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఆ రాష్ట్రానికి మంజూరైన పోలీసుల సంఖ్య 3,65,000. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాలలో కూడా మహిళా పోలీసుల సంఖ్య చాలా తక్కువగానే ఉన్నదని ఆ గణాంకాలు తెలుపుతున్నాయి. తమిళనాడులో అత్యధిక సంఖ్యలో మహిళా పోలీసులున్నారు. హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, గోవాలలో కూడా పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నది. కేంద్ర పాలిత ప్రాంతాలలో చండీఘర్‌లో అత్యధిక సంఖ్యలో మహిళా పోలీసులున్నారు. ఢిల్లీలో కూడా మహిళల సంఖ్య చెప్పుకోతగ్గ విధంగా లేదు. అక్కడ 85,000 మంది పోలీసులను మంజూరు చేయగా గత ఏడాది జనవరి 1 నాటికి మహిళా పోలీసుల శాతం 8.64గా ఉంది. పారామిలటరీ దళాల్లో మహిళల సంఖ్యను పెంచేందుకు హోం మంత్రిత్వ శాఖ అనేక చర్యలు తీసుకుంటోందని మరో అధికారి తెలిపారు.

ఉపాధ్యాయుల సమ్మెపై పిల్ కొట్టివేత

చెన్నై : నగరంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆందోళనను నిరసిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజనాల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. వారి సమస్యలను పరిష్కరించాలని నిరసన చేపట్టిన ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు వారి అధికారుల వద్ద అనుమతి తీసుకోనందున వారిని నియంత్రించాలన్న పిటిషన్‌ను జస్టిస్ ఇందిరాబెనర్జీ, జస్టిస్ అబ్దుల్ ఖుద్దోస్‌లు డిస్‌మిస్ చేశారు. ఈ పటిషన్‌ను ఎస్ సిర్గేత్ నైనా మొహ్మద్ దాఖలు చేశారు.

తృణమూల్ కాంగ్రెస్‌కు భుటియా ఝలక్

కోల్‌కత : తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు భుటియా ఝలక్ ఇచ్చారు. ఫుట్‌బాల్ కెప్టెన్‌గా ఉన్న బైచుంగ్ భుటియా తృణమూల్ కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు సోమవారం ప్రకటించారు. 2014,16ల్లో రెండు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ నుంచి పోటీచేసిన ఆయన రెండు సార్లు ఓటమి చెందారు. టీఎంసీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానన్నారు. ఆయన రాజీనామాపై స్పందించడానికి టీఎంసీ నిరాకరించింది. తన రాజీనామాను నెల రోజుల క్రితమే పార్టీ వర్గాలకు తెలిపానని, ఏ రాజకీయపార్టీలోనూ చేరబోనని ఆయన స్పష్టం చేశారు.

ఏనుగును దారికి తెచ్చిన మావటి

కొట్టాయం (కేరళ) : యుట్టిమానూర్ మహదేవాలయంలో అదుపు తప్పిన ఏనుగు భక్తులను భయాందోళనలకు గురిచేసింది. సమయస్ఫూర్తితో వ్యవహరించిన మావటి దానిని అదుపులోకి తెచ్చాడు. దీంతో ఎవరూ గాయపడలేదని ఆలయ వార్గాలు తెలిపాయి. ఏనుగు పై ఉన్న మావటి అదుపుతప్పిన ఏనుగుపై గుడిగోపురంపై నుంచి తాడుతో బిగించి ప్రజలపైకి వెళ్లకుండా అదుపు చేసిన దృశ్యాలను స్థానిక చానళ్లు ప్రసారం చేశాయి. సోమవారం తెల్లవారు జాము 3 గంటలకు ఈ ఘటన జరిగింది. మరో ఏనుగు రావడంతో ఈ ప్రమాదం సంభవించిందన్నారు.

గోవా లోక్‌సభ ఎన్నికల బరిలో శివసేన

పనాజీ : వచ్చేఏడాది జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో పోటీచేయడానికి శివసేన సన్నద్ధమయింది. గోవా సురక్షా మంచ్ (జీఎస్ఎం)తో జతకట్టి పోటీ చేస్తున్నామని సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. ఆర్‌ఎస్ఎస్ నాయకుడు సుభాష్ వెలింగర్ గతేడాదే జీఎస్ఎంతో జతగట్టి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఒక్కసీటు కూడా సాధించలేకపోయారు. శివసేన చీఫ్ ఉద్ధవ్ ధాకరే ఈ ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, సేన అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ తెలిపారు.రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు శివసేనతో చేతులు కలుపుతున్నారన్నారు.

విద్యార్థినిలకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ

భువనేశ్వర్ : ఒడిశాలోని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా శానిటరీ నాప్కిన్స్ పంచి పెట్టే పథకం ఖుషిని ప్రభుత్వం సోమవారం ప్రారంభించింది. మహిళా సాధికారికత నేపథ్యంలో ఈకార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దీనికోసం కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖకు ఏడాదికి రూ. 70 కోట కేటాయించామని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 6 నుంచి 12 తరగతులు చదివే పాఠశాల పిల్లలకు వీటిని ఉచితంగా అందచేస్తామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వెల్లడించారు.

మేఘాలయాలో రూ.38 లక్షల నగదు స్వాధీనం

షిల్లాంగ్: మేఘాలయాల్లో మంగళవారం ఎన్నికలు జరగనుండగా, సోమవారం రూ. 38 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎన్నికల అధికారి (ఈసీ) తెలిపారు. తూర్పు ఖాశీ హిల్స్‌లోని లాడ్ సమితిలో ఈ ఘటన జరిగిందని, రిభోయ్ జిల్లాలో రూ. 12 లక్షలు, బొగ్గు వ్యాపారి నుంచి రూ. 38.67 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల చీఫ్ ఎఫ్ఆర్ ఖర్గోంగర్ వెల్లడించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ. 70 లక్షలు స్వాధీనం చేసుకున్నామని ఈసీ వెల్లడించింది.

ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

రాంచి : జార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళతో సహా నలుగురు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు 134వ బెటాలియన్, కేంద్ర భద్రతాదళాలు సంయుక్తంగా జరిపిన ఎన్‌కౌంటర్‌లో వీరుమృతి చెందారన్నారు. గాలింపు చర్యలు జరుపుతుండగా మావోయిస్టులు కాల్పులు జరిపారని ప్రతిస్పందనగా పోలీసులు కూడా కాల్పులు జరిపారన్నారు. మృతి చెందిన వారిని లల్లూ యాదవ్, రింకీ, రూబీ, భుయాన్‌గా గుర్తించారు. భుయాన్‌పై రూ. 5 లక్షల రివార్డు ఉందన్నారు.

ట్రక్, కారు ఢీ : నలుగురు మృతి

జైపూర్ : రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో జిల్లాలో ట్రక్, కారు ఢీకొని నలుగురు మృతి చెందారని సోమవారం పోలీసులు తెలిపారు. సూరత్‌ఘర్ నుంచి శ్రీగంగా నగర్‌కు వేగంగా వెళుతున్న కారు ట్రయిలర్ ట్రక్‌ను ఢీకొట్టిందని దర్యాప్తు అధికారి ధర్మేంద్రసింగ్ తెలిపారు. కారులోని రాకేష్ భిష్‌నోయి (22), దేవరాజ్ సహరాన్ (23) అమిత్ తరాద్ (27) దుర్మరణం చెంగా, ప్రవీణ్‌బిష్‌నోయ్ (22) ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని అధికారులు తెలిపారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు.

ముగ్గురిపై పీడీపీ వేటు

జమ్మూ : జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన ముగ్గురిపై పీపుల్స్ డెమాక్రటిక్ పార్టీ(పీడీపీ) వేటు వేసింది.పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా వారిపై వేటు వేస్తూ పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి వారిని తప్పిస్తున్నట్లు పీడీపీ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. ట్రాల్ ప్రాంతంలోని మనోజ్ అహ్మద్‌ఖాన్, మొహ్మద్ షఫీషా. పీర్ నిసార్ అహ్మద్‌లు వేటుకు గురయ్యారు.

ఉత్తరాఖండ్ బీజేపీ ఎమ్మెల్యే మృతి

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ బీజేపీ నాయకుడు, తరాలీ ఎమ్మెల్యే మంగన్ లాల్ షా (55) ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయనను ఫిబ్రవరి 19న హిమాలయ ఆసుపత్రికి తరలించగా, ఆదివారం ఉదయం 10గంటలకు ఆయన కన్నుమూశారన్నారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్, స్పీకర్ ప్రేమ్‌చంద్ అగర్వాల్, ఆరాష్ట్ర బీజేపీ చీఫ్ అజయ్‌భట్ ఆయన మృతికి సంతాపం తెలియ చెప్పారు.

చొరబాట్లను అడ్డుకున్న బీఎస్ఎఫ్

జమ్మూ : జమ్ముకాశ్మీర్‌లోని సాంబ జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దు వద్ద చొరబాట్లకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులను సరిహద్దు భద్రతాదళాలు తిప్పికొట్టాయి. సోమవారం ఉదయం 5 గంటలకు ఈ ఘటన జరిగిందని సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. సరిహద్దు వెంబడి కాల్పులు జరుపుతూ దేశంలోకి చొరబడుతున్న వారిపై బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింద న్నారు. ఈనెల 23న జరిగిన ఫ్లాగ్ మీటింగ్‌లో రెండు దేశాలు శాంతి భద్రతలు పరిరక్షిస్తామన్న విషయం తెలిసిందే.

వివాహ వేడుక కాల్పుల్లో బాలుడికి గాయాలు

ముజఫర్‌నగర్ : వివాహ వేడుకలో ఆర్భాటంగా జరిపిన కాల్పుల్లో ఒక బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోన్యా గ్రామంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ వేడుకతో బాలుడు రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయన్నారు. స్థానిక ఆసుపత్రిలో అతనికి చికిత్స జరుపుతున్నామని అతిని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు వెల్లడించారన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఢిల్లీ గవర్నర్‌ను కలసిన ఉద్యోగ సంఘాలు

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఉప ముఖ్యమంత్రి సిసోడియాపై చర్యలు చేపట్టాలని లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బాయిజాల్, పోలీస్ కమిషనర్ అమూల్య పట్నాయక్‌ను ఉద్యోగ సంఘాలు కలిశారు. కేజ్రీవాల్, సిసోడియాలు బహిరంగ క్షమాపణ లేఖ రాయాలని వారు డిమాండు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాజేంద్రపాల్ గౌతంల మధ్యవర్తిత్వాన్ని ఉద్యోగ సంఘాలు నిరసించాయి.

మోడీ విధానాలతో పెనుముప్పు



విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాలు భవిష్యత్తులో దేశానికి పెనుముప్పు తెచ్చిపెట్టేలా ఉన్నాయని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ జాతీయ కార్యదర్శి మర్రి రాఘవయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయడమే కాకుండా అవసరమైతే ఇండియాను తాకట్టు పెట్టేలా వారి చర్యలు కనపడుతున్నాయన్నారు. ముఖ్యంగా రైల్వేలో కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా ప్రతి కార్మికుడు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. విజయవాడ పర్యటనలో సోమవారం ఆయన రైల్వేస్టేషన్ వద్దనున్న రైల్వే ఆఫీసర్స్ రెస్ట్ హస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏడవ పే కమిషన్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రైల్వే కార్మికుల కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించిన ప్రభుత్వం రూ.18 వేలకు ఆమోదం తెలపడం దారుణమన్నారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దడం కోసం కేంద్ర ప్రభుత్వం వేసిన హైపవర్ కమిటీ నివేదిక కుడా పూర్తి న్యాయం చేయలేకపోయిందన్నారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రైలు పట్టాల స్థానంలో నూతన టెక్నాలజీతో కూడిన పట్టాలు, అధునిక సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైలు ఒక్కో సమయంలో సిగ్నల్ దాటితే డ్రైవర్లను ఉద్యోగం నుంచి తొలగించడం శోచనీయమన్నారు. రైల్వేలోని వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టులను భర్తీచేయకుండా ఖాళీలను కుదించడం తగదని, , అవుట్ సోర్సింగ్‌ను ప్రోత్సహిస్తే సహించేది లేదన్నారు. అన్ని పోస్టులను భర్తీ చేసి కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని డిమాండు చేశారు. సమావేశంలో సెంట్రల్ కమిటీ సభ్యులు వై.నాగేంద్ర బాబు, డివిజనల్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు, డివిజనల్ అధ్యక్షులు ఆకుల రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

బోధన మాటున లైంగిక వేధింపులు

విశాలాంధ్ర - ఒంగోలు : విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువులు కామపాఠాలు చెబుతూ లైంగిక వేధింపులకు పాల్పడటం కలకలం రేపుతోంది. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో బాధిత బాలికల ఆక్రందనలతో సోమవారం ఇద్దరు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేయడం ఆందోళన కలిగిస్తోంది. మరో అధ్యాపకుని కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఒంగోలులోని బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొలసాని సాయి శ్రీధర్ (58), పీఈటీ చెక్కా రామక్రిష్ణారావు (50) బాలికలను కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధిస్తున్నారు. రూములోకి రావాలని వేధించడంతో పిల్లలు వణకిపోయారు. తల్లిదండ్రులకు చెబితే చదువు మానిపిస్తారన్న భయంతో గత కొన్ని రోజులుగా మదనపడుతున్నారు. గురువుల చేష్టలు శృతి మించడంతో పిల్లలు తల్లిదండ్రులకు వివరించారు. దీంతో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంగోలు ఒకటో పట్టణ ఎస్సై ఇద్దరు ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్ల ప్రైవేటు కళాశాలలో మరో వికృత గురువు



బాపట్ల : ఆ అధ్యాపకుని వికృత చేష్టలను కళాశాల ఇంటర్ విద్యార్థినులు మౌనంగా భరించారు. కీచక అధ్యాపకుడి లైంగిక వేధింపులు శృతి మించడంతో సోమవారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. గుంటూరు జిల్లా బాపట్ల పట్టణ సీఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం స్థానిక సరస్వతీ జూనియర్ కళాశాలలో సుబ్బారావు పార్ట్‌టైం అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. తమను లైంగికంగా వేధిస్తున్నారంటూ విద్యార్థినులు పోలీసుకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థినిల నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. అధ్యాపకుడు ఎక్కడున్నా అరెస్టు చేస్తామని సీఐ వెల్లడించారు. అధ్యాపకుడు జీవీఎస్ సుబ్బారావును విధుల నుంచి తొలగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రకటించారు.

తాగునీటికి డబ్బుల్లేవ్ !

ఏ కార్యక్రమమైనా వ్యక్తిగత లాభం ఉంటే తప్ప అడుగు ముందుకు వేయరు మన ప్రజాప్రతినిధులు. లాభసాటి పనులకు నిధులన్నీ ఇష్టారాజ్యంగా ఖర్చుపెట్టేసి, ఇప్పుడు తాగునీటికి డబ్బుల్లేవంటూ చేతులెత్తేశారు. ముంచుకొస్తున్న వేసవి నేపథ్యంలో తాగునీటి సన్నద్ధత కోసం నిధుల కొరతతో అధికారులు తలలు పట్టుకున్నారు.



- చేతులెత్తేసిన పంచాయతీలు
- ముంచుకొస్తున్న వేసవి ముప్పు
- తలలు పట్టుకున్న అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : ప్రజావసరాలకంటే లాభాపేక్షకే మన ప్రజాప్రతినిధులు పెద్దపీట వేస్తున్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులన్నీ రోడ్లు, కాలువలు, ఇతర పనులకే ఖర్చుపెట్టేశారు. ఇప్పుడు పంచాయతీల ఖజానాలు నిండుకున్నాయి. వాస్తవానికి పంచాయతీల్లోని సాధారణ నిధుల్లో 50 శాతం వరకు తాగునీటి అవసరాలకు ఖర్చుపెట్టే అవకాశం ఉంది. 14వ ఆర్థిక సంఘ నిధుల్లోనూ తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నది ప్రభుత్వ నిబంధన. కానీ పంచాయతీ సర్పంచ్‌లకు ఇవేవీ పట్టడం లేదు. ఇటీవల కాలంలో 14వ ఆర్థిక సంఘం నిధులు భారీగా వచ్చిపడటంతో పంచాయతీలు పనులతో కళకళలాడాయి. భవిష్యత్ అవసరాలను గమనించకుండా వచ్చిన నిధులను వచ్చినట్టే ఖర్చుపెట్టేశారు. ముఖ్యంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని కన్వర్జెన్సీ పనులు, చంద్రన్నబాట తదితర పథకాలకు పంచాయతీల భాగస్వామ్యం తప్పనిసరి. రోడ్లు, కాలువల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులన్నీ వాటికే ఖర్చు చేసేశారు. పంచాయతీల్లో కాంట్రాక్టులన్నీ సర్పంచ్‌లే చేస్తుండటంతో తమకు డబ్బు మిగిలే పనులను హడావిడిగా చేసేసి నిధులు ఊడ్చేశారు. ఇప్పుడు నిధులకు కటకటలాడే పరిస్థితి ఏర్పడింది. వేసవిలో తాగునీటికి ఇబ్బంది రాకుండా ప్రతి సంవత్సరం క్రాష్ ప్రోగ్రాం పేరిట సన్నద్ధతా కార్యక్రమాన్ని గ్రామీణ నీటిసరఫరాశాఖ చేపడుతోంది. దీనిలో తాగునీటి పథకాలను, తాగునీటి బోర్లకు మరమ్మతులు చేసి సిద్ధం చేయడం, అవసరమైన విడిభాగాలను అందుబాటులో ఉంచుకోవడం కీలకం. ఈ ఏడాది కూడా ఇటువంటి కార్యక్రమానికి సిద్ధమయ్యారు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు. అయితే విజయనగరం జిల్లాలోని 920 పంచాయతీల్లో దాదాపు నిధులన్నీ అడుగంటిపోయాయి. బోర్ల మరమ్మతులకు, పథకాలకు నిధులు కేటాయించాలని పంచాయతీలను అధికారులు కోరుతున్నప్పటికీ తమ ఖజానాలు నిండుకున్నాయని వీరంతా చేతులెత్తేశారు. వాస్తవానికి ఏటా బోర్ల నిర్వహణకు ప్రభుత్వం రూ.600 కేటాయిస్తుంది. ఆ నిధులు కూడా పంచాయతీల వద్ద మిగల్లేదు. జిల్లాలో దాదాపు రూ.15 వేల తాగునీటి బోర్లు ఉండగా, వీటిలో సుమారు 500 బోర్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. అలాగే జిల్లాలోని చిన్నా పెద్దా కలిపి 1500 తాగునీటి పథకాల్లో 50 పథకాల వరకు చిన్నచిన్న పనులు చేయాల్సి ఉంది. నీటి అవసరాల మరమ్మతుల కోసం సుమారు రూ.30 లక్షలు వరకు కావాల్సి ఉంది. ఇప్పుడు ఆ నిధులు పంచాయతీల వద్ద లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గతానికి భిన్నంగా ప్రస్తుతం ప్రభుత్వ హయాంలో నిధులన్నీ నేరుగా పంచాయతీల ఖాతాల్లోకే వెళ్తున్నాయి. తాగునీటి పథకాలు, బోరుబావుల నిర్వహణ బాధ్యత కూడా పంచాయతీలదే. కానీ సర్పంచ్‌లు భవిష్యత్ అవసరాలను పట్టించుకోకుండా ఇష్టానుసారం నిధులను ఖర్చు చేసేయడంతో ఇప్పుడు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. దీని ప్రభావం వేసవిపై పడకుండా చేసేందుకు అధికారులు ప్రత్యామ్నాయమార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి అనివార్యమైంది.



జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కు 'వేమగిరి' స్టిక్ ఫర్ బ్లైండ్ ప్రాజెక్టు

విశాలాంధ్ర- పాయకరావుపేట : విశాఖ జిల్లా పాయకరావుపేట మండలంలోని కనొస్సా విద్యాసంస్థలో ఎనిమి దవ తరగతి చదువుతున్న వేమగిరి అభిషేక్ రూపొం దించిన స్టిక్ ఫర్ బ్లైండ్ ప్రాజెక్టు జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్-2018 కి ఎంపికైంది. విశాఖలో ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన స్టేట్ లెవెల్ ఎగ్జిబిషన్ అండ్ ప్రాజెక్టు కాంపిటీషన్ (ఇన్‌స్పైర్ మనక్-2 018)లో వేమగిరి ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇన్‌స్పైర్‌కి వచ్చిన వివిధ జిల్లాలకు చెందిన 30 ప్రాజెక్టుల్లో స్టిక్ ఫర్ బ్లైండ్ ప్రథమ స్థానంలో నిలవడంతో అభిషేక్‌ను డిపార్టుమెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రత్యేకంగా అభినందిస్తూ మె మెంటో, సర్టిఫికెట్ అందజేసింది. కనొస్సా విద్యాసంస్థ యాజమాన్యం సోమవారం అభిషేక్‌ను ఘనంగా సన్మానించింది. అభిషేక్ మాట్లా డుతూ కళ్లు లేనివారికి, చెవులు పనిచేయని వారి కోసం ఏదైనా చేయాలన్న ఆలో చనతో స్టిక్ ఫర్ బ్లైండ్‌ను తయారుచేశాన న్నారు.. కళ్లు లేనివారు ఉపయోగించే చేతి కర్రకు సెన్సార్, ఆర్డినో, బ్యాటరీ అమర్చడం ద్వారా చేతికర్ర సాయంతో నడుస్తు న్నపుడు మీటరు దూరంలో ఏ వస్తువైనా ఉంటే ఇందులో శబ్దం వస్తుందన్నారు. ఇదే చేతికర్ర కళ్లు, చెవులు పనిచేయనివారు కూడా ఉపయోగిం చుకునేలా వైబ్రేషన్ ఏర్పాటు చేసినట్టు వివరించాడు. కార్యక్రమంలో విద్యాసంస్థ కరస్పాండెంట్ మేరి మార్షల్, ప్రిన్సిపాల్ జయజరోమ్, గైడ్ టీచర్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.





మూడేళ్లుగా కల్తీపాలు విక్రయం

విశాలాంధ్ర-నరసరావుపేట : గుంటూరు జిల్లా నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో కల్తీ పాలు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమా డుతున్న కొంకల ప్రసన్నాంజ నేయరెడ్డిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ కె.నాగేశ్వరరావు పాల కల్తీ వివరాలను మీడియాకు వెల్లడించారు. గ్రామానికి చెందిన ప్రసన్నాంజనేయరెడ్డి మూడేళ్ళుగా పరిసర గ్రామాల్లో పాలు కొనుగోలు చేసి డెయిరీకి, వినియోగదారులకు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో నకిలీపాలు విక్రయిస్తూ ఎక్కువ ఆదాయం సమకూర్చుకోవాలను కున్నాడు. కొంత కాలంగా సంగం డెయిరీ చెందిన పాలపొడి ప్యాకెట్లు, సన్‌రైజ్ రిఫైన్డ్ ఆయిల్, యూరియా కలిపి నకిలీ పాలు తయారు చేస్తూ జెర్సీ డెయిరీకి, గృహ వినియోగదారులకు అమ్ముతున్నాడు. ఈ ప్రమాదకర మోసం సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ హనుమయ్య సిబ్బందితో కలిసి ఉప్పలపాడు గ్రామంలోని ప్రసన్నాంజనే యరెడ్డి ఇంటిపై దాడి చేశారు. అతని వద్ద నుంచి 38 సంగం డెయిరీ పాలపొడి ప్యాకెట్లు, 15 సన్‌ఫ్లవర్ ఆయిల్ ఖాళీ పాకెట్లు, 15 కేజీల సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు, ఒక మిక్సీ, కల్తీపాల క్యాను, 35 లీటర్ల ఖాళీ క్యాను, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ప్రసన్నాంజనేయరెడ్డిని కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు. సమావేశంలో రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ ఎవి.బ్రహ్మం, హనుమయ్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన ఎస్సీ కార్పొరేషన్ భవనం పైకప్పు



విశాలాంధ్ర-గుంటూరు వైద్యశాఖ : గుంటూరు నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ భవనం పైకప్పు సోమవారం కూలిపోయింది. దీంతో ఉద్యోగులు భయాందో ళనలతో ప్రాణాలను అరచేతిలో పట్టుకుని పరుగులు తీశారు. శ్లాబు కూలిన సమయంలో ప్రజలు, ఉద్యోగులు బయటకు పరుగులుతీయడంతో ప్రమాదం తప్పింది. ఉద్యోగులపైనా ప్రమాదం. ఇది 28 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో శిథిలావస్థకు చేరింది. ఇదే భవనంలో జిల్లా ఇంజనీరింగ్ కార్యాలయం కూడా ఉండటం గమనార్హం. జిల్లావ్యాప్తంగా కోట్ల రూపాయలతో భవనాల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంపై నిఘా లేకపోవడంతో రోజూ ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయానికి నిరంతరం పేదలు సంక్షేమ పథకాల కోసం ప్రతి రోజూ ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. చాలాసార్లు చిన్న చిన్న పెచ్చులు ఊడి పడుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని ఉద్యోగులు వాపోతున్నారు.

నాగార్జున వర్సిటీ పీజీసెట్ నోటిఫికేషన్ విడుదల



విశాలాంధ్ర- ఏఎన్‌యూ: ఆచార్య నాగా ర్జున విశ్వ విద్యాలయం పరిధిలో 2018-19 విద్యా సంవత్స రానికి సంబంధించి పీజీసెట్ నోటిఫికేషన్ సోమవారం విడు దలైంది. వర్సిటీ పరిపాలనభవన్‌లోని వీసీ కార్యాలయంలో నోటిఫికేషన్ బ్రోచర్‌ను వీసీ ఆచార్య ఎ.రాజేం ద్రప్రసాద్‌తోపాటు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.జాన్‌పాల్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్య నూర్‌భాషా అబ్దుల్, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పి బ్రహ్మాజీరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాల కంటే ముందుగా నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు పీజీ కోర్సులు, ఉపాధి అవకాశాలపై అవగాహన తరగతులు నిర్వ హించిన తర్వాత విడుదల చేసినట్లు వివరిం చారు. 2018-19 విద్యాసంవత్సరం నుంచి ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగంలో ఫోరెన్సిక్స్, ఫిజికల్ కెమిస్ట్రీ కోర్సులను, ఆర్కిటెక్చర్ కళాశాలలో పీజీ డిప్లొమా ఇన్ ఫైన్ ఆర్ట్స్ ఈవెనింగ్ కోర్సులను కొత్తగా ప్రవేశపెట్టామన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం రామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. అపరాద రుసుము లేకుండా మార్చి 20వ తేదీ వరకు, అపరాద రుసుము రూ.500తో ఏప్రియల్ 25వ తేదీ వరకు, తత్కాల్ రుసుము రూ.1000తో మే ఒకటో తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవ చ్చన్నారు.. ప్రవేశ పరీక్షలు మే 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ నుంచి లేదా ఫోన్ నంబర్లు 9440258822, 11, ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2346138/171లో సంప్ర దించవచ్చన్నారు.

రిజర్వాయర్ నిర్మించి కాలువలను వదిలేశారు

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య



విశాలాంధ్ర - పత్తికొండ రూరల్ : హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద మూడేళ్ళ క్రితం కొత్తపల్లె రిజర్వాయర్ నిర్మించిన అధికారులు కాలువలను మర్చిపోయారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. రామచంద్రయ్య అన్నారు. రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు పెద్దవీరన్నతో కలిసి సోమవారం ఆయన హంద్రీ నీవా ఎడమ కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ హంద్రీ నీవా కాలువకు రైతుల నుంచి 2,960 ఎకరాలను తీసుకున్న ప్రభుత్వం నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌నాటికి ఎడమ కాలువ రైతులకు నీరు అందించి ఆదుకోవాలన్నారు. రిజర్వాయర్ సమీపంలోని ఫారెస్టు మధ్యలో రెండు బ్రిడ్జిలకు పర్మిషన్ డ్రాయింగ్ కూడా ఇవ్వలేదని, ఎల్పీఆర్ కాలువకు అప్రూవల్ కూడా రాలేదన్నారు. దూదేకొండ, పోతిరాళ్ళ మధ్య ఇంకా బ్రిడ్జి పనులు మొదలు కాలేదన్నారు. పోతిరాళ్ళ, కనకదిన్నె మధ్య లింకు కాలువల పనులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్‌తోపాటు అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు నీరు అందించేలా చర్యలు తీసుకోకపోతే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసా హెబ్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు తిమ్మయ్య, నాయకులు నెట్టికంఠయ్య, పులికొండ, మల్లికార్జున, తిక్కస్వామి, ఈశ్వరప్ప, అంజనేయల తదితరులు పాల్గొన్నారు.

హోదా ఇవ్వకపోతే బీజేపీతో తెగతెంపులే..

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు విభజన చట్టం ప్రకారం నిధులు కేటాయించి సహకరించకపోతే బీజేపీతో టీడీపీ తెగతెంపులు చేసుకుంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం నిధులు ఇవ్వకపోయినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆగదు అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా ద్రోహం చేసిందన్నారు. బీజేపీతో ఇంకా మిత్ర పక్షంగానే ఉన్నామని, ముఖ్యమంత్రి ఆదేశాలతో మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ ఒక్కమాట కూడా అనడం లేదన్నారు. కేంద్రం సాధారణ నిధులతో పాటు ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని ఆశిస్తున్నామ న్నారు. అలా జరగకపోతే ఎడబాటు తప్పదన్నారు. రాజప్పతో పాటు ఎమ్మెల్యే సుజాత, ఎమ్మెల్సీ పాదువ శ్రీను, కామవరపుకోట ఎంపీపీ మద్దిపాటి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నాలుగు నెలల్లో 3 లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం

విశాలాంధ్ర-రాయదుర్గం : రాష్ట్రవ్యాప్తంగా పేదలకు నాలుగు నెలల్లో మూడు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర గ్రామీణ గృహ నిర్మాణ మరియు పౌరసంబంధాలశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణాలకు 15 రోజుల్లో శంకుస్థాపనల మహోత్స వాన్ని సోమవారం ఆయన కర్నూలు జిల్లా రాయదుర్గం పట్టణంలోని ఆంజినేయస్వామి ఆలయం వద్ద 268 పక్కా ఇళ్లకు ఆయన సామూహిక శంకుస్థాపన చేశారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ ఎండీ కాంతీలాల్‌దండే, ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, జెడీ చైర్మన్ పూలనాగరాజు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మర్కెట్‌యార్డులో జరిగిన సభలో శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ పనుల ఒత్తిడి లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తున్నా మన్నారు. 2022 నాటికి రాయదుర్గం నియోజ కవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. ఎంపి దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పని చేస్తున్నారన్నారు. కాంతీలాల్‌దండే మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో 10లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకున్న నేపథ్యంలో ఇప్పటికే నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశామ న్నారు. జూన్ 8వ తేదీ నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయనున్నామన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముదిగల్లు జ్యోతి, వైస్ చైర్మన్ వెంకటేశులు, రాష్ట్ర హౌసింగ్ సీఈ మల్లికార్జున, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ అధ్యాపకుల గోడు వినండి

శాసనమండలి సభ్యులు నాగేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ కళాశాలలో పనిచేస్తున్న తాత్కాలిక, పార్ట్‌టైం అధ్యాపకులను క్రమబద్ధీకరిం చడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వ రరావు, బాల సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ కళాశాల్లోని తాత్కాలిక, పార్ట్‌టైం అధ్యాపకులు తమ సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ సోమవారం విజయవాడలోని అలంకార్ ధర్నాచౌక్ వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. శాసనమండలి సభ్యులు నిరసన ప్రాంతానికి వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు విద్య ఒక వ్యాపారంగా మారిందన్నారు. అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులకు ఎయిడెడ్ కళాశాలలే కారణమన్నారు. ఈ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అధ్యాపకులకు సైతం నేటికీ నెలకు రూ.6,000 నుండి రూ.7,000 వేతనాలు ఇవ్వడం దారుణమన్నారు. వీరి వేతనాలు రోజు వారి కులీల కంటే తక్కువ అన్నారు. అది కుడా ఏడాదిలో 10 నెలలు మాత్రమే ఇవ్వడం శోచనీయ మన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కుడా లేకపోవడం దారుణమ న్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి కుటుంబాన్ని పోషించుకోలేక దుర్భర జీవితాలు గడుపుతున్న పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాల న్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకు లకు, వీరికి పని ఒక్కటే అయినా వారికి రూ. లక్షల్లో, వీరికి మాత్రం రూ.7 వేలు ఇవ్వడం ఆవేదన కలిగిస్తోందన్నారు ఎయిడెడ్ కళాశాలలో పనిచేస్తున్న తాత్కాలిక, పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను గుర్తించి జీవో నంబరు 35ను రద్దు చేసి 328 జీవోను 2018 వరకు పొడిగించి క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. ఈ నిరసనలో ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ కళాశాలల టెంపరరీ / పార్ట్‌టైం లెక్చర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు డి.అం బేద్కర్, టి.సుందర రామయ్య, ఎస్.శ్రీనివా సరావు, కార్యదర్శి డాక్టర్ పీవీబీ సంజీవరావు, సి.హెచ్. వి.రోహిణి కుసుమ, కోశాధికారి ఎమ్.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ముగ్గురు దుర్మరణం

మృతుల్లో నవ వధువు, మరో నలుగురికి తీవ్ర గాయాలు

శ్రీవారి దర్శనానికి వెళుతుండగా దుర్ఘటన

విశాలాంధ్ర - నారాయణవనం : చెన్నై-పుత్తూరు జాతీయ రహదారిలోని నారాయణవనం మండలంలోని తుంబూరు వద్ద సోమవారం ఉదయం 8.15 గంటల ప్రాంతంలో తిరుమలకు చెందిన ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలపాలైయ్యారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళుతూ ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగినట్లు తెలిసింది. తిరుమలకు చెందిన ఆర్టీసీ బస్సు మహేంద్ర జైలో కారును ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే నవవధువు దుర్మరణం చెందగా కారు డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. మృతి చెందిన వారిలో చెన్నైలోని కురవపేటైకు చెందిన నవ వధువు అముదవల్లి(25), విలుపురం జిల్లా దిండిదనంకు చెందిన కారు డ్రైవర్ కన్నదాసన్ (24) ఉన్నారు. వీరిద్దరి మృతదేహాలు కారు సీట్లోనే ఇరుక్కుపోయాయి. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న శకుంతల (60) అనే మహిళ సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరో నలుగురికి తీవ్ర గాయాలై తిరుపతి, చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారిలో ఇళందోవ సతీష్ (37), అతని మామ ఉలగనాథన్ (60), అత్త అరసి(50) తిరుమల ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎస్.రహంతుల్లా (39)లు ఉన్నారు. నవ వధువు మృతి చెందడం పట్ల స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన అముదవల్లి, ఇళంగోవ సతీష్‌లకు నెల రోజుల క్రితం వివాహం జరిగింది. వివాహం జరిగిన నెల రోజుల తరువాత తాళిబొట్టును తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చుకోవడం ఆనవాయితి. తన భర్తతోపాటు ఆమె తల్లిదండ్రులతో టాక్సీని అద్దెకు తీసుకొని తిరుమలకు బయలుదేరారు. సరిగ్గా నారాయణవనం మండలం తుంబూరు వద్దకు రాగానే తిరుమల నుంచి చెన్నైకి ప్రయాణికులతో వెళుతున్న ఏపీ 03 జెడ్ 0266 నెంబరు గల బస్సు ముందు వెళుతున్న వారిని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మహేంద్రజైలో కారును ఢీకొంది. స్థానిక పోలీసులు, ప్రజలు స్పందించి కారులో ఇరుక్కుపోయి మృతి చెందిన అముదవల్లి, కారు డ్రైవర్ మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన స్థలానికి చేరుకున్న పుత్తూరు సీఐ కొండయ్య, ఎస్ఐ దస్తగిరిలకు రోడ్డుకు ఇరువైపులా నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి గంట సమయం పట్టింది. ఎస్ఐ దస్తగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడేళ్లలో 13 వేల స్కాంలు

న్యూఢిల్లీ: విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, విక్రమ్ కొఠారి.. బ్యాంకులకు రుణ ఎగవేతదారులు. ప్రభుత్వరంగ బ్యాంకులు (పీఎస్‌యూ)కు వేల కోట్ల రూపాయలకు టోపీ పెట్టారు. వీరి కుంభకోణాలే బయటికొచ్చాయనుకుంటే, అసలు వేల సంఖ్యలో జరిగిన మోసాలు, స్కామ్‌లు కనుమరగై పోయాయి. 2014 నుంచి 2017 వరకు కేవలం మూడేళ్ల వ్యవధిలోనే భారత బ్యాంకుల్లో 12,787కు పైగా కుంభకోణాలను గుర్తించారు. కేవలం ప్రభుత్వ రంగ బ్యాంకులలోనే కాదు, ప్రైవేటు బ్యాంకుల్లోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకింగ్ రంగంలో 2016-17కు కేవలం ఏడాది కాలంలో కుంభకోణాల కారణంగా భారతీయ బ్యాంకులు రూ.16,789 కోట్లు నష్టపోయాయని పార్లమెంటుకు అనేక రాతపూర్వక ప్రత్యుత్తరాల్లో ప్రభుత్వం పేర్కొన్న తాజా గణాంకాలివి. 2014 నుంచి సగటున ఏడాదికి 4 వేల బ్యాంకు కుంభకోణాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఇంకా ఎక్కువ ఉన్నప్పటికీ అవి గుర్తించబడలేదు. అయితే బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న వాస్తవ మోసాల సంఖ్య ఇంకా నిర్ధారించబడలేదు. చాలా ఏళ్లుగా ఇదే పరిస్థితి. పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) వ్యవహారం మాదిరిగానే చాలా కేసుల దర్యాప్తు



అసంపూర్తిగానే ఉంది. పీఎన్‌బీ కుంభకోణంలో మాజీ బ్యాంకు అధికారితో కలిసి వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ రూ.11,400 కోట్లకు టోపీ పెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. 2011 నుంచి ఏడేళ్ల కాలానికిపైగా కొనసాగిన ఈ కుంభకోణం ఈ ఏడాది జనవరిలో బట్టబయలైంది. కానీ ఇది ఒక్కసారి బహిర్గతమైన తర్వాత ఈ అంశంపై ప్రజల మధ్య చర్చనీయాంశ కావడంతోపాటు వార్తా కథనాలూ ప్రచురితమవుతూ వస్తున్నాయి. ఇదిలాఉండగా కేవలం రెండు వారాల్లో మరో కుంభకోణం చోటుచేసుకుంది. ఒక వజ్రాల వ్యాపారి ద్వారా ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్‌కు రూ.390 కోట్ల నష్టం జరిగింది. ఇది వెలుగుచూసిన తర్వాత బంగారు ఆభరణాల ఎగుమతి సంస్థ ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కేసు నమోదు చేసింది. 2014-16 బ్యాంకు స్కామ్‌లు పెద్ద సంఖ్యలో చోటుచేసుకోగా, 2015-16లో తగ్గినప్పటికీ, 2016-17లో తిరిగి ఊపందుకున్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఈ మూడేళ్లలో మొత్తం 8,622 కుంభకోణాలు జరగగా, ప్రైవేటు బ్యాంకుల్లో 4,156గా చోటుచేసుకున్నాయి. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరించాలంటూ పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు డిమాండు చేశారు. అయితే దీనికి



పార్లమెంటు అనుకూలంగా లేదని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. దేశంలో అతిపెద్ద బ్యాంకుగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అత్యధిక మోసం కేసులు జరగగా, తర్వాతి స్థానంలో బ్యాంకు ఆఫ్ బరోడా ఉంది. ప్రైవేటు బ్యాంకుల వివరాలు మాత్రం అందుబాటులో లేవు. నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ)లకు అదనంగా ఈ బ్యాంకు మోసాలున్నాయి. 2017, సెప్టెంబరు చివరి నాటికి భారత్‌లో మొత్తం మొండి బకాయిలు రూ.9.46 లక్షల కోట్లుగా ఉన్నట్లు ఒక నివేదిక పేర్కొంటోంది. నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) ఖాతాల కారణంగానే ప్రభుత్వరంగ బ్యాంకులు ఎక్కువగా నష్టపోతున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యేల క్రిమినల్ కేసుల విచారణకు

- విజయవాడలో ప్రత్యేక కోర్టు
- జడ్జి సహా 29 పోస్టులు మంజూరు
- రూ.1.95 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని పార్లమెంట్ సభ్యులు (ఎంపీ), శాసనసభ్యుల (ఎమ్మెల్యే) క్రిమినల్ కేసుల విచారణ కోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జితోపాటు 29 పోస్టులను మంజూరు చేసింది. కోర్టు నిర్వహణ కోసం ప్రత్యేకంగా రూ.1.95 కోట్ల బడ్జెట్‌ను కూడా కేటాయించింది. ఈ మేరకు న్యాయ, శాసనసభ వ్యవహారాల కార్యదర్శి దుప్పల వెంకట రమణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల సత్వర విచారణ కోసమే ఈ కోర్టును ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ప్రత్యేక కోర్టుపై సుప్రీంకోర్టు గత ఏడాది డిసెంబర్ 14న ఉత్తర్వులను వెలువడించింది. దీనిపై కేంద్ర న్యాయ వ్యవహారాలశాఖ కార్యదర్శి, రాష్ట్ర హోంశాఖతో ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించారు. దీనిపై ఈ నెల6 న ఉమ్మడి హైకోర్టు కూడా ప్రత్యేక కోర్టుకు ఆమోదం తెలిపింది. అనంతరం రాజధాని విజయవాడ కేంద్రంగా ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసేందుకు వీలుగా నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది.గతంలో ఆయా జిల్లాల్లోనే ఇలాంటి కేసుల విచారణ జరిగేది. దీంతో ఏళ్ల తరబడి కేసులు తేలకపోవటంతో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇదిలావుండగా, ప్రత్యేక కోర్టుకు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పోస్టుతోపాటు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సూపరింటెండెంట్ (హెడ్ క్లర్క్), సూపరింటెండెంట్ (ట్రాన్స్‌లేటర్), సీనియర్ అసిస్టెంట్, గ్రేడ్ - 1 స్టెనో గ్రాఫర్, ఐదు జూనియర్ అసిస్టెంట్, రెండు టైపిస్ట్, మూడు ఫీల్డ్ అసిస్టెంట్స్ (అమీనా), ఎగ్జామినర్, కాపీయిస్ట్, ఐదు ప్రాసెస్ సర్వర్స్, ఒక రికార్డ్ అసిస్టెంట్, ఐదు ఆఫీసు సబార్డినేట్స్ (అటెండర్స్) పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. కోర్టులో పని చేసే వారి జీతభత్యాల కోసం ఏడాదికి రూ.1.90 కోట్లు, ఇతర ఖర్చుల కోసం రూ.3 లక్షలు, లైబ్రరీ పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలుకు మరో రూ.5 లక్షలను కూడా కేటాయించింది.

కోర్టు ఆదేశాలు బేఖాతరు







రాజధానికి ఇవ్వని పొలంలో రోడ్లు

సీఆర్‌డీఏ అధికారులకు, రైతుకు వాగ్వాదం

విశాలాంధ్ర-తుళ్ళూరు : ప్రపంచ స్థాయి రాజధాని అంటూ గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకుని రాజధాని రైతులపై దౌర్జన్యం కొనసాగిస్తోంది. భూములు ఇవ్వని రైతుల జోలికి వెళ్ళవద్దని న్యాయస్థానం తేల్చి చెప్పినప్పటికీ ప్రభుత్వం మాత్రం లెక్కచేయకుండా భూములు ఇవ్వని రైతుల పొలాల్లో ఏకపక్షంగా రోడ్ల నిర్మాణానికి పూనుకుంది. వివరాల ప్రకారం వెలగపూడికి చెందిన రైతు గద్దె మీరా ప్రసాద్ తాత్కాలిక సచివాలయం వెనుక వైపు 214/ఎ సర్వే నెంబరులో ఎకరం 14 సెంట్లు భూమి వుంది. అయితే దానిలో కొంత భాగంలో ముఖ్య మంత్రి బ్లాకు కట్టారు. సీఎం బ్లాకు వెనుకవైపు నిర్మిస్తున్న ఎన్9 రహదారి రాజధానికి భూమి ఇవ్వని రైతు మీరా ప్రసాద్ పొలంలో నుంచి నిర్మించదానికి గత 20 రోజులగా సీఆర్‌డీఏ అధికారులు ప్రయత్నిస్తున్నారు. విషయం తెలుసుక్ను ప్రసాద్ తాను లాండ్‌పూలింగ్‌లో భూమి ఇవ్వలేదనీ, నిర్మాణాలు జరగకుండా ఉన్నత న్యాయస్థానం నుంచి స్టే తెచ్చుకున్నానన్నారు. అయినా సీఆర్‌డీఏ అధికారులు పోలీసులతో వచ్చి రోడ్డు నిర్మాణం జరిపేది ఖాయం అంటూ బాధిత రైతును బట్టలు చించి మరీ పోలీసులు ఈడ్చేశారు. ఇదిలా ఉండగా సీఆర్‌డీఏ డిప్యూటి కలెక్టర్, తుళ్ళూరు పోలీసులకు మధ్య అరగంట పైగా హైడ్రామా నడిచింది. తొలుత కలెక్టర్ రోడ్డు పనిని తాను చేయమనలేదని, పోలీసులే చేయిస్తున్నారని అనడంతో పోలీసులు ఖంగుతిన్నారు. మళ్లీ మాటమార్చిన డిప్యూటీ కలెక్టర్ ముందు నిర్మాణం గురించి ఆదేశించినప్పటికీ ఆపేయమని కూడా చెప్పామన్నారు. దీంతో రైతులకు అండగా వచ్చిన న్యాయవాదులు, వామపక్షాలు, వైసీపీ నాయకులు, పోలీసులు ప్రభుత్వ అధికారుల తీరును ఖండించారు. చివరకు కలెక్టర్ వెనక్కు తగ్గి రోడ్డునిర్మాణాన్ని ఆపమని ఆదేశాలిచ్చారు. సీఆర్‌డీఏ ల్యాండ్ డైరెక్టర్ చెన్నకేశవులకు బాధిత రైతు వినతి : ఈ ఘటనపై బాధిత రైతు గద్దె మీరా ప్రసాద్ సీఆర్‌డీఏ ల్యాండ్ డైరెక్టర్ చెన్నకేశవులకు ఫిర్యాదు చేశారు.దీనిపై తక్షణమే స్పందించి పోలీసులు, సీఆర్‌డీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రైతుపై దాడి అమానుషం : పార్థసారథి

రాజధాని నిర్మాణానికి భూమి ఇవ్వడానికి నిరాకరించిన రైతుపై తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు, పోలీసులు దాడి చేయడం అమానుషమని వైసీపీ అధికార ప్రతినిధి పార్థసారథి నిరసించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత ప్రజలతో పాటు ప్రభుత్వంపై కూడా ఉందనే సంగతి తెలియదా అని నిలదీశారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్థసారథి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజధాని పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల వద్ద నుంచి వేల ఎకరాలు భూములు తీసుకుని ఇంతవరకూ ఎలాంటి నిర్మాణాలు చేయలేదని ఆయన విమర్శించారు. రాజధాని నిర్మాణం కోసం చంద్రబాబు సేకరించిన 33 వేల ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిల్లో 2, 3 వందల ఎకరాల్లో మాత్రమే తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ కట్టారన్నారు. మిగిలిన భూముల్లో టీడీపీ ఎమ్మెల్యే లారీల్లో తన గేదెలను తీసుకువచ్చి మేపుకుంటున్నారని విమర్శించారు. కోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన పోలీసులు, నిర్మాణాలు చేపట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు.

4న మన్యం బంద్



విజయవంతానికి గిరిజన జేఏసీ నేత ఆలుగు పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై మార్చి 4న మన్యం బంద్‌కు పిలుపునిచ్చినట్టు గిరిజన జేఏసీ నాయకులు, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆలుగు వెంకటరావు తెలిపారు.గిరిజన సంఘం, అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘాలు తమ సమస్యలపై అనేక పోరాటాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో బంద్‌ను నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. విజయనగరంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజనులపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల చట్టాలను, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ తీర్మానాలను చేస్తూ ఆదివాసీల అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆలుగు ఆగ్రహం వ్యక్తంచేశారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటుచేయాలని, బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాన్ని పార్లమెంట్‌లో అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని, ఎస్టీ కమిషన్, జీసీసీ పాలక మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండు చేశారు. నిర్వాసితుల పనులు పూర్తయ్యేవరకు పోలవరం పనులను నిలుపుదల చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీలను ఇవ్వాలని డిమాండు చేస్తూ మన్యం బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వెంటనే చేపట్టాలని, గిరిజన, ఆదివాసీ తెగలంతా బంద్‌లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్

భవన నిర్మాణానికి రూ.39.77 కోట్లు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో నిర్మించిన పోలీస్ హెడ్ క్వార్టర్స్ జీ ప్లస్ ఫోర్ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.39.77 కోట్లను మంజూరు చేసింది. సవరించిన అంచనాల మేరకు ఈ మొత్తాన్ని మంజూరు చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ సోమవారం ఉత్తర్వులిచ్చారు. అలాగే ఆక్టోపస్‌కు రూ.1.54 కోట్ల రీ ఎంబర్స్ చేసేందుకు కూడా నిధులు మంజూరయ్యాయి.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ

కాంగ్రెస్ కాగడాల ప్రదర్శన



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని నినదిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి విజయవాడలో కాగాడాల నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. ఏపిసిసి రాష్ట్ర కార్యాలయం నుంచి కాగడాలు చేబూని ప్రత్యేక హోదా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లెనిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రధాని మోడీ ఏపీ ప్రజలను మోసం చేశారన్నారు. ప్రతి అంశంలో నాకు ఎంత, నీకు ఎంత అని పంచుకునే దానిలోనే బీజేపీ, టీడీపీలు పోటీపడుతున్నాయని, పార్లమెంట్ లోపలా, బైటా మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఏపీ ప్రజల గోడు వారికి పట్టడంలేదు అన్నారు. పార్లమెంట్‌లో నాటి ప్రధాని ఇచ్చిన హామీని, అసెంబ్లీలో చేసిన తీర్మానాలను నాలుగు సంవత్సరాలుగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.త్వరలోనే ప్రజల కోరిక మేరకు టీడీపీ, బీజేపీ పార్టీలను రద్దు చేయాలని ఎలక్షన్ కమిషన్ కు ఢిల్లీలో ఫిర్యాదు చేస్తామన్నారు. ఏపికి ప్రత్యేక హోదా ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ, నాలుగు సంవత్సరాలుగా పోరాడుతుంది కాంగ్రెస్ పార్టీ అని, రేపు సాధించేది కూడా కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. ఇందుకోసం తాము చేసే పోరాటానికి అందరూ కలిసి రావాలని పిలుపు నిచ్చారు.ర్యాలీలో ఏపీసీసీ కార్యదర్శి పొనుగుపాటి నాంచరయ్య, మస్తాన్ వల్లీ మాజీ ఎమ్మెల్యే, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ వి.గురునాధం, ప్రధాన కార్యదర్శులు మీసాల రాజేశ్వరరావు, నరహరి శెట్టి నరసింహారావు, రాజీవ్ రతన్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎంసెట్ షెడ్యూల్ విడుదల


విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ఇంజినీరింగ్, వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్ పరీక్ష షెడ్యూల్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి ప్రకటించారు. తొలిసారిగా ఆన్‌లైన్‌లో మూడు భాషల్లో ఎంసెట్ నిర్వహణ ఉంటుందన్నారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. నిమిషం నిబంధన అన్నది విద్యార్థులను ఇబ్బంది పెట్టడానికి కాదని, క్రమశిక్షణ కోసమని తెలిపారు. పరీక్ష 10 గంటలకు అయితే విద్యార్థులు 9 గంటలకే అనుకుని సన్నద్ధమైతే ఎలాంటి సమస్యలు ఎదురుకావన్నారు. పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చి...అధికారులు అనుమతించలేదని బాధపడితే ఏమీ చేయలేమని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో విద్యార్థులకు మీడియా అవగాహన కల్పించాలని సూచించారు. ఎంసెట్ పరీక్షను తొలిసారి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఎంసెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 4 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

రియల్‌టైమ్ గవర్నెన్స్‌కు జపాన్, భూటాన్ ప్రశంస

విశాలాంధ్ర-అమరావతి : రియల్ టైమ్ గవర్నెన్స్‌లో కొన్ని అంశాలు జపాన్‌ను మించి నిర్వహిస్తున్నారని జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖ ఉప మంత్రి సాయిసకు కిరాకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్‌ను సోమవారం ఆయన నేతృత్వంలోని జపాన్ ప్రతినిధుల బృందం సందర్శించింది. రియల్ టైమ్ గవర్నెన్స్ డైరెక్టర్ బాలాజీ ఆదివిష్ణు ఈ బృందానికి స్వాగతం పలికారు. రియల్ టైమ్ గవర్నెన్స్ పనితీరు గురించి వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఆరంభించిన రియల్ టైమ్ గవర్నెన్స్ ఇప్పటికే ప్రజాదరణ పొందుతోందన్నారు. సమర్థపాలన అందించడానికి టెక్నాలజీని ప్రభుత్వం రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. పరిష్కారవేదిక 1100 కాల్ సెంటర్ ద్వారా ప్రజల నుంచి రోజూ కొన్ని వేల ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరిస్తున్నామని వివరించారు. ఇప్పటికే 1.40 కోట్ల ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. సర్వైలెన్స్ కెమెరాల ద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతలను పర్యవేక్షించడమే కాకుండా, స్వచ్ఛకార్యక్రమాలను, ఇతరత్రా బహుళ ప్రయోజనాలను సాధిస్తున్నామన్నారు.

రియల్ టైమ్ గవర్నెన్స్ పనితీరును పరిశీలించిన అనంతరం జపాన్ మంత్రి సాయిసకు కిరాకి మాట్లాడుతూ రియల్ టైమ్ గవర్నెన్స్ అద్భుతంగా ఉందని వ్యాఖ్యానించారు. డేటా విశ్లేషణ, దాన్ని భద్రపరచడంలో మీరు తీసుకుంటున్న జాగ్రత్తలు మాకు ఎంతో సంతృప్తి కలిగించిందన్నారు. రియల్ టైమ్‌లో ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని, ఇలాంటి వినూత్న ఆలోచనలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి అభినందనలు తెలుపుతున్నామన్నారు.

భూటాన్ అభినందనలు : రియల్ టైమ్ గవర్నెన్స్ పనితీరుకు భూటాన్ బృందం ప్రశంసలు అందించింది. సోమవారం భూటాన్ దేశ ఐటీ శాఖ మంత్రి దీననాథ్ ధుంగ్యేల్ నేతృత్వంలో ఎనిమిది మందితో కూడిన బృందం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని సందర్శించింది. వారికి ఆర్టీజీఎస్ డైరెక్టర్ ఆర్‌కె.అనంతకృష్ణన్ స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరును వివరించారు. డ్రోన్ల సాయంతో ప్రజలకు రియల్ టైమ్‌లో వివిధ సేవలు అందిస్తున్నామన్నారు. ధుంగ్యేల్ మాట్లాడుతూ రియల్ టైమ్ గవర్నెన్స్ చాలా అద్భుతంగా పనిచేస్తోందన్నారు. పరిపాలనలో ఏపీ ప్రభుత్వం టెక్నాలజీని వినియోగించుకుంటున్న తీరు అందరికీ ఆదర్శప్రాయంగా ఉందన్నారు. భూటాన్ బృందంలో జిగ్మే థినైల్ నామ్‌గైల్, డైరెక్టర్ జనరల్, భూటాన్ ఐటీ శాఖ, పెంబా వాంగ్‌చుక్, సీనియల్ ఐసీటీ ఆఫీసర్, సోనమ్ దోర్జీ, లీగల్ ఆఫీసర్, భూటాన్, విక్రమ్ ఖోహేటీ, జయ సూర్య, ఈ-ప్రగతి ప్రతినిధులు పాల్గొన్నారు.




రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న భూటాన్ ఐటీ మంత్రి దీననాథ్ ధుంగ్యేల్. చిత్రంలో ఆర్టీజీఎస్ డైరెక్టర్ అనంతకృష్ణన్ తదితరులు

ముగిసిన పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు

369 ఒప్పందాలు, 7,17,463 ఉద్యోగాలు

విశాలాంధ్ర- విశాఖపట్నం : మూడు రోజులు పాటు విశాఖలో సాగిన భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు సోమవారం అట్టహాసంగా ముగిసింది. పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా సీఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ప్రభుత్వం ఆశించిన స్థాయిలోనే పెట్టుబడులు వచ్చాయి. తొలిరోజు రూ.41,176 కోట్ల పెట్టుబడులు, 80ఎంఓయులు జరిగాయి. రెండవరోజు రూ. 1,77,638కోట్ల పెట్టుబడులు, 285 ఒప్పందాలు జరిగాయి. చివరి రోజు చివరి రోజు రూ.2,20,951కోట్ల పెట్టుబడులు, 369 ఒప్పందాలు, 7,17,463 ఉద్యోగాలు రానున్నాయి. మొత్తం మూడు రోజుల్లో రూ.4,39,765కోట్లు పెట్టుబడులు, 734 ఒప్పందాలు, 11,02,125 ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మొదటిరోజు ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు రోజులు విశాఖలోనే ఉండి పలు ఒప్పందాల్లో నేరుగా పాల్గొన్నారు. చివరి రోజు గవర్నర్ నరసింహన్ హాజరయ్యారు. ఈమూడు రోజుల సదస్సులో 45 దేశాలకు చెందిన 4,253 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో విదేశీ



ప్రతినిధులు 250మంది ఉన్నారు. ప్రతి రోజు రెండు సెషన్లుగా కార్యక్రమాలు నిర్వహించారు. సన్‌రైజ్ ఏపి పేరిట ప్లీనరీ సెషన్స్ జరిగాయి. టెక్నాలజీ ఫర్ టుమారో, సోషల్ ఐకాన్ ఇన్‌ట్రాక్షన్ రవిశంకర్‌జీతో జరిగింది. సౌత్ కొరియా, జపాన్, సింగపూర్ దేశాలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఆటోమోటీవ్, టూరిజం, ఏరోస్పెస్, రక్షణ రంగం, టెక్స్‌టైల్స్ లలో ఒప్పందాలు జరిగాయి. మెడికల్ పరికరాలు, ఎనర్జీ, ఆహార ఉత్పత్తి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కూడా పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 15 విదేశీ మంత్రులు, ప్రతినిధులతో నేరుగా మాట్లాడారు. ఈసందర్భంగా లూలూ సంస్థ నిర్మించనున్న ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు శంకుస్థాపన చేసారు. ఇందులో ఐదు నక్షత్రాల హొటల్, షాపింగ్‌మాల్ రానున్నాయి. ఈకార్యక్రమంలో భాగంగా అమరావతిలో నిర్మించనున్న భవనాల నమూనాలు, ఏపి నిర్వహిస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్ విధానాన్ని ప్రదర్శించారు. ఇక ఒప్పందాలు విషయానికి వస్తే పరిశ్రమల రంగంలో 129 ఒప్పందాలు, రూ. 58,337కోట్ల ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా 1,30,682 ఉద్యోగాలు రానున్నాయి. ఈడీబీ విభాగంలో 144 ఒప్పందాలకు గాను రూ. 1,51,400కోట్ల పెట్టుబడులు రాగా 1,52,496 ఉద్యోగాలు కల్పించనున్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో 75 ఒప్పందాలు, రూ.30,050కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీని ద్వారా 1.30.343 ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. టూరిజం రంగంలో 49 ఒప్పందాలు, రూ. 5,002కోట్ల పెట్టుబడులు, 30338 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఫుడ్ ప్రెసెసింగ్ రంగంలో అత్యధికంగా 165 ఒప్పందాలు జరగగా, రూ. 3,100కోట్ల పెట్టుబడులు, 47వేల ఉద్యోగాలు రానున్నాయి. దేశవిదేశాల్లోని ప్రముఖ కంపెనీలన్నీ ఈపెట్టుబడుల సదస్సులో భాగస్వాములయ్యారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హర్షం వ్యక్తం చేసారు.

భారత్ బాక్సింగ్

వికాసం



సోఫియా(బల్గేరియా): స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ వికాస్ క్రిషన్ చరిత్ర సృష్టించాడు. ఈ టోర్నమెంట్‌లో స్వర్ణం గెలిచిన తర్వాత బెస్ట్ బాక్సర్ అవార్డును వికాస్ సొంతం చేసుకున్నాడు. తద్వారా ఈ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బెస్ట్ బాక్సర్ అవార్డును గెలుచుకున్న మొదటి భారత బాక్సర్‌గా వికాస్ నిలిచాడు. సోఫియా వేదికగా 75 కేజీల మిడిల్ వెయిట్ విభాగంలో జరిగిన తుది పోరులో వికాస్ విజయం సాధించి పసిడిని సొంతం చేసుకున్నాడు. అదే సమయంలో ఈ టోర్నమెంట్‌లో అత్యుత్తమ బాక్సర్ అవార్డును సైతం సొంతం చేసుకుని కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. ఫైనల్ పోరులో వరల్డ్ చాంపియన్స్ కాంస్య పతక విజేత ట్రో ఇస్లే(అమెరికా)పై గెలిచి స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. ఫలితంగా గతేడాది ఆసియా చాంపియన్‌షిప్స్‌లో కాంస్య పతకం సాధించిన తర్వాత తొలి పతకాన్ని అందుకున్నాడు. మరొకవైపు మరో భారత బాక్సర్ అమిత్ పంగల్ కూడా పసిడిని ఒడిసి పట్టుకున్నాడు. 49 కేజీల విభాగంలో అమిత్ స్వర్ణాన్ని సాధించాడు. ఇక మహిళల తుది పోరులో మేరీకోమ్ రజతంతో సరిపెట్టుకుంది. దాంతో ఇక్కడ వరుసగా మూడో స్వర్ణ పతకాన్ని సాధించాలను కున్న మేరీకోమ్‌కు నిరాశే ఎదు రైంది. 48 కేజీల విభాగంలో బల్గేరియాకు చెందిన సెవదా అసెనోవా చేతిలో మేరీకోమ్ ఓటమి పాలై రజత పతకానికే పరిమితమ య్యారు. స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్న మెంట్‌లో భారత జట్టు 11 పతకాలతో పోరును ముగించింది. ఇందులో ఐదు పతకాలు పురుషులు సాధించగా, ఆరు పతకాల్ని మహిళలు సొంతం చేసుకున్నారు. ఇక్కడ రెండు స్వర్ణ పతకాలు, మూడు రజత పతకాలు, ఆరు కాంస్య పతకాలు భారత్ ఖాతాలో చేరడం విశేషం.



ధోనీ కెరీర్‌పై

నీలినీడలు..?

ఒప్పించి తప్పించారా..? లేక అశ్విన్, జడేజాల మాదిరేనా..?

వన్డే, టీ20ల్లో ఇప్పటికీ స్పిన్ ద్వయానికి నో ఎంట్రీ

ముంబై: వచ్చే నెల్లో శ్రీలంకలో జరుగనున్న ముక్కోణపు టీ 20 సిరీస్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టును ఆదివారం ప్రకటించారు. ముందుగా ఊహించినట్లుగానే భారత రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లికి ట్రై సిరీస్‌లో విశ్రాంతి కల్పించారు. అదే సమయంలో ఎంఎస్ ధోనిని కూడా లంక పర్యటనకు దూరం పెట్టారు. జట్టును ఎంపిక చేసే క్రమంలో 15 మంది సభ్యులతో కూడిన జట్టును వెల్లడించిన టీమిండియా సెలక్టర్లు.. కోహ్లి, ధోని, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బూమ్రా, భువనేశ్వర్, కుల్దీప్ యాదవ్‌లకు విశ్రాంతి నిచ్చారు. అయితే ధోనికి విశ్రాంతి ఇవ్వడంపైనే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సఫారీ గడ్డపై మూడు టెస్టులు, ఆరు వన్డేలు, మూడు టీ 20లు ఆడిన భారత సీనియర్ క్రికెటర్లు అలసిపోయారని.. రానున్న ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో వారికి విశ్రాంతి ఇచ్చామని సెలక్టర్లు చెబుతున్నారు. మరి ఇక్కడ ధోనికి ఎందుకు విశ్రాంతి ఇచ్చారనేది ఆసక్తికరంగా మారింది. ఎప్పుడో టెస్టులకు గుడ్ బై చెప్పిన ధోని.. ఇప్పుడు కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్ మాత్రమే ఆడుతున్నాడు. మరి అటువంటప్పుడు సెలక్టర్లు చెప్పిన 'అలసిపోవడం' ధోనికి వర్తించదు కదా..ఒకవేళ సఫారీ పర్యటనలో ధోని అలసిపోయాడనుకుంటే, మూడు ఫార్మాట్లలోనూ ఆడిన ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌ల పరిస్థితి ఏంటి.. వీరు కీలక క్రికెటర్లు కాదా? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. ఇంకో కోణంలో ధోనినే విశ్రాంతి కావాలని కోరాడు.. అని సెలక్టర్లు చెబుతున్నారు. అంటే యువ క్రికెటర్లకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ధోని సూచాయగా విశ్రాంతి అడిగి ఉండవచ్చు..లేక అతన్ని ఒప్పించి ఉండవచ్చు. గతంలో అంటే ఏడాది క్రితం ఇదే తరహాలో స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, జడేజాకు విశ్రాంతి ఇచ్చామన్నారు. ఆపై వాళ్లని వన్డే, టీ20 జట్టు నుంచి తప్పించారు. ఇప్పటికీ ఈ స్పిన్ జోడి పరిమిత ఓవర్ల జట్టులోకి పునరాగమనం చేయడానికి అపసోపాలు పడుతోంది. ఇందుకు కారణం కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్‌లు రాణించడమే. ఇది మంచి పరిణామమే. జట్టులో పోటీతత్వాన్ని ఎవరూ కాదనరు. ఇప్పుడు ధోనీ స్థానంలో దినేశ్ కార్తీక్, రిషబ్ పంత్ రూపంలో ఇద్దరు వికెట్ కీపర్లను జట్టులోకి తీసుకున్నారు. ఒకవేళ ఈ టోర్నీలో ఎవరైనా మెరుగ్గా రాణిస్తే..? వచ్చే వరల్డ్ కప్‌కు ప్రపంచకప్‌కు ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఉపయోగపడతాడనే ఆలోచనలో సెలక్టర్లు ఉన్నారేమో..? ధోని గతంలో మాదిరి ఆడలేకపోతున్నాడనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్న తరుణంలో సెలక్టర్లు వికెట్ కీపర్ వేటలో పడ్డారన్న వాదన తాజా సెలక్షన్‌కు అద్దం పడుతోంది. గత ఏడాది ఆరంభంలోనూ వన్డే, టీ20 కెప్టెన్సీలను ధోనినే స్వతహాగా వదులుకున్నాడని చెప్పారు. అయితే చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ ప్రత్యేకంగా కలిసి ధోనితో మాట్లాడిన తర్వాతే పరిమిత ఓవర్ల కెప్టెన్సీకి గుడ్ బై చెప్పాడు. ధోనిని పొమ్మనలేక పొగబెట్టారనే అప్పట్లో వార్తలు హల్‌చల్ చేశాయి. మరి ఇప్పుడు కూడా ధోని ఇలానే ఒప్పించి.. తనే విశ్రాంతి తీసుకున్నాడని ప్రచారం చేస్తున్నారా? అనేది మాత్రం వారికే తెలియాలి.



కెరీర్‌కు మోర్కెల్ గుడ్‌బై..!

ముంబై: దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ మోర్నీ మోర్కెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నాడు. త్వరలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే సిరీసే తనకు ఆఖరిదని, ఆ తరువాత అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెబుతున్నట్లు మోర్కెల్ ప్రకటించాడు. బిజీ షెడ్యూల్ కారణంగా కుటుంబం కోసం సమయాన్ని కేటాయించలేకపోతున్నానని.. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించాడు. 'ఇది నాకు కచ్చితంగా కఠిన నిర్ణయమే.. కానీ, కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ఇదే సరైన సమయం అన్పించింది. తీరికలేని షెడ్యూల్‌తో మాపై ఒత్తిడి పడుతోంది. కుటుంబంతో కలిసి గడిపేందుకు ఇకపై నాకు సమయం దొరుకుతుంది.' అని మోర్కెల్ చెప్పాడు. ఇన్నాళ్లూ తనకు అండగా నిలిచిన క్రికెట్ సహచరులు, కుటుంబసభ్యులకు మోర్కెల్ కృతజ్ఞతలు తెలిపాడు. 2006లో భారత్‌తో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌తో మోర్కెల్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఆరంగేట్రం చేశాడు. కెరీర్‌లో 83 టెస్ట్‌లు, 117 వన్డేలు, 44 టీ20, 70 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన మోర్కెల్.. టెస్టుల్లో 294, వన్డేల్లో 188, టీ20ల్లో 47, ఐపీఎల్‌లో 77 వికెట్లు తీశాడు.

టాప్-30లో చోటే లక్ష్యం : కశ్యప్

న్యూఢిల్లీ: మూడేళ్ల అనంతరం అంతర్జాతీయ టైటిల్ సాధించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పారుపల్లి కశ్యప్ తన జోరు కొనసాగిస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆస్ట్రియా ఓపెన్ టోర్నీ చేజిక్కించుకున్న అతను మాట్లాడుతూ... 'చాలా రోజుల తర్వాత ట్రోఫీ నెగ్గడం ఆనందంగా ఉంది. ఈ విజయం వెనుక కోచ్ గోపీచంద్, శిక్షణ సిబ్బంది కృషి ఎంతో ఉంది. ఈ విజయాలను ఇలాగే కొనసాగిస్తూ... టాప్-30లో చోటు సంపాదించడమే నా లక్ష్యం' అని తెలిపాడు. ప్రపంచ 44వ ర్యాంక్‌లో ఉన్న కశ్యప్ ఏప్రిల్‌లో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించలేదు. దీనిపై అతను స్పందిస్తూ.. 'గత ఏడాది కాలంగా శ్రీకాంత్, ప్రణయ్ అద్భుతంగా రాణిస్తున్నారు. వారు కామన్వెల్త్ గేమ్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి అర్హులు. వారు పతకాలతో తిరిగొస్తారని భావిస్తున్నాను' అని తెలిపాడు.



'పంజాబ్' కెప్టెన్‌గా 'స్పిన్ మాంత్రికుడు'

న్యూఢిల్లీ: రాబోవు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) సీజన్‌లో కింగ్స్ పంజాబ్ కెప్టెన్‌గా రవిచంద్రన్ అశ్విన్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు అశ్విన్‌కు కెప్టెన్‌గా కీలక బాధ్యతలు అప్పచెబుతున్న విషయాన్ని కింగ్స్ పంజాబ్ యాజమాన్యం సోమవారం ప్రకటించింది. గతంలో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడిన అశ్విన్‌ను..ఈ ఏడాది ఐపీఎల్ వేలంలో కింగ్స్ దక్కించుకుంది. అశ్విన్‌కు రూ. 7.60 కోట్లు చెల్లించి కొనుగోలు చేసిన కింగ్స్.. అతనిపై నమ్మకం ఉంచుతూ సారథ్య బాధ్యతల్ని కూడా అప్పచెప్పింది. అంతకుముందు కింగ్స్ పంజాబ్ కెప్టెన్‌గా గ్లెన్ మ్యాక్స్‌వెల్ వ్యవహరించిన సంగతి తెలిసిందే. అయితే ఈసారి జరిగిన వేలంలో మ్యాక్స్‌వెల్‌ను ఢిల్లీ డేర్‌డెవిల్స్ కొనుగోలు చేసింది. దాంతో జట్టుకు ఎవర్ని కెప్టెన్‌గా ఎంపిక చేయాలనే దానిపై పలు తర్జన భర్జనల తర్వాత అశ్విన్‌కు ఆ బాధ్యతలు అప్పచెబుతూ కింగ్స్ పంజాబ్ ఫ్రాంచైజీ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ ఐపీఎల్లో ఏ జట్టుకు కెప్టెన్‌గా చేయని అశ్విన్.. తొలిసారి సరికొత్త బాధ్యతలను స్వీకరించబోతున్నాడు. దీనిపై అశ్విన్ మాట్లాడుతూ.. తనను కెప్టెన్‌గా ఎంపిక చేసి కొత్త బాధ్యతల్ని అప్పచెప్పడం ఒక గౌరవంగా భావిస్తున్నానని తెలిపాడు. ఇదొక ఛాలెంజ్ తీసుకుని జట్టును ముందుకు తీసుకెళతానని ఆశాభావం వ్యక్తం చేశాడు.

నిమిషానికో ట్విస్ట్..

'బోనీ' చుట్టూ ఉచ్చు..?

ముంబై: లెజండరీ నటి, లేడీ సూపర్‌స్టార్ శ్రీదేవి హఠాన్మరణంపై దుబాయ్ ఫోరెన్సిక్ రిపోర్టులో సంచలన అంశాలు బయటపడ్డ సంగతి తెలిసిందే. అయితే మరణం మొదలుకుని ఫోరెన్సిక్ రిపోర్టు వరకు అన్ని ట్విస్ట్‌లే. నిమిషానికో ట్విస్ట్ వెలుగుచూస్తుండటంతో కోట్లాది మంది అభిమానులు, యావత్ సినీ ప్రపంచం ఏది నమ్మాలో? ఏది నమ్మకూడదో? తెలియక తలలు కొట్టుకుంటున్నారు.

ఆ పదం ఎందుకు వాడతారు?

డెత్ సర్టిఫికెట్‌లో అక్కడి అధికారులు వాడిన 'యాక్సిడెంటల్ డ్రౌనింగ్' పదం మరింత అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఇలా నీటిలో మునిగిపోయి చనిపోయిన కేసు వచ్చినప్పుడు డ్రౌనింగ్ అనే పదం వాడవచ్చు. అలాకాకుండా విచారణ ఇంకా జరుగుతుండగానే 'యాక్సిడెంటల్ డ్రౌనింగ్' అనే పదం వాడటంతో క్లియరెన్స్ ఇచ్చినట్లవుతుంది. అయితే ఇలా ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందనే దానిపై కూడా అనుమానాలున్నాయి. ఎవరైనా నీటిలో మునిగి చనిపోయినప్పుడు వారి ఊపిరితిత్తుల్లో నీటి శాతం ఎంత ఉన్నది? ఫోరెన్సిక్ నివేదిక ద్వారా తెలుసుకునే అవకాశముంది. అదేవిధంగా కెమికల్, విస్రా (పెద్దపేగులో ఉండే పదార్థం) అనే పరీక్షలకు పంపిస్తారు. కడుపులో ఉన్నటువంటి పదార్థాలేంటి? ఊపిరితిత్తుల్లో ఎంతమేరకు నీరుంది? మరణించినవారు ఆల్కాహాల్ ఏమైనా తీసుకున్నారా? కెమికల్ కంటెట్స్ ఏమున్నాయి? అనే విషయాలు నిర్ధారణ చేసుకునే అవకాశాలున్నాయి. అవన్నీ పూర్తి చేసిన తర్వాతే పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అలాంటివేమీ కాకుండా డెత్ సర్టిఫికెట్లో మాత్రం 'యాక్సిడెంటల్ డ్రౌనింగ్' అనే పదం వాడటం పలు అనుమానాలకు తావిస్తోంది.

డౌట్.. బోనీ..!

ఈ కేసులో సంబంధించి భర్త బోనీ కపూర్ చెబుతున్న కథనంతో కూడా కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీదేవిని సర్‌ప్రైజ్ చేయడానికి వచ్చానన్న బోనీ.. తామిద్దం సుమారు 15నిమిషాలు మాట్లాడుకున్నాం.. నవ్వుకున్నామని చెప్పారు. అనంతరం ఓ ఫంక్షన్‌కు వెళ్లాలని రెడీ కావాలని చెప్పగా.. ఆమె బాత్‌రూమ్‌కు వెళ్లిందని చాలాసేపటి వరకూ బయటికి రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెంది తలుపులు పగలగొట్టగా అపస్మారక స్థితిలో కనిపించిందనీ, దీంతో షాక్‌కు గురై స్నేహితుడికి ఫోన్ చేశాననీ, ఆ తర్వాత హోటల్ యాజమాన్యానికి చెప్పి సమీపంలో ఉన్న రషీద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు నిర్ధారించారని చెప్పారు. అయితే ఏదైనా స్టార్ హోటల్స్‌లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఎమర్జెన్సీ టీం ఉంటుంది.. వైద్యులు కూడా అందుబాటులో ఉంటారు. లేదంటే మెడికల్ హెల్ప్ ఇచ్చే ఏర్పాటు ఉంటుంది. మొదట హోటల్ వాళ్లకు చెప్పకుండా స్నేహితుడికి ఎందుకు చెప్పాల్సి వచ్చింది? ఆమె చనిపోయిం దని ధృవీకరించుకున్న తర్వాతే స్నేహితుడికి చెప్పారా? అసలు ఈ విషయాన్ని ఎందుకింత ఆలస్యంగా చెప్పాల్సి వచ్చింది?అనేవి మిస్టరీగా మారాయి.

అనుమానాలు..?

మొదట కుటుంబంతో కలిసి దుబాయ్ వెళ్లిన బోనీ ముంబైకి తిరిగొచ్చేసిన తర్వాత ఆ రెండ్రోజులు శ్రీదేవి బయటికి రాకుండా గదిలోనే ఉన్నారనే విషయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బోనీ, శ్రీదేవి కాల్ డేటాను పరిశీలించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. మరోవైపు ప్రాసిక్యూషన్ రంగంలోకి దిగడంతో రీ-ఇన్వెస్టిగేషన్ జరుగుతోంది. ఈ ఇన్వెస్టిగేషన్‌లో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి విచారణ జరుగుతుంది. ఫోరెన్సిక్ పూర్తి రిపోర్టు వచ్చిన తర్వాత మాత్రమే కుట్ర జరిగిందా? లేదా ఆత్మహత్యా? లేదా సహజ మరణమా? అన్నది తేలనుంది. ఆ తర్వాతే శ్రీదేవి పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనుమానాలున్న విషయం వాస్తవమే.. వీటిని నివృతి చేసుకునేందుకు న్యాయనిపుణులు, పోలీసు విభాగం ప్రయత్నాలు చేస్తున్నాయని సమాచారం.



శ్రీదేవి పార్థివ దేహాన్ని చివరిసారిగా చూసేందుకు వస్తున్న రజనీకాంత్, షబానా అజ్మీ, జావెద్ అక్తర్, రాణీ ముఖర్జీ, రేఖా, మాధురీ దీక్షిత్, టబు, ఫరాఖాన్, వెంకటేష్

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.